PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 45 సంచిక : 99 | విజయవాడ, సోమవారం 10 నవంబర్ 2025 | 6 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Monday 10 November 2025 | Rs

కళత్తూరు దళితవాడకు పునరావాసం కల్పించాలి

- ముఖ్యమంత్రికి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు లేఖ

2



ఈ చిన్ని నీలి చుక్కను కాపాడుకుందాం

6

ఆర్థిక అసమానతలు తీవ్రతరం

- పాతికేళ్లలో 2,655 రెట్లు పెరిగిన కుబేరుల సంపద
- నయా ఉదార విధానాలే ప్రధాన కారణం
- ఉపాధి కల్పనకు, ప్రభుత్వ సేవలకు ప్రాధాన్యత ఇవ్వాలన్న నిపుణులు

న్యూఢిల్లీ/జోహన్స్‌బర్గ్ : మన దేశంలోని 40 శాతం సంపద జనాభాలో ఒక్క శాతంగా వున్న కుబేరుల దగ్గర పోగైంది. గత 25 (2000-2024 మధ్య) సంవత్సరాల్లో సృష్టించిన దేశ సంపదలో 62 శాతం సంపదను వీరు స్వాధీనం చేసుకున్నారని జి 20 తాజా నివేదిక తెలిపింది. ఈ నెల 22, 23 తేదీలలో దక్షిణాఫ్రికా రాజధాని జోహన్స్‌బర్గ్‌లో నిర్వహించనున్న జి 20 శిఖరాగ్ర సమావేశం సందర్భంగా ఈ నివేదిక రూపొందించారు. ఈ సమావేశాలకు హాజరుకానని ట్రంప్ ప్రకటించిన సంగతి తెలిసిందే.

ఈ కాలంలో అట్టడుగున్న వున్న 50 శాతం జనాభా సంపదతో పోలిస్తే ఒక్క శాతంగా వున్న కుబేరుల సంపద 2,655 రెట్లు పెరిగిందని ఈ నివేదిక ప్రకటించింది. దేశంలో 25 సంవత్సరాల క్రితం తొమ్మిది మంది బిలీయనీర్లుండగా ప్రస్తుతం 350కి పెరిగారు. ఈ ధోరణి ప్రపంచవ్యాప్తంగా పెరిగిందని ఈ నివేదిక రూపొందించిన నిపుణులు ప్రకటించారు. అర్థశాస్త్ర నోబెల్ బహుమతి గ్రహిత ప్రొఫెసర్ జోసెఫ్ ఇ. స్టిగ్లిట్జ్, డాక్టర్ అడ్రియానా అబ్దేనూర్ (బ్రెజిల్), విన్నీ బ్యానిమా (ఉగాండా), ప్రొఫెసర్ జయతి ఘోష్ (భారత్), ప్రొఫెసర్ ఇమ్రాన్ వలోడియా, మరియు డాక్టర్ వాంగా జెంబే-మ్యాబిలే (దక్షిణాఫ్రికా) బృందం పెరుగుతున్న ఆర్థిక అసమాతనలను, వాటికి మూలమైన కారణాలను విశ్లేషించింది.

దక్షిణాఫ్రికా అధ్యక్షులు సిరిల్ రమాఫోసోకు అసమానతలపై నివేదిక అందజేస్తున్న నోబెల్ గ్రహిత్ ప్రొఫెసర్ జోసెఫ్ ఇ స్టిగ్లిట్జ్

తీవ్రతరమవుతున్న ఆర్థిక అసమానతలు.. సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో తీవ్ర దుష్ప్రభావాలను కలిగిస్తున్నాయని వీటని నివారించడం నేడు ప్రపంచం ముందు వున్న అతిపెద్ద సమస్య అని స్టిగ్లిట్జ్ స్పష్టం చేశారు. ప్రపంచంలో 90 శాతం జనాభా నివసిస్తున్న 83 దేశాల్లో ఆర్థిక అసమానతలు తీవ్రస్థాయికి చేరాయి. గత ఇరవై సంవత్సరాల్లో అనేక దేశాల్లో ప్రైవేట్ సంపద భారీగా పెరుగుతుంటే, సంపన్న దేశాలతో సహా ఆనేక దేశాల ప్రభుత్వాలు మాత్రం అప్పుల ఊబిలో కూరుకపోతున్నాయని ఈ నివేదిక తెలిపింది. 1980 నాటి ధరల ప్రకారం ప్రపంచవ్యాప్తంగా ప్రభుత్వ సంపద 48 ట్రిలియన్ డాలర్లు వుంటే 2024 నాటికి 50 ట్రిలయన్ డాలర్లకు మాత్రమే పెరిగిందని, ఇదే కాలంలో ప్రైవేట్ సంపద 80 ట్రిలియన్‌ల నుండి 500 ట్రిలియన్లకు పెరిగిందని ఈ నివేదిక గణాంకాలతో ప్రకటించింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వాలు ప్రకటిస్తున్న తలసరి ఆదాయ లెక్కలు వాస్తవాన్ని తిరకాసు చేసి చూపుతున్నాయి. నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా వున్న మన దేశం ప్రపంచ మానవాభివృద్ధిలో 193 దేశాల్లో 130వ దేశంగా, ఆకలి సూచిలో 131వ దేశంగా అట్టడుగున వుంది.

అసమానతల తీవ్రతరానికి ప్రధాన కారణం నయా ఉదారవాద ఆర్థిక విధానాలేనని ఈ నివేదిక తేల్చింది. ఈ విధానాల వల్ల 2000- 2024 మధ్య ధనవంతుల ఆదాయం సగటున 1,91,000 డాలర్లు పెరిగింది. ఇదే సమయంలో పేదల ఆదాయం మాత్రం గణనీయంగా తగ్గింది. పెరుగుతున్న ఆర్థిక అసమానతలు ప్రజల జీవన విధానం మీద తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయి. వ్యవసాయరంగం తీవ్ర సంక్షోభంలో వుంది. చాలా దేశాలలో యువత జీవిత అవకాశాలు తల్లితండ్రుల ఆదాయం మీద ఆధారపడి వున్నాయని, అందువల్ల వారు సరైన విద్య, ఉపాధి, వైద్యం, సామాజిక సౌకర్యాలను మిగతా 5లో

జపాన్ తీరంలో భారీ భూకంపం

- సునామీ హెచ్చరికలు జారీ
- అండమాన్‌లోనూ ప్రకంపనలు

టోక్యో, న్యూఢిల్లీ : జపాన్ తీరంలో ఆదివారం సాయంత్రం భారీ భూకంపం సంభవించింది. ఈ భారీ భూకంపం తరువాత కూడా వరస ప్రకంపనలు తీరాన్ని కుదిపేశాయి. దీంతో సునామీ హెచ్చరికల్ని జారీ చేశారు. జపాన్ వాతావరణ సంస్థ సమాచారం ప్రకారం ఆదివారం సాయంత్రం 5:12 గంటల ప్రాంతంలో ఉత్తర జపాన్‌లోని ఇవాటే ప్రిఫెక్చర్ తీరానికి సుమారు 70 కిలోమీటర్ల దూరంలో సముద్ర ఉపరితలం నుంచి 10 కిలోమీటర్లు లోతున ఈ భూకంపం సంభవించింది. దీని తీవ్రతను రిక్టార్‌పై 6.9గా గుర్తించారు. తరువాత కూడా వరుస ప్రకంపనలు వచ్చాయి. దీంతో జపాన్ పబ్లిక్ బ్రాడ్‌కాస్టర్ ఎన్‌హెచ్‌కె సునామీ హెచ్చరికలను జారీ చేసింది. జపాన్ ఉత్తర తీరంలో ఒక మీటర్ ఎత్తు వరకూ సునామీ వచ్చే అవకాశం ఉందని హెచ్చరించింది. సునామీ ప్రమాదం ఉన్నందున తీర ప్రాంతాలకు దూరంగా ఉండాలని ప్రజలకు విజ్ఞప్తి చేసింది. ఇవాటే ప్రిఫెక్చర్‌లోని ఒఫునాటో నగరం, ఒమినాటో పోర్టు వద్ద దాదాపు 10 సెంటీమీటర్ల మేర సముద్రపు అలలు ఎగసిపడ్డాయని, సునామీని గురించామని ఎన్‌హెచ్‌కె తెలిపింది. జపాన్ రైల్వే సమాచారం ప్రకారం ఈ ప్రాంతంలో బుల్లెట్ రైళ్లు ఆలస్యంగా నడిచాయి. భూకంపాల కారణంగా విద్యుత్ కోతలు ఏర్పడ్డాయని క్యోడో న్యూస్ తెలిపింది. ఈ ప్రాంతంలో ఉన్న ఒనాగావా అణు విద్యుత్ కేంద్రంలో ఎలాంటి ప్రమాదం సంభవించలేదని వార్తా సంస్థలు తెలిపాయి. అమెరికా సునామీ హెచ్చరికల వ్యవస్థ సమాచారం ప్రకారం దీని కంటే ముందు జపాన్‌లోని అతిపెద్ద ద్వీపమైన హొన్షు తూర్పు తీరంలో 6.26 తీవ్రతతో భూకంపం సంభవించింది. ఇందులో ఇవాటే ప్రాంతం కూడా ఉంది. ప్రపంచంలోనే అత్యధిక భూకంపాలకు గురయ్యే దేశాలలో జపాన్ ఒకటి. జపాన్ మార్చి 2011లో ఘోరమైన భూకంపం, సునామీని ఎదుర్కొంది.

సునామీ కారణంగా జపాన్‌లోని ఇవాటే తీరంలో సముద్రం ఉధృతి

అండమాన్ సముద్రంలో 5.4 తీవ్రతతో భూకంపం

అండమాన్ సముద్రంలో ఆదివారం 5.4 తీవ్రతతో భూకంపం నమోదైందని నేషనల్ సెంటర్ ఫర్ సిస్మోలజీ ప్రకటించింది. ఆదివారం మధ్యాహ్నం 12:06 గంటలకు భూకంపం సంభవించిందని, దీని కేంద్రం సముద్ర ఉపరితలానికి 90 కి.మీ ఉందని తెలిపింది. అండమాన్- నికోబార్ దీవుల్లోని కొన్ని ప్రాంతాలలో ప్రకంపనలు సంభవించాయని, అయితే ఎటువంటి ప్రాణనష్టం లేదా ఆస్తి నష్టం సంభవించినట్లు వార్తలు లేవని ఒక అధికారి తెలిపారు. అండమాన్- నికోబార్ దీవుల ప్రధాన కార్యదర్శి డాక్టర్ చంద్ర భూషణ్ కుమార్ మాట్లాడుతూ, ఆదివారం మధ్యాహ్నం 12:08 గంటల ప్రాంతంలో 5.4 తీవ్రతతో భూకంపం సంభవిం చిందన్నారు. ఉత్తర, మధ్య అండమాన్‌లోని మాయాబందర్, రంగట్ పరిసర ప్రాంతాల్లో ప్రకంపనలు సంభవించాయని చెప్పారు. ప్రజలకు నష్టం జరగకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకున్నామని చెప్పారు. పోర్ట్ బ్లెయిర్‌లోని డిస్ట్రిక్ట్ ఎమర్జెన్సీ ఆపరేషన్స్ సెంటర్ (డిఇఒసి) ప్రకారం, భూకంప కేంద్రం సముద్రంలోని బారెన్ ద్వీపానికి ఉత్తరాన 96 కిలోమీటర్ల లోతులో ఉంది. దేశంలోని ఏకైక క్రియాశీల అగ్నిపర్వతమైన బారెన్ ద్వీపం పోర్ట్ బ్లెయిర్ నుండి సముద్రం ద్వారా దాదాపు 140 కి.మీ దూరంలో ఉంది. ఈ ద్వీపస మూహంలో తరచుగా భూకంపాలు సంభవిస్తుంటాయి.

అనారోగ్యమే నిజమైన పేదరికం

- శంకర్ కంటి ఆస్పత్రిలో సూపర్ స్పెషాలిటీ బ్లాక్ ప్రారంభోత్సవ సభలో సిఎం చంద్రబాబు

2

ఉపరితల ఆవర్తనంతో మోస్తరు వర్షాలు

- భారత వాతావరణ సంస్థ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉత్తర తమిళనాడు, దాని పరిసర ప్రాంతాల్లో సగటు సముద్ర మట్టానికి 3.1 కిలోమీటర్ల ఎత్తులో ఉపరితల ఆవర్తనం కొనసాగుతుందని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. మరోవైపు నైరుతి బంగాళాఖాతం నుంచి కేరళ వరకూ, శ్రీలంక, తమిళనాడు మీదుగా సగటు సముద్ర మట్టానికి 0.9 కిలోమీటర్ల ఎత్తులో ఏర్పడిన ద్రోణి క్రమంగా బలహీన పడుతున్నట్లు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొంది. ఆంధ్రప్రదేశ్, యానాంలలో ఈశాన్య దిశగా గాలులు వీస్తున్నాయని, వీటి ఫలితంగా రాష్ట్రంలో ఉత్తర కోస్తాంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో సోమ, మంగళవారాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు ఒకట్రెండు చోట్ల పడే అవకాశం ఉందని వెల్లడించింది.

ఏనుగుల నష్టాలకు చెక్

ముసలిమడుగులో ఏనుగుల క్యాంప్ ప్రారంభోత్సవంలో పవన్ కల్యాణ్



కుంకీ ఏనుగులకు ఆహారం తినిపిస్తున్న పవన్ కల్యాణ్

ప్రజాశక్తి- పలమనేరు (చిత్తూరు జిల్లా)

ఏనుగుల వల్ల ఎలాంటి ప్రాణ నష్టం, ఆస్తి నష్టం జరగకుండా చూడాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, అటవీ శాఖ మంత్రి కొణిదెల పవన్ కల్యాణ్ అన్నారు. చిత్తూరు జిల్లా పలమనేరు మండలం ముసలిమడుగులో అటవీ శాఖ ఆధ్వర్యాన కుంకి ఏనుగుల శిక్షణా కేంద్రంలో ఏర్పాటు చేసిన ఏనుగుల క్యాంప్‌ను ఆదివారం ఆయన ప్రారంభించారు. అందుకు సంబంధించిన శిలాఫలకాన్ని పవన్ కల్యాణ్ ఆవిష్కరించారు. ఇక్కడ ఏర్పాటు చేయనున్న గజారామం నగర వనానికి, సౌర శక్తితో పనిచేసే అటవీ ఏనుగుల నిరోధక కంచె నిర్మాణానికి పునాది రాయి వేశారు. అనంతరం హనుమాన్ ప్రాజెక్ట్ అంశంపై లైన్ డిపార్ట్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ అడవి ఏనుగులను మార్గనిర్దేశం చేయడానికి, నియంత్రించ డానికి, సురక్షితం గా అడవికి తరిమికొట్టడానికి ప్రత్యేకంగా శిక్షణ పొందిన కుంకి ఏనుగుల అవసరాన్ని అటవీ శాఖ గుర్తించిందని తెలిపారు. చిత్తూరు, పలమనేరు, కుప్పం ప్రాంతాల్లో ఏనుగుల దాడి కారణంగా 23 మంది మృతి చెందారని, 34 పశువులు మరణించాయని అన్నారు. నాలుగు వేల ఎకరాలకుపైగా పంటలు నాశనమయ్యాయని తెలిపారు. అటవీ ప్రాంతం అంచున ఉన్న అనేక గ్రామాల్లో ఏనుగుల దాడులు భాగమైపోయాయని, రైతులు తమ పంటలను రక్షించుకోవడానికి రాత్రిపూట మేల్కొని ఉండాల్సి వస్తోందని తెలిపారు. శిక్షణ పొందిన నాలుగు కుంకి ఏనుగులు కృష్ణ, అభిమన్యు, దేవ, రంజన్‌లను ఈ ఏడాది మే 21న కర్ణాటక నుండి రప్పించి ముసలమడుగులో ఉంచి శిక్షణ ఇచ్చామన్నారు. అదనంగా మరో రెండు రాష్ట్ర ఏనుగులు జయంత్, వినాయక్‌లను ననియాల ఏనుగు శిబిరం నుండి బదిలీ చేశామని, ఈ ఆరు ఏనుగులతో బృందాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. అనంతరం శిక్షణలో కుంకీ ఏనుగులు చూపుతున్న మెలకువలు, ఇటీవల జరిగిన ఆపరేషన్లను పవన్ కల్యాణ్‌కు అధికారులు వివరించారు. ఈ సందర్భంగా కుంకీ ఏనుగులు ప్రత్యేకంగా చేసిన ప్రదర్శన ఆకట్టుకుంది. క్రమబద్ధంగా కుంకీ ఏనుగులు వరుసగా వస్తూ ఘీంకారం చేస్తూ పవన్ కల్యాణ్‌కు సెల్యూట్ చేశాయి. అడవిలో లభ్యమయ్యే వివిధ రకాల కలపను ఏనుగుల సహాయంతో ఎలా బయటకు తీసుకువచ్చేదీ ఏనుగులతో అధికారులు ప్రదర్శింపజేశారు. ఏనుగులకు మత్తు ఇచ్చే ఇంజెక్షన్ గన్‌ను డిప్యూటీ సిఎం ఆసక్తిగా తిలకించారు. అనంతరం ఏనుగులకు ఆయన స్వయంగా బెల్లం ఆహారం అందించారు. గజరాజుల నుంచి ఆశీర్వచనం తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో పర్యావరణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కాంతిలాల్ దండే, కలెక్టర్ సుమిత్ కుమార్, వన్యప్రాణుల అదనపు అధికారి శాంతి ప్రియ పాండే, అటవీ సంరక్షణ అధికారి అనంతపురం సర్కిల్ ఆర్.యశోదబాయి తదితరులు పాల్గొన్నారు.

బీహార్‌లో ఆదివారం ఎన్నికల ప్రచారసభలో మాట్లాడుతున్న తేజస్వియాదవ్

రేపు బీహార్‌లో రెండోవిడత పోలింగ్

- ముగిసిన ఎన్నికల ప్రచారం
- బరిలో1302 మంది అభ్యర్థులు
- 3.70 కోట్లకుపైనే ఓటర్లు..

రాంచీ : బీహార్‌లో రెండో విడత ఎన్నికల ప్రచారం ఆదివారం సాయంత్రంతో ముగిసింది. 243 స్థానాలున్న బీహార్ అసెంబ్లీకి ఈ నెల 11న (మంగళవారం) 20 జిల్లాల పరిధిలోని మిగతా 122 సీట్లకు ఓటింగ్ జరగనుంది. బరిలో 1302 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. 3.70 కోట్లకుపైగా ఓటర్ల చేతిలో అభ్యర్థుల భవితవ్యం తేలనున్నది. రెండో విడత జరగనున్న పోలింగ్ సజావుగా నిర్వహించేందుకు 1650 భద్రతాబలగాల కంపెనీలను మోహరించనున్నట్లు బీహార్ డిజిపి తెలిపారు. ఈనెల 6న 18 జిల్లాల పరిధిలోని 121 నియోజకవర్గాల్లో తొలిదశ పోలింగ్ జరిగింది. ఈసారి అధికార ఎన్‌డిఎ, మహాఘట్ మిగతా 5లో

అంగీకరించిన అంశాలపై జిఓలు విడుదల చేయాలి

- కనీస వేతనాల అమలు, పర్మినెంట్ కోసం ఉద్యమాలు
- సిహెచ్‌డబ్ల్యులను ఆశాలుగా గుర్తించాలి
- ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర మహాసభ డిమాండ్

3

227 మంది వైద్య నిపుణుల నియామకం

- వైద్యారోగ్యశాఖ

2

కాప్-30 పయనం ఎటు?

వి రాజాగోపాల్

బ్రెజిల్‌లోని బెలెం నగరంలో సోమవారం (నవంబర్ 10) నుండి ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలో ప్రపంచ వాతావరణ సదస్సు (కాన్ఫరెన్స్ ఆఫ్ పార్టీస్ -కాప్ 30) ప్రారంభం కానుంది. గత దశాబ్ద కాలంగా పర్యావరణ పరిరక్షణ కోసం తక్షణ చర్యలు అవసరమని మాటలు మాత్రమే చెబుతూ అడుగు ముందుకు వేయని దేశాల వైఖరిలో ఈ సారైనా మార్పు వస్తుందా అన్నది చర్చనీయాంశంగా మారింది. ఐక్యరాజ్యసమితి 'ఆచరణ' (ఇంప్లిమెంటేషన్) సదస్సుగా తాజా సదస్సును పేర్కొంటుండటం 30వ కాప్ ప్రాధాన్యతను పెంచింది. అంతేకాదు. వాతావరణ చర్చల్లో అత్యంత కీలకంగా భావించే 1992 నాటి ఎర్త్ సమ్మిట్ ఒకప్పటి బ్రెజిల్ రాజధాని నగరమైన రియో డిజనీరోలో జరిగింది. ఆ సమావేశంలోనే ఫ్రేమ్‌వర్క్ కన్వెన్షన్ ఆన్ క్లైమేట్ చేంజ్ (యుఎన్‌ఎఫ్‌సిసిసి) ఏర్పాటైంది. ఆ తరువాత బ్రెజిల్‌లో జరుగుతున్న వాతావరణ సదస్సు ఇదే కావడం గమనార్హం. అదికూడా భూగోళానికి ఊపరితిత్తులుగా భావించే అమెజాన్ అడవులకు అత్యంత సమీపంలోని బెలెం నగరంలో జరుగుతుండటం కూడా ప్రాధాన్యత సంతరించుకుంది. పెరుగుతున్న భూతాపం కారణంగా అమెజాన్ అడవులు పెద్దఎత్తున నష్టపోతున్న సంగతి తెలిసిందే. గత ఏడాది బాకులో జరిగిన 29వ వాతావరణ సదస్సు తీవ్ర నిరాశను మిగిల్చిన నేపథ్యంలో అమెజాన్ గేట్‌వే నగరమైన బెలెంలో తాజాగా జరుగుతున్న సమావేశంలో వివిధ దేశాలు కొంత మేరకు ఉదారంగా వ్యవహరించే అవకాశం ఉందన్న ఆశాభావం ప్రపంచవ్యాప్తంగా పర్యావరణ వేత్తలలో వ్యక్తమవుతోంది. సమావేశాలు ముగిసి, తుది నిర్ణయాలు వెలువడితే కానీ ఈ ఆశలలో వాస్తవాలు ఎంతో తేలవు! బాకులో అంగీకరించబడిన వాతావరణ ఆర్థిక లక్ష్యాన్ని (క్లైమేట్ ఫైనాన్స్) ఆచరణలోకి తీసుకరావడంతో పాటు అభివృద్ధి చెందుతున్న దేశాలు డిమాండ్ చేసిన మొత్తాన్ని సాధించడం ఈ సదస్సు ముందు ఉన్న ప్రధాన కర్తవ్యం.

కొత్త లక్ష్యాలు...

ప్రారంభం కాకముందు కాప్ 30కి ప్రాముఖ్యత లభించడానికి మరో కారణం కూడా ఉంది. ఈ సదస్సులో ప్రతి సభ్య దేశం తన కొత్త వాతావరణ లక్ష్యాలను (నేషనల్లీ డిటర్‌మైన్డ్ కంట్రిబ్యూషన్స్-ఎన్‌డిసి) ప్రకటించనుంది. 2026వ సంవత్సరం నుండి 2035 సంవత్సరంలోగా ఆ లక్ష్యాలను సాధించడానికి ఆ దేశాలు ఈ సదస్సులో ప్రతిన పూనుతాయి. యుఎన్‌ఎఫ్‌సిసి ఇప్పటికే విడుదల చేసిన ఒక నివేదిక ప్రకారం 65 దేశాలు ఇప్పటికే కొత్త ఎన్‌డిసిలను ప్రకటించాయి, వీటిలో 13 అభివృద్ధి చెందిన దేశాలు, 52 అభివృద్ధి చెందుతున్న దేశాలు ఉన్నట్లు ఆ నివేదికలో పేర్కొన్నారు. 2019 నాటి స్థాయిలో పోలిస్తే బేషరతు చర్యల ద్వారా 17శాతానికి, షరతులతో కూడిన లక్ష్యాలను కూడా చేరిస్తే 24 శాతానికి కాలుష్య కారక ఉద్గారాలను తగ్గిస్తామని వివిధ దేశాలు పేర్కొన్నాయి. ఇక్కడ ఒక ఆసక్తికరమైన విషయం ఏమిటంటే అభివృద్ధి చెందిన దేశాలు దేశీయ ఉద్గార తగ్గింపులు, ప్రత్యామ్నాయ ఇంధన వనరులు, సాంకేతిక ఆవిష్కరణలు గురించి మాట్లాడుతుండగా అభివృద్ధి చెందుతున్న దేశాలు ఆర్థిక సహాయం కోసం విజ్ఞప్తి చేస్తున్నాయి. అభివృద్ధి చెందిన దేశాలనుండి ఆర్థిక సాయం లేకండా తాము ఏమీ చేయలేమని ఆ దేశాలు స్పష్టం చేస్తున్నాయి. ఎన్‌డిసిలు ప్రకటించిన అభివృద్ధి చెందుతున్న దేశాలు అందజేసిన నివేదికల ప్రకారం కొత్త వాతావరణ లక్ష్యాలను సాధించడానికి 1.2 ట్రిలియన్ డాలర్లు (సుమారు 100 లక్షల కోట్ల రూపాయలు) అవసరమవుతాయని, ఆ మొత్తాన్ని అభివృద్ధి చెందిన దేశాలు అందించాలని కోరాయి. వీటిలో 20 దేశాలు వాతావరణ విపత్తుల నుండి రక్షణ చర్యల కోసం 533 బిలియన్ డాలర్లు అవసరమౌతాయని అంచనా వేశాయి.

'దుబాయ్ లక్ష్యాలు' ఎంత దూరం?

కాప్ 28 (దుబాయ్)లో స్వీకరించిన లక్ష్యాల ప్రకారం 2030 నాటికి పునరుత్పాదక శక్తి సామర్థ్యాన్ని మూడు రెట్లు పెంచాలి, బొగ్గు వినియోగాన్ని తగ్గించాలి, మీథేన్ ఉద్గారాలను నియంత్రించాలి అని నిర్ణయించారు. కానీ, ఆచరణ మాత్రం చాలా నెమ్మదిగా ఉంది. 2030 నాటికి 11,583 గిగావాట్ల పునరుత్పాదక విద్యుత్ సామర్థ్యాన్ని అందుకోవాలని లక్ష్యంగా పెట్టుకోగా ప్రస్తుతమున్న పద్ధతుల్లో సాగితే కేవలం 9,530 గిగావాట్లను మాత్రమే అందుకోగలమని అంచనా వేస్తున్నారు. కొంత మేరకు బొగ్గు వినియోగాన్ని తగ్గించినా, అది చాలదు. మీథేన్ ఉద్గారాలు 2010 -2024 మధ్య పెరుగుతూనే ఉన్నాయి. రోడ్డు రవాణా ఉద్గారాలు తగ్గినా కొంత తగ్గినా ఇంకా చాలా సాధించాల్సిఉంది.

నిధులే కీలకం!

వాతావరణ లక్ష్యాలను సాధించడంలో నిధుల పాత్రే కీలకంగా మారుతోంది. గత ఏడాది బాకులో జరిగిన కాప్29లో నిధుల సమీకరణకు తీసుకున్న నిర్ణయాల కొనసాగింపుగా బ్రెజిల్ అధ్యక్షతన 'బాకు టు బెలెం' రోడ్‌మ్యాప్‌ను రూపొందించారు. బాకు సదస్సులో సంవత్సరానికి కేవలం 300 బిలియన్ డాలర్ల ఆర్థికసాయం చేయడానికి మాత్రమే అభివృద్ధి చెందిన దేశాలు అంగీకరించాయి. 2035 నాటికి ఈ మొత్తాన్ని ఏడాదికి 1.3 ట్రిలియన్ డాలర్లకు పెంచడాన్ని లక్ష్యంగా రోడ్‌మ్యాప్‌లో పేర్కొన్నారు. ప్రణాళికలో ఈ బాధ్యతను ప్రభుత్వ రంగం నుండి ప్రైవేటు రంగానికి, గ్లోబల్ సౌత్ దేశాలపైకి నెట్టివేయడానికి ప్రయత్నం చేశారన్న విమర్శలు వస్తున్నాయి. దీనిపై కాప్-30లో వివిధ దేశాలు ఎలా స్పందించనున్నాయో చూడాల్సిఉంది.

ఇదే తరహాలోఉష్ణమండల అడవులకు శాశ్వత సౌకర్యం (ట్రాఫికల ఫారెస్ట్ ఫరెవర్ పెసిలిటి -టిఎఫ్‌ఎఫ్‌ఎఫ్) పేరిట బ్రెజిల్ చేసిన ప్రతిపాదన కూడా వివాదాస్పదంగా మారింది. 125 బిలియన్ డాలర్ల నిధుల సమీకరణ లక్ష్యంగా చేసిన ఈ ప్రతిపాదన సారాంశం అడవులను, ఆదివాసీలను కార్పొరేట్లకు అప్పగించడమే కావడం ఆ వివాదానికి కారణం.

న్యాయమైన మార్పేనా... !

ఇంధన రంగంలో 'మార్పు మాత్రమే... (జస్ట్ ట్రాన్సిషన్) అంటూ అభివృద్ధి చెందుతున్న దేశాలు చేస్తున్న ప్రచారంపై కాప్30లో విస్తృత చర్చ జరిగే అవకాశం ఉందని భావిస్తున్నారు. మార్పు అవసరమే కానీ, అభివృద్ధి చెందుతున్న, పేద దేశాలకు. ఆ దేశాల్లోని ప్రజలకు అన్యాయం జరగకుండా చూడాలన్న వాదన గట్టిగా వినపడుతోంది. వాణిజ్య చర్యల పేరిట అమెరికాతో పాటు పలు అభివృద్ధి చెందుతున్న దేశాలు చేపడుతున్న చర్యలను జి-77 దేశాలతో పాటు చైనా తీవ్రంగా ప్రశ్నిస్తోంది. 'మార్పు మాత్రమే... కానీ, అది న్యాయంగా ఉండాలి' అని ఈ దేశాలు డిమాండ్ చేస్తున్నాయి. అందువల్ల 'మార్పు మాత్రమే' అని కాకుండా 'న్యాయమైన మార్పు'గా అజెండాలో చేర్చాలని ఆ దేశాలు కోరుతున్నాయి. రక్షణ చర్యలకు సంబంధించిన జాతీయ ప్రణాళికలను (నేషనల్ అడాప్షన్ ప్లాన్స్)ను ఇప్పటి వరకు 67 దేశాలు అందచేశాయి. మన దేశం కూడా ఈ జాబితాలో ఉంది. అయితే, రక్షణ చర్యలకు కేటాయించే నిధులను రెండింతలు పెంచాలంటూ కాప్ 26లో తీసుకున్న నిర్ణయం ఇంకా అమలులోకి రాలేదు. లాస్ అండ్ డ్యామేజి ఫండ్ ప్రస్తుతం అందుబాటులోకి వచ్చినా, అందుబాటులో ఉన్న నిధులు చాలా తక్కువ. అందువల్ల అభివృద్ధి చెందుతున్న దేశాలు 2030 నాటికి అడాప్షన్ ఫైనాన్స్‌ను 30 శాతానికి పెంచాలని కోరుతున్నాయి.

అదే విధంగా, ప్యారిస్ ఒప్పందంలో ఆర్థిక సహాయానికి సంబంధించిన 2.1 ఆర్టికల్ గడువు ఈ ఏడాది సెప్టెంబర్‌తో ముగిసింది. దీంతో ఆ మేరకు నిధుల ప్రవాహం ఆగిపోయే ప్రమాదం ఉంది. దానిని పొడిగించాలని అభివృద్ధి చెందుతున్న దేశాలు కోరుతున్నాయి. అదేవిధంగా ఆర్టికల్ 9.1లో వాతావరణ మార్పుల కారణంగా సంభవించే విపత్తుల నుండి రక్షణ, సహాయ చర్యలకోసం అభివృద్ధి చెందిన దేశాలు ఇచ్చే నిధులను ప్రత్యేక సాయంగా చూడాలని, ఆ దేశాల బాధ్యతగా దీనిని గుర్తించాలని లైక్ మైండెడ్ డెవలపింగ్ కంట్రీస్ (ఎల్‌ఎండిసి) కాప్ 29లో వాదించాయి. ఈ వాదనను అభివృద్ధి చెందిన దేశాలు గట్టిగా తిరస్కరించాయి. తాము ఇప్పటికే చాలా చేస్తున్నామని, ప్రత్యేక సహాయాలు తమ వల్ల కాదని ఆ దేశాలు వాదించాయి.

ఈ నేపథ్యంలో కాప్-30లో కూడా ఈ అంశం చర్చకు వచ్చే అవకాశముందని భావిస్తున్నారు. మొత్తం మీద అత్యంత కీలకంగా మారిన నిధుల సమస్యకు కాప్-30లోనైనా సమాధానం లభిస్తుందా అనేది చూడాల్సివుంది.

అనారోగ్యమే నిజమైన పేదరికం

- కంచిపీఠం సేవలు ముదావాహం
- శంకర్ కంటి ఆస్పత్రిలో సూపర్ స్పెషాలిటీ బ్లాక్ ప్రారంభోత్సవ సభలో సిఎం చంద్రబాబు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ఆరోగ్యంగా లేకపోతే ఎన్ని ఆస్తులున్నా నిరుపయోగమేనని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. గుంటూరు జిల్లా పెదకాకానిలోని శంకర్ కంటి ఆస్పత్రి ప్రాంగణంలోనే ప్రపంచ స్థాయి ప్రమాణాలతో నిర్మించిన సూపర్ స్పెషాలిటీ ఐ కేర్ బ్లాక్‌ను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో చంద్రబాబు మాట్లాడుతూ... డబ్బు, బంగ్లాలు, కార్లు, హోదా ఎన్ని ఉన్నా మంచి ఆరోగ్యం లేకపోతే ఉపయోగం లేదన్నారు. అనారోగ్యమే నిజమైన పేదరికమని, ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ ఇతరులకు సేవ చేయాలని కోరారు. ప్రజారోగ్యాన్ని కాపాడేందుకు కంచిపీఠం ద్వారా శంకర్ ఆస్పత్రి చేస్తున్న సేవలను కొనియాడారు. శంకర్ కంటి ఆస్పత్రుల ద్వారా దేశవ్యాప్తంగా పది రాష్ట్రాల్లో 14 ఐ హాస్పిటల్స్ నిర్మించి ఇప్పటి వరకు 30 లక్షల మందికి ఉచితంగా కంటి శస్త్ర చికిత్సలు, 70 లక్షల మంది చిన్నారులకు కంటి పరీక్షలు చేయడం సాధారణ విషయం కాదన్నారు. ఈ ఆస్పత్రుల్లో రోజుకు సగటున 750 ఉచిత కంటి శస్త్ర చికిత్సలు జరుగుతున్నాయని వివరించారు.

ఆస్పత్రి భవనాన్ని రిమోట్‌తో ప్రారంభిస్తున్న సిఎం చంద్రబాబు, పక్కన శంకర విజేయంద్ర సరస్వతి, పెమ్మసాని తదితరులు

2003 నుంచి గుంటూరులో నిర్మించిన శంకర్ ఆస్పత్రి పేదలకు ఉచిత వైద్యం అందించడం ముదావాహం అన్నారు. శంకర్ ఆస్పత్రి ద్వారా గ్రామీణ సేవా ప్రాజెక్ట్ 'గిఫ్ట్ ఆఫ్ విజన్' కింద ఇప్పటివరకు 32,000కు పైగా కంటి శిబిరాలు నిర్వహించడం విశేషమని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఐదు కోట్ల మంది ఆరోగ్యాన్ని కాపాడేందుకు ఆరోగ్య రికార్డులన్నీ డిజిటలైజేషన్ చేస్తున్నామని తెలిపారు. రాబోయే రోజుల్లో ఆరోగ్యం విషయంలో ప్రపంచానికి ఎపి ఒక మోడల్‌గా ఉంటుందన్నారు. హెల్తీ, వెల్తీ, హ్యాపీ ఎపి అనేది మా విధానమని తెలిపారు. కంచి పీఠం స్వామీజీ శ్రీ శంకర విజేయంద్ర సరస్వతి మాట్లాడుతూ.. తమ పీఠం విద్య, వైద్యం, పేదరిక నిర్మూలన వంటి పలు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తోందన్నారు. కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ప్రభుత్వ చీఫ్ విప్ జి.వి.ఆంజనేయులు, ఎమ్మెల్యేలు దూళిపాళ్ల నరేంద్ర, బూర్ల రామాంజనేయులు, ఏలూరు సాంబశివరావు, తెనాలి శ్రావణ్‌కుమార్, ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ చైర్మన్ మన్నవ మోహన్‌కృష్ణ, శంకర్ కంటి ఆస్పత్రుల ట్రస్టు నిర్వాహకులు పద్మశ్రీ ఆర్.వి.రమణ, జె.కె.రెడ్డి, మురళీకృష్ణమూర్తి, జానకిరాం తదితరులు పాల్గొన్నారు.

విపత్తుల బాధితులను ఆదుకునేందుకే 'యువ ఆపదమిత్ర'

- విపత్తుల నిర్వహణ సంస్థ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

విపత్తులు సంభవించినప్పుడు బాధితులను ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం యువ ఆపదమిత్ర పథకం ప్రారంభించిందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఎమ్‌డి ప్రఖర్‌జైన్ వెల్లడించారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. విపత్తులు సంభవించిన సందర్భాల్లో సహాయం అందించడం, ప్రథమ చికిత్స అందించడంతోపాటు వెంటనే రక్షణ చర్యలు చేపట్టేలా సామర్థ్యాలను పెంపొందించడమే యువ ఆపదమిత్ర పథకం లక్ష్యమని పేర్కొన్నారు. ఇందులో భాగంగా ఒడిశా రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఐదు రాష్ట్రాలకు చెందిన వాలంటీర్లకు 'యువ ఆపదమిత్ర పథకం' ద్వారా శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించిందన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి 52 మంది వాలంటీర్లను గుర్తించి వారికి 21 రోజులు శిక్షణ ఇచ్చారని తెలిపారు. వాలంటీర్లు విపత్తుల సమయంలో ఎన్‌డిఆర్‌ఎఫ్, ఎస్‌డిఆర్‌ఎఫ్, పోలీస్, అగ్నిమాపక దళాలకు అండగా నిలిచేలా శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు.

రేపు ముఖ్యమంత్రితో కేంద్ర బృందం భేటీ

మొంథా తుపానుతో నష్టపోయిన ప్రాంతాలను కేంద్ర బృందాలు సోమ, మంగళవారాల్లో పర్యటించిన అనంతరం ఈ నెల 11న సాయంత్రం సిఎం చంద్రబాబుతో భేటీ కానున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం పంపిన అంచనాలు, క్షేత్రస్థాయిలో పర్యటించిన అనంతరం వారు సేకరించిన నష్టం అంచనాలను ముఖ్యమంత్రికి వివరించిన అనంతరం నివేదికను కేంద్ర ప్రభుత్వానికి అందించనున్నారు.

227 మంది వైద్య నిపుణుల నియామకం

- వైద్యారోగ్యశాఖ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రభుత్వ సెకండరీ ఆస్పత్రుల్లో స్పెషలిస్ట్ వైద్యుల కొరత తీర్చేలా 227 మంది పిజి పూర్తి చేసిన వైద్యులు విధుల్లో చేరనున్నారని వైద్యారోగ్యశాఖ వెల్లడించింది. ఇన్ సర్వీస్ అభ్యర్థులుగా 12 సబ్జెక్టుల్లో పిజి పూర్తి చేసిన 227 మంది వైద్య నిపుణులను 142 సెకండరీ ఆస్పత్రులకు కేటాయించినట్లు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొంది. 100 పిహెచ్‌సిల్లో 155 మంది స్పెషలిస్ట్ వైద్యులు త్వరలో విధుల్లో చేరనున్నారని, 33 ఏరియా ఆస్పత్రుల్లో 60 మంది, 7 జిల్లా ఆస్పత్రుల్లో 10 మంది, 2 ఎంసిహెచ్ ఆస్పత్రుల్లో ఇద్దరు స్పెషలిస్ట్ వైద్యులకు కౌన్సెలింగ్ విధానంలో పోస్టింగు ఇచ్చినట్లు తెలిపింది. మొత్తం 227 మందిలో 35 మంది గైనకాలజిస్టులు, జనరల్ మెడిసిన్ స్పెషలిస్టులు, 30 మంది జనరల్ సర్జరీ వైద్యులు, 26 మంది మత్తు (అనస్తీషియా) వైద్యులు, 25 మంది పిల్లల వైద్య నిపుణులు, 18 మంది ఎముకల వైద్యులు, 17 మంది రేడియాలజిస్టులు, 15 మంది కంటి వైద్య నిపుణులు, 9 మంది చెవి, ముక్కు, గొంతు (ఇఎన్‌టి) వైద్య నిపుణులు ఆయా ఆస్పత్రుల్లో సేవలు అందించనున్నారని వెల్లడించింది. అత్యధికంగా గూడూరు ఏరియా ఆస్పత్రికి నలుగురు స్పెషలిస్టుల్ని కేటాయించినట్లు తెలిపింది. వీరిలో పిల్లల వైద్యుడు రేరియాలజిస్ట్, చర్మవ్యాధి నిపుణుడు, పాథాలజిస్ట్ ఉన్నారని పేర్కొంది. 7 సిహెచ్‌సిలు, 6 ఏరియా ఆస్పత్రుల్లో ముగ్గురు చొప్పున స్పెషలిస్టుల్ని నియమించారని వెల్లడించింది. 31 సిహెచ్‌సిల్లో ఇద్దరు చొప్పున, 13 ఏరియా ఆస్పత్రుల్లో ఇద్దరేసి, 3 జిల్లా ఆస్పత్రులకు ఇద్దరు చొప్పున వైద్య నిపుణులను నియమించినట్లు పేర్కొంది. మరో 97 ఆస్పత్రులకు ఒక్కరేసి నిపుణులను కేటాయించినట్లు తెలిపింది. 2022-23 ఇన్ సర్వీసు డాక్టర్లుగా వివిధ పిజి కోర్సుల్లో చేరిన మొత్తం 257 మంది పిహెచ్‌సి డాక్టర్లు తాజాగా పిజి కోర్సుల్ని పూర్తి చేయగా, వారిలో 227 మందిని సెకండరీ ఆస్పత్రుల్లో నియమించినట్లు తెలిపింది. ఖాళీలు లేకపోవడంతో మరో 30 మందిని డిఎంఇ ఆస్పత్రుల్లో ట్యూటర్లుగా నియమించినట్లు ఆ శాఖ వెల్లడించింది.

కేంద్ర ప్రభుత్వ వాహన చట్టం..ప్రయాణికులకు ప్రాణాంతకం

- రాష్ట్ర ప్రభుత్వాల ఆదాయానికీ గండి

ప్రజాశక్తి- అనంతపురం ప్రతినిధి

కేంద్ర ప్రభుత్వం వాహన చట్టంలో చేసిన మార్పుల వల్ల ప్రయాణికుల ప్రాణాల మీదకు వస్తోంది. రాష్ట్ర ప్రభుత్వాల ఆదాయానికీ గండిపడుతోంది. కేంద్ర ప్రభుత్వం ఆల్ ఇండియా టూరిస్టు పర్మిట్ల జారీలో మార్పులు చేస్తూ 2023లో గెజిట్ విడుదల చేసింది. అప్పటి వరకు ఏదైనా ట్రావెల్ బస్సు తిరిగే ప్రాంతాల్లోనే ఏదొక రాష్ట్రంలో తప్పకుండా రిజిస్ట్రేషన్ అయి ఉండాలన్న నిబంధన ఉండేది. ట్రావెల్ యజమానుల ఒత్తిడితో దేశంలో ఏ రాష్ట్రంలో ఆల్ ఇండియా టూరిస్టు పర్మిట్ పొందినా సరిపోతుందని నిబంధనల్లో కేంద్రం మార్పులు తెచ్చింది. దీన్ని అవకాశంగా తీసుకుని ట్రావెల్ యజమానులు ఆల్ ఇండియా పర్మిట్‌కు ఎక్కడ తక్కువ ఫీజు ఉంటే అటువైపు వెళ్తున్నారు. నాగాలాండ్, అరుణాచల్‌ప్రదేశ్, డయ్యూ డామన్ తదితర ప్రాంతాల్లో ఆల్‌ఇండియా పర్మిట్ ఏడాదికి రూ.90 వేలు ఉంది. మన రాష్ట్రంలో రూ.6.50 లక్షల వరకు చెల్లించాలి. ఈ నేపథ్యంలో మన రాష్ట్రంలోని ట్రావెల్ యజమానులు, ప్రధానంగా బస్సు యజమానులు తక్కువ ఫీజు ఉన్న రాష్ట్రాల్లో రిజిస్ట్రేషను చేయిస్తున్నారు. ఈ నిబంధన తర్వాత మన రాష్ట్రం నుంచి 600లకుపైగా బస్సులను ఇతర రాష్ట్రాల్లో రిజిస్ట్రేషన్లు చేసుకున్నట్లు తెలుస్తోంది. కేంద్రం తీసుకొచ్చిన ఈ మార్పుతో ఒకచోట అనుమతులు తీసుకొని మరోచోట తిరుగుతుండడంతో భద్రతా పర్యవేక్షణ గాల్లో దీపంలా మారింది. రవాణా శాఖాధికారులు నామమాత్రపు తనిఖీలతో వదిలేస్తున్నారని, వాహనంలో నిబంధనల ప్రకారం భద్రతా ప్రమాణాలున్నాయా? లేదా? అనేది పట్టించుకోవడం లేదని, దీనివల్ల వాహన ప్రమాదాల్లో ప్రజలు ప్రాణాలు కోల్పోవాల్సి వస్తోందని విమర్శలు ఉన్నాయి.

కర్నూలు వద్ద బస్సు దగ్ధమై 19 మంది సజీవ దహనమైన తర్వాత రవాణా శాఖ నష్టనివారణ చర్యలు చేపట్టింది. రాష్ట్ర వ్యాప్తంగా ముమ్మర తనిఖీలు చేపడుతోంది. బస్సుల్లో భద్రత ఏర్పాట్లు ఉన్నాయా? లేదా? అని పరిశీలించడంతోపాటు బాడీ నిర్మాణంలోనూ నిబంధనలు పాటించారా? లేదా? అన్నది పరిశీలిస్తోంది.

రవాణా శాఖకు సంబంధించి కొన్ని స్వీయ తప్పిదాలు కూడా ఉన్నట్టు గుర్తించినట్టు తెలుస్తోంది. ప్రధానంగా పర్మిట్‌లో సీటింగు విషయంలో పాత సాఫ్ట్‌వేర్ ప్రకారమే ఆర్‌సిలో కూడా ఉండడంతో స్లీపర్ అనుమతులు ఉన్నప్పటికీ సీటింగు అనే వస్తున్నట్టు సమాచారం.

ఇప్పుడు రవాణా శాఖ దాన్ని సరిచేసే పనిలో ఉంది. రాష్ట్రంలో గతంలో సిటిజన్ యాప్ అనే సాఫ్ట్‌వేర్ ద్వారా రవాణా శాఖకు సంబంధించిన పత్రాలు జారీ అయ్యేవి. కేంద్ర ప్రభుత్వం రవాణా శాఖలో తీసుకొచ్చిన మార్పుల్లో భాగంగా ఇప్పుడు పరివాహన్ యాప్‌లో రవాణా శాఖ పత్రాలు జారీ అవుతున్నాయి. అయితే, పాత సిటిజన్ యాప్‌లో వాహనం స్లీపర్ అయినప్పటికీ సిటింగు ఆప్షన్ మాత్రమే ఉండడంతో అదే ఆర్‌సిలోనూ ఉంటూ వచ్చింది. దీన్ని ఇప్పుడు సరిచేస్తున్నారు. వాహన కొనుగోలు సమయంలో మాన్యుఫాక్చర్ ఇచ్చిన ప్రకారం అందులో స్లీపర్ ఉంటే స్లీపర్‌గా మారుస్తున్నారు. అది లేకపోతే మాత్రం వాహనాన్ని మాన్యుఫాక్చర్ ఇచ్చిన ప్రకారం వాహనంలో మార్పులు చేసుకురావాలని వాహన యజమానులకు రవాణా శాఖ అధికారులు సూచిస్తున్నారు. ఈ రకంగా అనంతపురంలో రెండు బస్సులను రవాణా శాఖాధికారులు సీజ్ చేసి మాన్యుఫాక్చర్ మార్గదర్శకాల ప్రకారం వాహనంలో మార్పులు చేపట్టాలని ఆదేశించారు.

నిలిచిన కావేరి ట్రావెల్స్ బస్సు

- ఐదు గంటల పాటు ఇబ్బందులు పడ్డ ప్రయాణికులు

ప్రజాశక్తి-సంతమాగులూరు (బాపట్ల జిల్లా)

బాపట్ల జిల్లా సంతమాగులూరు వద్ద కావేరి ప్రైవేటు ట్రావెల్స్ బస్సు నిలిచిపోయింది. సుమారు ఐదు గంటలపాటు నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ బస్సు తిరుపతి నుంచి హైదరాబాద్‌కు 36 మంది ప్రయాణికులతో వెళ్తూ ఆదివారం వేకువజామున మూడు గంటల సమయంలో సంతమాగులూరు మండలం ఏల్చూరు వద్ద నిలిచిపోయింది. బస్సు ఎంతకు బయలుదేరకపోవడంతో ప్రయాణికులు ప్రశ్నించగా చిన్నపాటి సమస్య వచ్చిందని, కొద్దిసేపట్లో బయలుదేరుతుందని డ్రైవర్లు చెప్పారు. తెల్లవారుతున్నా బస్సు బయలుదేరకపోవడంతో పోలీసులకు ప్రయాణికులు ఫిర్యాదు చేశారు. ట్రావెల్స్ యాజమాన్యంతో పోలీసులు మాట్లాడి వేరే బస్సుల్లో ప్రయాణికులను గమ్యస్థానాలకు తరలించారు.

శ్రీవారి సుప్రభాత సేవలో ముఖేష్ అంబాని

ప్రజాశక్తి- తిరుమల

తిరుమల శ్రీవారి సుప్రభాత సేవలో రిలయన్స్ అధినేత ముఖేష్ అంబాని పాల్గొన్నారు. దర్శనం అనంతరం ఆలయం బయట విలేకరులతో ఆయన మాట్లాడారు. అన్నప్రసాద ట్రస్టుకు ఆధునిక వంటశాల నిర్మాణ బాధ్యతలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఈ కొత్త వంటశాల అధునాతన ఆటోమేషన్‌ను కలిగి ఉంటుందని వివరించారు. ప్రతిరోజూ రెండు లక్షల కంటే ఎక్కువ భోజనాలను తయారుచేసి, అందించే సామర్థ్యాన్ని కలిగి ఉండేలా తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. తద్వారా, ప్రతి యాత్రికుడికీ అత్యంత పరిశుభ్రతతో తయారు చేసిన పౌష్టికాహార అందనుందని వివరించారు. టిటిడితో కలిసి ఈ నిర్మాణం పూర్తి చేస్తామని చెప్పారు. అంతకుముందు ఆలయం వద్దకు చేరుకున్న ముఖేశ్ అంబానికి టిటిడి అదనపు ఇఒ వెంకయ్య చౌదరి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు.

ఇళయరాజాకు ఘన సన్మానం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రఖ్యాత సినీ సంగత దర్శకులు ఇళయరాజాను రాష్ట్ర శాసనసభ డిప్యూటీ స్పీకరు రఘురామ కృష్ణరాజు, విజయవాడ ఎంపి కేశినేని చిన్ని ఆదివారం ఘనంగా సన్మానించారు. శనివారం రాత్రి విజయవాడలోని ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో ఇళయరాజా ఆధ్వర్యాన సంగీత విభావరి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు.

క్రీడలతో యువతను రక్షించాలి

- డ్రగ్స్, గంజాయి నుంచి కాపాడాలి
- డివైఎఫ్ఐ చర్చా వేదికలో పలువురు వక్తలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో క్రీడలను కాపాడుకొని యువతను రక్షించుకుందామని డివైఎఫ్ఐ నిర్వహించిన చర్చా వేదికలో పలువురు వక్తలు పిలుపునిచ్చారు. ఇటీవల జరిగిన మహిళా క్రికెట్ ప్రపంచ కప్‌లో భారత్ జట్టు దేశానికి అద్భుతమైన విజయాన్ని అందించిందని తెలిపారు. డివైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యాన మహిళా క్రికెట్ ప్రపంచ కప్ విజేతలను అభినందిద్దాం-క్రీడా అభివృద్ధిపై చర్చిద్దాం' అనే అంశంపై చర్చా వేదిక విజయవాడలోని బాలోత్సవ భవన్‌లో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి రామన్న మాట్లాడుతూ.. క్రికెట్ మ్యాచ్‌లో ఒక్కో మహిళా అగ్గిపిడుగులై గర్జించారని, ఈ విజయం దేశ సాంఘిక సమానత్వానికి మలుపు అని చెప్పారు. మహిళలు ఎందులోనూ తక్కువ కాదని మరోసారి ఈ విజయం గర్వంగా గుర్తు చేస్తుందని తెలిపారు. భవిష్యత్తులో మహిళా క్రీడాకారులకు ఇది ఎంతో ప్రోత్సాహాన్ని ఇస్తుందని చెప్పారు. ప్రపంచీకరణ నేపథ్యంలో అన్నింటినీ వ్యాపార కోణంలో చూసే ధోరణి పోవాలన్నారు. ప్రతిభ గల క్రీడాకారులు ఇబ్బందులు పడుతున్నారని, అలాంటి వారిని గుర్తించి ప్రోత్సాహకం అందించాలని డిమాండ్ చేశారు. యువతను డ్రగ్స్, గంజాయి నుంచి కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. యువతను క్రీడల వైపు ప్రోత్సహించి రాణించిన వారికి ఉద్యోగాలు, ఉపాధి గ్యారంటీ చేయాలని డిమాండ్ చేశారు. క్రీడలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించి కోచ్‌లను నియమించాలని కోరారు. ప్రతి జిల్లాలో స్పోర్ట్స్ పాఠశాల ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి పాఠశాలలో క్రీడా ప్రాంగణాలు, సామగ్రి ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. మహిళా క్రీడాకారులకు రక్షణ కల్పించాలన్నారు. జిఒ 74ను అమలు చేయాలని కోరారు. మాజీ కోచ్ ప్రసాద్, లెక్చరర్ ఎస్ లెనిన్ బాబు మాట్లాడుతూ.. యువతకు క్రీడల పట్ల అవగాహన కల్పించాలన్నారు. ప్రాథమిక స్థాయి నుంచి క్రీడలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు వై రాము అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు రమణ, సభ్యులు పి కృష్ణ, నరసింహ, ప్రసాద్, కృష్ణకాంత్, ఎన్‌టిఆర్ జిల్లా సహాయ కార్యదర్శి శివ తదితరులు పాల్గొన్నారు.

కళత్తూరు దళితవాడకు పునరావాసం కల్పించాలి

- ముఖ్యమంత్రికి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు లేఖ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

తిరుపతి జిల్లా, కెవిబిపురం మండలం, ఓళ్ళూరు రాయల చెరువు కట్టకు గండిపడి సర్వస్వం కోల్పోయిన కళత్తూరు దళితవాడకు పునరావాసం కల్పించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ఆదివారం లేఖ రాశారు. రాయల చెరువు కట్టకు గండిపడి కళత్తూరు దళితవాడ, పాతపాలెం అరుంధతి వాడ పూర్తిగా వరద ప్రవాహానికి గురై ఏడడుగుల మేర బురద నీరు పేరుకుపోయి తీవ్ర నష్టం వాటిల్లిందని తెలిపారు. ఈ నెల 7న తాను ఆ గ్రామాన్ని సందర్శించి స్వయంగా వారి బాధలను గమనించానని పేర్కొన్నారు. అధికార యంత్రాంగం తక్షణం కదిలి రిలీఫ్ యాక్టివిటీ ప్రారంభించడం హర్షణీయమన్నారు. దాదాపు 700 కుటుంబాలు పూర్తిగా సర్వస్వం కోల్పోయి కట్టుబట్టలతో మిగిలారని, ఇళ్లల్లో వాడుకునే నిత్యవసర సరుకులు దగ్గర నుంచి వంట సామగ్రి, స్కూటర్లు, ఆటోలు, ట్రాక్టర్లు, బీడీ కార్మికుల బీడీలు, మత్స్యకార్మికుల వలలు మొత్తం వరద ప్రవాహానికి కొట్టుకుపోయాయని వివరించారు. సుమారు 900 ఆవులు, గేదెలు, 23 పూరిళ్ళు పూర్తిగా కొట్టుకుపోయాయని తెలిపారు. రాయల చెరువు ఆయకట్టు, కళత్తూరు చెరువు రాయకట్టు పరిధిలోని సుమారు 2 వేల ఎకరాలకు పైగా ఇసుక మేటలు వేసి సాగుకు పనికిరాకుండా పోయాయని వివరించారు. దీంతో తీవ్ర నష్టాలకు గురైన రైతులను, ప్రజలను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. లోతట్టు ప్రాంతమైన కళత్తూరు దళితవాడను ఎగువ ప్రాంతానికి తరలించాలని స్థానిక ప్రజలు ఎప్పటి నుండో కోరుతున్నారని తెలిపారు. ప్రత్యామ్నాయ స్థలం విషయంలో పెత్తందార్లు ఆటంకాలు కల్పిస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందని వివరించారు. ఇప్పటికైనా పూర్తిగా మెట్ట ప్రాంతానికి తరలించి శాశ్వత పునరావాసం కల్పించాలని, ప్రభుత్వం ఈ విపత్తును ప్రత్యేకంగా పరిగణించి ఐదు సెంట్లు ఇంటి స్థలంతోపాటు ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు, ప్రతి కుటుంబానికి రెండెకరాలు చొప్పున సాగు భూమి ఇవ్వాలని డిమాండ్ చేశారు. స్థానికంగా 700 ఎకరాలు ఇప్పటికే పేదలు సాగులో ఉన్నాయని తెలిపారు. అటవీ శాఖ వారి పరిధిలో లేకున్నా దీనిపై అభ్యంతరాలు పెడుతూ పేద రైతుల్ని వేధిస్తున్నారని వివరించారు. రెవెన్యూ, ఫారెస్ట్ మధ్య వివాదంగా ఉన్న ఈ భూమి సమస్యను పరిష్కరించి ప్రతి కుటుంబానికి రెండెకరాలు చొప్పున పట్టాలివ్వాలని కోరారు. దారుణంగా దెబ్బతిన్న కుటుంబాలు కోలుకోవడానికి చాలాకాలం పడుతుందని తెలిపారు. వారికి ప్రస్తుతం ప్రకటించిన సహాయంతోపాటు రూ.5 లక్షల పునరావాస ప్యాకేజీ ఇచ్చి ఆదుకోవాలని కోరారు. ఇసుక మేటలు వేసిన పొలాలకు ఎకరాకు రూ.50 వేల చొప్పున పరిహారం ఇవ్వాలన్నారు. చాలా ఏళ్లగా ఈ చెరువుకు మరమ్మతులు చేయకపోవడం, నిర్వహణ లోపం వల్ల గండ్లు పడి గ్రామాలను ముంచెత్తిందని తెలిపారు. దీనిపై విచారణ జరిపి బాధ్యులపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. తక్షణం నిధులు కేటాయించి మరమ్మతులు చేయించి తదుపరి పంట వేసుకోడానికి సహాయం చేయాలని కోరారు.

నాసిరకం రోడ్డు నిర్మాణంపై వార్త రాసినందుకు ప్రజాశక్తి విలేకరిపై దాడి

- కర్రలతో విచక్షణారహితంగా కొట్టిన టిడిపి నాయకులు

ప్రజాశక్తి- చిలమత్తూరు

దాడిలో గాయపడిన శంకర్

సిఎం బావమరిది, హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ ఇలాకాలో తెలుగు తమ్ముళ్లు పైశాచికంగా ప్రవర్తించారు. వార్త రాశాడన్న అక్కసుతో ఊగిపోయిన టిడిపి నాయకుడు తన కుమారుడు, అనుచరులతో కలిసి దారి కాసి ప్రజాశక్తి విలేకరిపై భౌతికదాడికి పాల్పడ్డారు. కర్రలతో చితకబాదారు. తెలుగు తమ్ముళ్లు మానవమృగాల్లా వ్యవహరించిన ఈ ఘటన శ్రీ సత్యసాయి జిల్లా హిందూపురం నియోజకవర్గం చిలమత్తూరు మండలంలో చోటు చేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాల మేరకు... చిలమత్తూరు మండల కేంద్ర పరిధిలో రూ. 45 లక్షలతో ఎన్‌ఆర్‌ఇజిఎస్ కింద జరుగుతున్న సిసి రహదారి పనుల్లో నాణ్యతపై 'నాసిరకంగా రోడ్డు నిర్మాణం' శీర్షికన ఆ మండల ప్రజాశక్తి విలేకరి శంకర్ వార్తను రాశాడు. ఈ కథనం ఆదివారం ప్రచురితమైంది. దీన్ని జీర్ణించుకోలేని టిడిపి మండల నాయకుడు నాగరాజు యాదవ్... శంకర్‌పై దాడికి కుట్ర పన్నాడు. ఆదివారం ఉదయం విలేకరి ఇంటివద్దకు వెళ్లాడు. శంకర్ అందుబాటులో లేకపోవడంతో అతని కుటుంబ సభ్యులను బెదిరించాడు. ఈ విషయాన్ని ఫోన్ చేసి తన కుమారుడికి తల్లి చెప్పింది. దీంతో, శంకర్ తన ద్విచక్ర వాహనంపై ఇంటికి బయలుదేరాడు. అప్పటికే దారికాచిన టిడిపి నాయకుడు నాగరాజు, ఆయన కుమారుడు, తన అనుచరులతో కలసి శంకర్‌ని శిరా రహదారి తుమ్మలకుంట క్రాస్ వద్ద అడ్డగించాడు. సెల్‌ఫోన్ లాక్కొన్ని కర్రలతో విచక్షణారహితంగా దాడి చేశాడు. అక్కడి నుంచి తప్పించుకుని చిలమత్తూరు స్టేషన్‌కు శంకర్ చేరుకున్నారు. పోలీసులు అందుబాటులో లేకపోవడంతో తమ బంధువుల ఇంట తలదాచుకున్నారు. తోటి విలేకర్ల సహాయంలో ఆదివారం సాయంత్రం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

చర్యలు తీసుకోవాలి : శ్రీసత్యసాయిజిల్లా చిలమత్తూరు మండల ప్రజాశక్తి విలేకరి శంకర్‌పై జరిగిన దాడిని ప్రజాశక్తి ఎడిటర్ బి. తులసీదాస్, డిప్యూటీ ఎడిటర్ వి. రాంభూపాల్ ఖండించారు. దాడికి పాల్పడిన టిడిపి నాయకుడు నాగరాజు యాదవ్, ఆయన అనుచరులపై పోలీసులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వాస్తవాలను వెలికితీసే విలేకరులపై దాడి చేయడం నియంతృత్వ చర్య అని అన్నారు.

సదస్సులో మాట్లాడుతున్న ప్రభాకర్ రెడ్డి

రైతుల అనుమతి లేకుండా భూములు సేకరిస్తే ప్రతిఘటన

- ఎపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి

ప్రజాశక్తి-హిందూపురం

అభివృద్ధి పేరుతో రైతుల అనుమతి లేకుండా భూములను సేకరిస్తే పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తామని ఎపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి హెచ్చరించారు. శ్రీ సత్యసాయి జిల్లా హిందూపురం రూరల్ మండలంతో పాటు లేపాక్షి, సోమందేపల్లి మండలం పరిధిలో ఉన్న గ్రామాలలో జరుగుతున్న భూ సేకరణను వ్యతిరేకిస్తూ ఆదివారం హిందూపురం రూరల్ మండలం చలివెందల గ్రామంలో రైతు సంఘం నాయకులు రామకృష్ణారెడ్డి అధ్యక్షతన సదస్సు జరిగింది. ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ... పరిశ్రమలు ఏర్పాటు చేస్తామని గత 15, 20 సంవత్సరాల క్రితం మడకశిర, పరిగి, లేపాక్షి, చిలమత్తూరు, హిందూపురం, ఓడిసి ప్రాంతాలలో వేలాది ఎకరాలు రైతుల నుంచి లాక్కొన్నారని, ఇప్పటి వరకు ఒక్క పరిశ్రమనూ ఏర్పాటు చేయలేదన్నారు. సేకరించిన భూములను తిరిగి ఆ రైతులకు ఇవ్వాలని, వ్యవసాయ అభివృద్ధికి ప్రభుత్వం రుణాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. చిలమత్తూరు వద్ద గతంలో టిడిపి ప్రభుత్వం ఉన్న సమయంలో ఎల్సినా రాగ మయూరి అనే సంస్థకు కేటాయించిన భూముల్లో ప్రస్తుతం వెంచర్లు వేసి భూమిని విక్రయిస్తున్నారని తెలిపారు. అభివృద్ధికి రైతు సంఘం వ్యతిరేకం కాదని, అభివృద్ధి పేరుతో పంటలు పండే భూములను చిన్న, సన్నకారు, మధ్యతరగతి రైతుల భూములను లాక్కోవడం తగదన్నారు. వ్యవసాయానికి అనువు గాని భూములలో పరిశ్రమలను ఏర్పాటు చేసి యువతకు ఉపాధి కల్పిస్తే ఎవరికీ అభ్యంతరం ఉండదని తెలిపారు. తప్పనిసరిగా భూమిని సేకరించడానికి ప్రభుత్వం ముందుకు వస్తే 2013 భూ సేకరణ చట్టాన్ని అనుసరించి భూ సేకరణ చేయాలని, గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించి చట్టం గురించి రైతులకు సమగ్రంగా వివరించి రైతులు ఒప్పుకుంటేనే భూమిని సేకరించాలని అన్నారు. రైతుల అనుమతి లేకుండా భూములను సేకరించడానికి ప్రభుత్వం ముందుకు వస్తే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు హరి, జంగాలపల్లి పెద్దన్న, సిఐటియు జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

బాలిక మృతి కేసులో నిందితుడు అరెస్టు

ప్రజాశక్తి - రామచంద్రపురం(డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా)

చిన్నారి రంజిత మృతి కేసును డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం పోలీసులు ఛేధించారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఎస్‌పి రాహుల్‌మీనా మీడియాకు వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. రామచంద్రపురం ఏరియా ఆస్పత్రిలో పనిచేస్తున్న చిర్రా సునీత తన కుమార్తె రంజిత (10)తో కలిసి రామచంద్రపురంలో ఉంటున్నారు. సునీత భర్త ఉద్యోగ రీత్యా హైదరాబాద్‌లో ఉంటున్నారు. ఎలక్ట్రికల్ వర్క్ చేస్తూ యూట్యూబ్ విలేకరిగా చెలామణి అవుతున్న పెయ్యల వీరవెంకట శ్రీనివాస్ తరచూ వీరి ఇంటికి వచ్చిపోతుండేవాడు. ఈ నెల నాలుగున రంజితను స్కూలుకు పంపిన అనంతరం కాకినాడలోని తమ బంధువుల ఇంటికి సునీత వెళ్లారు. ఇది గమనించిన శ్రీనివాస్ ఆ ఇంట్లో విలువైన వస్తువులు, బంగారు ఆభరణాల చోరీకి ప్రయత్నించాడు. ఇంతలో స్కూల్ నుంచి రంజిత ఇంటికి వచ్చింది. శ్రీనివాస్ ఇంట్లో ఉండడాన్ని గమనించి తల్లికి ఫోన్ చేస్తుండగా ఆమెను కొట్టి దిండుతో ముఖాన్ని అదిమిపట్టి ఊపిరాడకుండా చేశాడు. అనంతరం చున్నీతో ఉరివేసి ఆత్మహత్యగా చిత్రీకరించి పరారయ్యాడు. ఇంటికి వచ్చిన సునీత.. విగతజీవిగా ఉన్న కుమార్తెను చూసి స్థానికుల సాయంతో ఏరియా ఆస్పత్రికి తరలించారు. అప్పటికే చిన్నారి మృతి చెందిందని వైద్యులు ధ్రువీకరించారు. పోలీసులు దర్యాప్తు చేపట్టి శ్రీనివాసు కదలికలపై నిఘా పెట్టారు. హత్య చేసినట్టు విచారణలో శ్రీనివాస్ ఒప్పుకున్నాడు. ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో చోరీకి ప్రయత్నించి, ఈ క్రమంలోనే రంజితను హత్య చేసినట్టు నిర్ధారణ అయ్యిందని ఎస్‌పి తెలిపారు. నిందితుడిని అరెస్టు చేశామని, రామచంద్రపురం కోర్టుకు తరలిస్తున్నామని చెప్పారు.

వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా 12న వైసిపి ర్యాలీలు

ప్రజాశక్తి- అమరావతి బ్యూరో

ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణపై అన్ని అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాల్లో ఈ నెల 12న ర్యాలీలను విజయవంతం చేయాలని పార్టీ నాయకులకు వైసిపి రాష్ట్ర సమన్వయకర్త సజ్జల రామకృష్ణారెడ్డి సూచించారు. తాడేపల్లిలోని కేంద్ర కార్యాలయం నుంచి పార్టీ ముఖ్య నాయకులు, జిల్లా, మండల స్థాయి ప్రజా ప్రతినిధులు, నాయకులతో ఆదివారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సజ్జల మాట్లాడుతూ.. ఈ కార్యక్రమాల కోసం కలిసి వచ్చే అన్ని పార్టీలనూ కలుపుకుపోదామని, ట్రేడ్ యూనియన్లను అన్నింటితో సమన్వయం చేసుకోవాలని సూచించారు.

'ఎలుకల దాడి' ఘటనపై మంత్రి ఆగ్రహం

ప్రజాశక్తి-ఏలూరు స్పోర్ట్స్

ఏలూరు ప్రభుత్వ వైద్య కళాశాలకు చెందిన ఆరుగురు విద్యార్థులపై జరిగిన ఎలుకల దాడి ఘటనపై వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధ్యులైన హాస్టల్ వార్డెన్, నిర్వహణ బాధ్యతలు నిర్వహిస్తున్న ప్రైవేటు ఏజెన్సీ పెస్ట్ అండ్ రోడెంట్ కంట్రోల్ సర్వీసెస్ సంస్థకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డిఎంఇ) డాక్టర్ రఘునందన్‌ను ఆదివారం ఆదేశించారు. మరోమారు ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ మేరకు డిఎంఇ నిర్వహణ ఏజెన్సీకి షోకాజ్ నోటీసు జారీ చేశారు. హాస్టల్ వార్డెన్‌ను వివరణ కోరుతూ మెమో ఇవ్వాలని కళాశాల ప్రన్సిపల్‌కు సూచించారు. హాస్టల్‌లోని పరిస్థితులపై పరిశీలన చేయిస్తున్నామని డిఎంఇ తెలిపారు.

నేడు కేబినెట్ సమావేశం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర మంత్రి వర్గ సమావేశం సోమవారం ఉదయం 11 గంటలకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధ్యక్షతన సచివాలయంలో జరగనుంది. ఈ నెల 14,15 తేదీల్లో విశాఖపట్టణంలో జరగనున్న సిఐఐ సమ్మిట్ విజయవంతం చేయడం, పారిశ్రామిక వేత్తలను రాష్ట్రానికి తీసుకువచ్చే అంశంపై కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది. అలాగే ఈ నెల 8న ఎస్‌ఐపిబిలో తీసుకున్న నిర్ణయాలకు ఆమోదముద్ర వేసేవీలుంది. గ్రామ వార్డు సచివాలయాలను విజన్ యూనిట్‌లుగా ఉపయోగించుకోవాలన్న అంశానికి సంబంధించి కూడా కేబినెట్ దిశా నిర్దేశం చేసేవీలుంది. మొంథా తుపాన్ ప్రభావం, కొత్త జిల్లాలు, రెవెన్యూ డివిజన్ల మార్పుచేర్పులపైనా నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

ఆరుగురు మంత్రుల పనితీరుపై అసంతృప్తి

కేబినెట్ సమావేశం అనంతరం తాజా రాజకీయ పరిణామాల నేపథ్యంలో సరైన రీతిలో స్పందించని ఆరుగురు మంత్రులకు ముఖ్యమంత్రి క్లాస్ తీసుకునే వీలుందని చర్చ నడుస్తోంది. సంక్షేమ పథకాల అమలు, సిఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ కార్యక్రమాల్లో పాల్గొనడం లేదని ఇప్పటికే 48 మంది ఎమ్మెల్యేలపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేసిన సంగతి విదితమే. ఆయా ఎమ్మెల్యేలపై పర్యవేక్షణలో విఫలమైన మంత్రులకు కూడా ప్రైవేట్ క్లాస్ తీసుకోవచ్చని ప్రచారం జరుగుతోంది. తిరువూరులో ఎమ్మెల్యే, ఎంపిల మధ్య విభేదాలు రచ్చకెక్కడం, ఇలాంటి పరిణామాలు రాష్ట్రంలో ఏ నియోజకవర్గంలోనూ రాకుండా చూసుకోవాలని అధిష్టానం ఆదేశించినా..సంబంధిత మంత్రులు, ఇన్‌చార్జీమంత్రులు సరైన చర్యలు తీసుకోకపోవడం, దానికి తోడు ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రయివేటీకరణ, నకిలీ మద్యం కేసు తదితర అంశాలపై వైసిపి ప్రచారాన్ని తిప్పికొట్టడంలో మంత్రులు సక్రమంగా స్పందించలేదని ముఖ్యమంత్రి అసంతృప్తితో ఉన్నట్లు సమాచారం. మొత్తంగా ఆరుగురు మంత్రుల పనితీరు సంతృప్తికరంగా లేదంటూ ముఖ్యమంత్రికి నివేదిక అందిందని, దానిపై ఆయన సంబంధిత అమాత్యులను నిలదీసే వీలుందని చర్చ నడుస్తోంది.

మంగోలియాలో సిక్కోలు యువకుడు అరెస్టు

ప్రజాశక్తి- సంతబొమ్మాళి (శ్రీకాకుళం జిల్లా)

గారయ్య

శ్రీకాకుళం జిల్లా సంతబొమ్మాళి మండలం లక్కివలస పంచాయతీ పిట్టవానిపేటకు చెందిన తూలు గారయ్య ఐదు నెలల క్రితం బ్రష్ పెయింటర్‌గా పనిచేయడానికి మంగోలియాలోని మెగా ఇంజనీరింగ్ కంపెనీకి వెళ్లారు. అగ్రిమెంట్ పూర్తయ్యాక నవంబరు 7న ఇండియాకు తిరిగి రావాల్సి ఉంది. ఇంతలో ఉలాన్ బటార్ అంతర్జాతీయ విమానాశ్రయంలో అరెస్టు అయ్యారని సమాచారం. అప్పటి నుంచి ఆయన ఆచూకీ తెలియడంలేదని భార్య తూలు ఎర్రమ్మ ఆదివారం మీడియాను ఆశ్రయించారు. తన భర్తను స్వదేశానికి రప్పించేందుకు సిఎం చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి లోకేష్, కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు, మంత్రి అచ్చెన్నాయుడులను ఆమె వేడుకుంటున్నారు.

గుండెపోటుతో ఎస్ఐ మృతి

ప్రజాశక్తి-మచిలీపట్నం అర్బన్

మృతి చెందిన చిలకలపూడి ఎస్సై.

విధులు నిర్వహిస్తూ చిలకలపూడి ఎస్ఐ గుండెపోటుతో ఆదివారం మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కృష్ణా జిల్లా అవనిగడ్డ మండలం అశ్వరావుపాలెంకు చెందిన ఆర్ రంగనాథరావు (58) మచిలీపట్నం చిలకలపూడి పోలీస్ స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఆదివారం మచిలీపట్నం వచ్చిన రాష్ట్ర సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథికి ఎస్కార్ట్‌గా గుడివాడ వెళుతుండగా గుండెపోటు వచ్చింది. హుటాహుటిన గుడివాడ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో ఆయన మృతి చెందారు. ఈ ఘటన పట్ల పోలీసు ఉన్నతాధికారులు దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. చిన్న వయసులోనే కష్టపడి కానిస్టేబుల్ ఉద్యోగం సాధించి పదోన్నతులపై సబ్ ఇన్‌స్పెక్టర్ స్థాయికి ఎదిగారు. ఇంకో రెండేళ్ల సర్వీస్ ఉండగా ప్రాణాలు కోల్పోవడం పట్ల పోలీసులు విచారం వ్యక్తం చేశారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

అంగీకరించిన అంశాలపై
జిఓలు విడుదల చేయాలి

- కనీస వేతనాల అమలు, పర్మినెంట్ కోసం ఉద్యమాలు
- సిహెచ్‌డబ్ల్యులను ఆశాలుగా గుర్తించాలి
- ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర మహాసభ డిమాండ్

ప్రజాశక్తి- అనకాపల్లి

ఆశాల సమస్యలపై పోరాటాలు, వినతుల సమయంలో ప్రభుత్వం అంగీకరించిన అన్ని అంశాలపై వెంటనే జిఒలు విడుదల చేయాలని ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర మహాసభ డిమాండ్ చేసింది. రెండు రోజులపాటు అనకాపల్లిలో కర్రి రమేష్ కల్యాణ మండపంలోని నాగలక్ష్మి నగర్‌లో నిర్వహించిన ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఐదో రాష్ట్ర మహాసభ ఆదివారం సాయంత్రంతో ముగిసింది. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి 300 మంది ప్రతినిధులు హాజరయ్యారు. ప్రధాన కార్యదర్శి నివేదికపై అన్ని జిల్లాల నుంచీ చర్చల్లో పాల్గొన్నారు. రెండో రోజు మహాసభలో సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎవి.నాగేశ్వరరావు మాట్లాడుతూ స్కీమ్ వర్కర్ల, కార్మికుల సమస్యల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయన్నారు. కార్పొరేట్ల సేవలో మునిగి తేలుతున్నాయని, ప్రజల ఆస్తులను వారికి అప్పనంగా కట్టబెడుతున్నాయని వివరించారు. ప్రభుత్వ రంగంలోని విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరించాలని చూడడం, అనకాపల్లి జిల్లాలో ప్రైవేటు స్టీల్‌ప్లాంట్‌ను తీసుకురావడం దుర్మార్గమన్నారు. ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధనలక్ష్మి మాట్లాడుతూ ఆశా కార్యకర్తలకు కనీస వేతనాలు అమలు చేయాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేస్తూ భవిష్యత్తులో పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. కమ్యూనిటీ హెల్త్ వర్కర్ల (సిహెచ్‌డబ్ల్యుల)ను ఆశా వర్కర్లుగా గుర్తించాలని, ఆశా వర్కర్ల ఖాళీలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వంలాగే ఈ ప్రభుత్వమూ ఆశా వర్కర్ల పట్ల అన్యాయంగా వ్యవహరిస్తోందన్నారు.

రాజకీయ వేధింపులు పలు జిల్లాల్లో జరుగుతున్నాయని తెలిపారు. మహాసభలో వెలుగు విఒఎల ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.రూపాదేవి, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సుబ్బరావమ్మ, ప్రజా ఆరోగ్య వేదిక రాష్ట్ర కార్యదర్శి టి.కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మహాసభలో మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎవి.నాగేశ్వరరావు వేదికపై ధనలక్ష్మి తదితరులు

తొమ్మిది తీర్మానాలు ఆమోదం

మహాసభ తొమ్మిది తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించింది. కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, కార్మికులకు నష్టం చేకూర్చేలా కేంద్రంలోని మోడీ ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని, కార్మిక చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని, సిహెచ్‌డబ్ల్యులకు ఆశా వర్కర్లతో సమానంగా వేతనాలు, సౌకర్యాలు కల్పించాలని, ఆశా వర్కర్లకు జాతీయ సెలవులు, పండగ, వారాంతపు సెలవులు, క్యాజువల్ లీవులు, మెడికల్ లీవులు ఇవ్వాలని, ఆశా వర్కర్ల నియామకాలు ప్రభుత్వమే చేపట్టాలని, రాజకీయ జోక్యాన్ని తొలగించాలని, ఆశా వర్కర్లు మృతి చెందితే దహన సంస్కారాలకు రూ.20 వేలను ప్రభుత్వం ఇవ్వాలని, పని భారాన్ని తగ్గించాలని, ఎఎన్ఎం, జిఎన్ఎం వంటి పర్మినెంట్ పోస్టుల విషయంలో శిక్షణ పొందిన ఆశాలకు ప్రాధాన్యత కల్పించాలని తీర్మానించారు.

విద్యుదాఘాతంతో డ్రైవర్, క్లీనర్ మృతి

ప్రజాశక్తి- గండేపల్లి(కాకినాడ జిల్లా)

కాకినాడ జిల్లా గండేపల్లి మండలం రామయ్యపాలెం శివారులో విద్యుదాఘాతానికి గురై వరి డ్రైవర్, క్లీనర్ మృతి చెందారు. జగ్గంపేట పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు... పశ్చిమగోదావరి జిల్లా ఇరగవరం మండలం పేకేరు గ్రామానికి చెందిన కరిపట్టి సింహాద్రి అప్పన్న (57), వరి కోత యంత్రం డ్రైవర్‌గా, రాపాక గ్రామానికి చెందిన గెడ్డం సందీప్ (22) క్లీనర్‌గా పనిచేస్తున్నారు. వరి కోతల్లో భాగంగా వారు రాజానగరం మండలం కలవచర్ల వచ్చారు. అక్కడ పని పూర్తయిన తర్వాత సింగవరం బయలుదేరారు. వరి కోత యంత్రాన్ని తమ సొంత వ్యాన్‌పై ఎక్కించి వెళ్తున్నారు. రామయ్యపాలెం శివారుకు చేరుకున్న సమయంలో వ్యాన్‌పై ఉన్న వరి కోత యంత్రానికి 11 కెవి విద్యుత్ వైరు తగిలింది. దీంతో, విద్యుదాఘాతానికి గురై వ్యాన్‌ను డ్రైవర్ చేస్తున్న సింహాద్రి అప్పన్న, క్లీనర్ సందీప్ అక్కడికక్కడే మృతి చెందారు. 11 కెవి విద్యుత్ వైరు కిందకు ఉండడంతో ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు తెలిపారు. జగ్గంపేట సిఐ వైఆర్‌కె.శ్రీనివాస్, ఎస్ఐ శివనాగబాబు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఘటనా స్థలానికి చేరుకున్న విద్యుత్ అధికారి కిరణ్‌ను స్థానికులు నిలదీశారు. వెంటనే విద్యుత్ వైర్లు పైకి ఉండే విధంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

విద్యుత్ వైర్లకు తగిలిన వరి కోత యంత్రం

ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సంఘీభావం తెలుపుతున్న నేతలు

ప్రభుత్వ రంగంలోనే మెడికల్ కళాశాలలు

- సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు రమాదేవి డిమాండ్

ప్రజాశక్తి-బాపట్ల

వైద్య కళాశాలలను ప్రభుత్వ రంగంలో కొనసాగించాలని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు డి.రమాదేవి డిమాండ్ చేశారు. 'బాపట్ల ప్రభుత్వ మెడికల్ కళాశాలను కాపాడుకుందాం' అనే నినాదంతో ప్రభుత్వ మెడికల్ కళాశాలల పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని ఎన్‌జిఒ హోంలో నిర్వహించిన సదస్సులో ఆమె మాట్లాడారు. బాపట్లలో మొదలుపెట్టిన మెడికల్ కళాశాల నిర్మాణానికి డబ్బులు ఇవ్వలేని దౌర్భాగ్య పరిస్థితిలో రాష్ట్ర ప్రభుత్వం ఉందా.? అని ప్రశ్నించారు. ప్రభుత్వ ఆస్తులను ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టాలనే ఉద్దేశంతోనే డబ్బులు లేవని ప్రభుత్వం చెబుతోందని విమర్శించారు. ప్రభుత్వమే మెడికల్ కళాశాలను నిర్మిస్తే ఎంతో మందికి ఉపాధి అవకాశాలతో పాటు డాక్టర్లు, నర్సులకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, టిడిపి కూటమి ప్రభుత్వం ఆలోచన చేసి మెడికల్ కళాశాలలకు నిధులు కేటాయించి బాపట్ల వైద్య కళాశాలను ప్రభుత్వమే నిర్మించాలని డిమాండ్ చేశారు. 56 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న బాపట్ల ప్రభుత్వ మెడికల్ కళాశాలను కాపాడుకోవాలని, పిపిపి విధానంలో పది ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ వైపునకు తీసుకొచ్చిన 590 జిఒను వెంటనే ఉపసంహరించుకోవాలని కోరారు. రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మస్తాన్‌వలీ మాట్లాడుతూ.. ప్రైవేట్ మెడికల్ మాఫియాను రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని విమర్శించారు. గత ప్రభుత్వం మెడికల్ సీట్లను అమ్ముకుంటే ప్రస్తుత ప్రభుత్వం ఏకంగా మెడికల్ కళాశాలలను అమ్మకానికి పెట్టిందని ఆరోపించారు. సదస్సుకు ప్రభుత్వ మెడికల్ కళాశాలల పరిరక్షణ కమిటీ రాష్ట్ర కన్వీనర్ ఆలా వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. తొలుత బాపట్ల ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రాంగణాన్ని వివిధ పార్టీల రాష్ట్ర నేతలు, పరిరక్షణ కమిటీ బృందం, ప్రజా పౌర సంస్థల నేతలు పరిశీలించారు. కార్యక్రమంలో దళిత బహుజన ఫ్రంట్ వ్యవస్థాపకులు కొరివి వినయ్‌కుమార్, సిపిఎం జిల్లా కార్యదర్శి సిహెచ్ గంగయ్య, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంట అంజి బాబు, సిపిఐ కార్యవర్గ సభ్యులు పరుచూరి రాజేంద్ర బాబు, సిపిఐ బాపట్ల జిల్లా కార్యదర్శి సింగరకొండ తదితరులు పాల్గొన్నారు.

రేపు ఘనంగా అబుల్ కలాం ఆజాద్ జయంతి

- మంత్రి ఫరూక్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా మైనార్టీ సంక్షేమశాఖ దినోత్సవం, జాతీయ విద్యా దినోత్సవాలను ఈ నెల 11న రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించనుందని మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి ఎన్ఎమ్‌డి ఫరూక్ తెలిపారు. తాడేపల్లిలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఎమ్‌డి యాకూబ్ బాషా, క్రిస్టియన్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఎమ్‌డి ఎ శేఖర్, ఉర్దూ అకాడమీ డైరెక్టర్ గౌస్ పీర్, వక్ఫ్ బోర్డు సిఇఒ మహ్మద్ అలీ, మైనార్టీ కమిషన్ కార్యదర్శి నిజాముద్దీన్ తదితరులతో మైనార్టీ సంక్షేమ దినోత్సవం, జాతీయ విద్యా దినోత్సవాల విజయవంతానికి చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో రాష్ట్ర స్థాయి కార్యక్రమాన్ని నిర్వహిస్తామని వెల్లడించారు. మైనార్టీ సంక్షేమ దినోత్సవంలో భాగంగా ఉర్దూ భాషాభివృద్ధికి విశిష్ట కృషి చేసిన వారికి అవార్డులు, జీవిత సాఫల్య అవార్డు, ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు, అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రత్యేక అవార్డులను అందజేయనున్నట్లు మంత్రి తెలిపారు.

టెట్‌లో మంచి మార్కులు సాధిస్తేనే...

ఉపాధ్యాయ అర్హత పరీక్ష ప్రత్యేకం

-కె.ఎస్.లక్ష్మణరావు,
మాజీ శాసనమండలి సభ్యులు,
జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు,
సెల్ : 8309965083

ఉపాధ్యాయ కొలువులకు తొలిమెట్టుగా నిలిచే 'టెట్'లో మంచి మార్కులు సాధిస్తే డిఎస్సీ పరీక్షల్లోనూ మంచి స్కోర్ సాధిస్తే ఉపాధ్యాయ కొలువు మీకు సొంతమవుతుంది. వచ్చే ఏడాది ప్రారంభంలోనే ఉపాధ్యాయ ఉద్యోగాల భర్తీచేస్తారనే జరగనున్న నేపథ్యంలో డీఎస్‌సీకి ముందు రాయాల్సిన టెట్‌కు ప్రాధాన్యం ఏర్పడింది. టెట్‌లో అర్హత పొందడానికి సమగ్రంగా సన్నద్ధం అవ్వటం మేలు. అందుకు కొన్ని మెళకువలు పాటించటం ఎంతోమేలు. విద్యాహక్కు చట్టం ప్రకారం సెక్షన్ 23(1) నేషనల్ కౌన్సిల్ ఫర్ టీచర్ ఎడ్యుకేషన్ నిర్దేశించిన ప్రమాణాల ప్రకారం ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల్లో ఉపాధ్యాయులుగా పనిచేయాలంటే టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్)లో అర్హత పొందడం తప్పనిసరి. 'దేశ భవిష్యత్తు తరగతి గదిలో రూపుదిద్దుకుంటుందని అంటారు. ఎందుకంటే మిగతా అన్ని ఇతర వృత్తులనూ తయారుచేసే ఏకైక వృత్తి బోధన. సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయులు భాగస్వాములవ్వటం ద్వారా విద్యార్థులను అత్యుత్తమ భావి భారత పౌరులుగా తీర్చిదిద్దుతున్నారు.

ఇవి ముఖ్యమైనవి

- ఇంటర్మీడియట్ తర్వాత డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ పూర్తిచేసినవారు టెట్ పేపర్-1 పాసవ్వాలి.
- డిగ్రీ తర్వాత బీఈడీ చేసినవారు టెట్ పేపర్-2లో ఉత్తీర్ణత సాధించాలి.
- ఎన్‌సీటీఈ దేశవ్యాప్తంగా ఉన్న ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుల కొరత దృష్ట్యా బీఈడీ అభ్యర్థులకు పేపర్-1 రాయడానికి అనుమతించింది. టెట్ పేపర్-1 బీఈడీ అభ్యర్థులు రాయొచ్చు.
- టెట్ పరీక్షను బీఈడీ, డీఈడీ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు కూడా రాయొచ్చు.
- పీజీటీ/ జేఎల్ అభ్యర్థులు టెట్ రాయాల్సిన అవసరం లేదు.

ప్రస్తుతానికి 1 నుంచి 5వ తరగతి వరకు బోధించే ఎస్‌జీటీ టీచర్లు (ప్రైమరీ, స్కూల్ టీచర్లు) టెట్ పేపర్-1 రాయాలి.

- 6,7,8 తరగతులు బోధించే స్కూల్ అసిస్టెంట్లు, టీజీటీ (ట్రెయిన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్లు), టెట్ పేపర్-2లో అర్హత సాధించాలి.

వెయిటేజి : టెట్ అర్హత పరీక్ష మాత్రమే కాదు. పోటీ పరీక్ష కూడా. ఎందుకంటే గురుకుల/ టీచర్స్ రిక్రూట్‌మెంట్ టెస్ట్ (డీఎస్‌సీ)లో 20 శాతం మార్కులు వెయిటేజి ఇస్తారు. గతంలో టెట్ రాసిన అభ్యర్థులు కూడా మార్కులు పెంచుకోవడం కోసం మళ్లీ టెట్ రాయటం మేలు. ఎందుకంటే టెట్లో తెచ్చుకున్న ప్రతి 15 మార్కులకూ 2 మార్కుల వెయిటేజి ఉంటుంది.

ఎన్‌సీటీఈ మార్గదర్శకాల ప్రకారం టెట్‌లో అర్హత సాధించిన అభ్యర్థుల సర్టిఫికెట్‌కు జీవితకాలం చెల్లుబాటు ఉంటుంది. 2011 నుంచి టెట్ రాస్తోన్న అభ్యర్థులకూ, కొత్తగా టెట్ రాయబోయే అభ్యర్థులకూ ఈ నియమం వర్తిస్తుంది.
ప్రశ్నాపత్రం తెలుగు, ఇంగ్లీష్ రెండు భాషల్లోనూ ఉంటుంది.
ప్రణాళికా బద్ధంగా చదివితేనే విజయం
నోటిఫికేషన్ తర్వాత కేవలం 60 రోజుల నుంచి 90 రోజుల సమయం ఉంటుంది. అభ్యర్థులు పరీక్షకు ఇప్పటినుంచే సన్నద్ధం కావడం సముచితం.
పేపర్ -1 రాసే అభ్యర్థులు కంటెంట్ 3 నుంచి 8 తరగతుల వరకు చదవాలి.
పేపర్-2 రాసే అభ్యర్థులు కంటెంట్ 3 నుంచి 10వ తరగతి స్థాయి వరకు చదవాలి.
అభ్యర్థులు ప్రభుత్వం ముద్రించిన తెలుగు అకాడమీ పుస్తకాలు చదివి నోట్సు రాసుకోవాలి. సాధన చేయాలి.

....

చైల్డ్ డెవలప్‌మెంట్, పెడగాజి కీలకం

చదివేటప్పుడు ఇందులో కీలకమైన మూడు విభాగాలపై అవగాహన ఏర్పరుచుకోవాలి. మొదటి యూనిట్ శిశువికాసం. ఇందులో వికాస దశలు, వికాస సిద్ధాంతాలు, వైయక్తిక భేదాలు కన్పించే అంశాలైన ప్రజ్ఞ, సహజ సామర్థ్యాలు, వైఖరులు, అభిరుచులు, సజనాత్మకత, ఆలోచన, మూర్తిమత్వం, మానసిక ఆరోగ్యం-శిశు అధ్యయన పద్ధతులను చదవాలి.
చైల్డ్ డెవలప్‌మెంట్, పెడగాజిలో అభ్యసనం (లెర్నింగ్) యూనిట్‌లో ప్రధాన అంశాలైన అభ్యసనా సిద్ధాంతాలు, అభ్యసన బదలాయింపు, ప్రేరణ, అభ్యసన అంగాలు, స్మృతి-విస్మృతిపై ఎక్కువగా దృష్టితో చదవాలి.
అధ్యాపన శాస్త్రం (పెడగాజి)లో కీలకమైన సహిత విద్య, బోధన దశలు, బోధన ఉపగమాలు, నిరంతర సమగ్ర మూల్యాంకనం, ఉచిత నిర్బంధ విద్యాహక్కు చట్టం (2009), జాతీయ పాఠ్యప్రణాళిక చట్రం (2005)పై దృష్టి పెట్టాలి.

భాషలు (లాంగ్వేజెస్)

లాంగ్వేజ్-1, లాంగ్వేజ్-2లకు సంబంధించి ప్రధానంగా రాష్ట్ర ప్రభుత్వం ముద్రించిన పాఠ్య పుస్తకాల్లోని వ్యాకరణ అంశాలు, వాటి ఉదాహరణలు బాగా చదవాలి. సిలబస్‌లో ఇచ్చిన సాహిత్యం అవగాహన చేసుకోవాలి.

కంటెంట్ ఎలా చదవాలి?

పేపర్-1 అభ్యర్థులు గణితం, విజ్ఞానశాస్త్రం, సాంఘికశాస్త్రం కంటెంట్‌ను 3వ తరగతి నుంచి 8వ తరగతి వరకు చదవాలి. పేపర్-2 అభ్యర్థులు 3వ తరగతి నుంచి 10వ తరగతి వరకు కంటెంట్ చదవాలి. తెలుగు అకాడమీ లాంటి ప్రామాణికమైన సంస్థల ప్రచురణలను చదువుతూ సొంతంగా నోట్సు తయారుచేసుకోవడం మంచిది.

- గణితం కంటెంట్‌లో అర్థమెటిక్, సంఖ్యా వ్యవస్థ, రేఖాగణితం, క్షేత్రమితి, బీజగణితం, దత్తాంశ నిర్వహణ యూనిట్లపై దృష్టి పెట్టాలి.
- సైన్స్ కంటెంట్‌లో సజీవ ప్రపంచం, జీవప్రక్రియలు, సహజ దృగ్విషయాలు, పర్యావరణం యూనిట్లు బాగా చదవాలి.

-సోషల్ స్టడీస్ కంటెంట్‌లో 6 థీమ్‌లు ఉన్నాయి.

1. భూమి వైవిధ్యం- మాన చిత్రాలు
2. ఉత్పత్తి-వినిమయం, జీవనాధారాలు
3. రాజకీయ వ్యవస్థలు-పరిపాలన
4. సామాజిక వ్యవస్థీకరణ - అసమానతలు
5. మతం-సమాజం
6. సంస్కృతి విభాగాలను అధ్యయనం చేయాలి.

ఇవి పాటించండి

కంటెంట్ చదివేటప్పుడు 3, 4, 5 తరగతులకు రాసిన పాఠ్యాంశం, ఎక్కువ తరగతులు 6, 7, 8, 9, 10లో పునరావృతమైనప్పుడు ఒకేసారి చదివి భావనలను అర్థం చేసుకోవాలి. నోట్సు రాసుకోవాలి. అంతేగానీ బట్టీ పద్ధతిలో చదవకూడదు.
చదవటంతోపాటు పదేపదే పునశ్చరణ చేయడం, చదివింది చూడకుండా గుర్తుకు తెచ్చుకోవడం ముఖ్యం.
కఠినమైన అంశాలను స్నేహితులు, బోధన నిపుణులతో చర్చించి అవగాహన పెంచుకోవాలి.
గత టెట్ ప్రశ్నాపత్రాల సాధన ద్వారా టెట్‌లో మంచి మార్కులను సాధించొచ్చు.
తెలుగు అకాడమీ లాంటి ప్రామాణిక సంస్థల ప్రచురణలను చదువుతూ సొంతంగా నోట్సు తయారుచేసుకోవడం మంచిది.



AP – TET

నోటిఫికేషన్ వివరాలు ఇవీ...

టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్) అనేది ఉపాధ్యాయ వృత్తిలో చేరాలనుకునే డీఈడీ, బీఈడీ అభ్యర్థులకు అత్యంత ముఖ్యమైన పరీక్ష. టెట్‌లో ఉత్తీర్ణత సాధించినవారికే డీఎస్సీ (టీచర్ రిక్రూట్‌మెంట్ టెస్ట్)లో పాల్గొనే అర్హత లభిస్తుంది. తాజాగా విడుదలైన ఏపీ టెట్ 2025 నోటిఫికేషన్ ఆధారంగా అర్హతలు, పరీక్ష విధానం, సిలబస్, మార్కుల పంపిణీ, ప్రిపరేషన్ అంశాల గురించి అభ్యర్థులు ముందుగా క్షుణ్ణంగా తెలుసుకోవాలి. ఆంధ్రప్రదేశ్ టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (ఎపిటెట్ 2025) నోటిఫికేషన్ తాజాగా వెలువడింది. డిఎస్సీ కొలువులు సాధించాలంటే మొదటగా టెట్‌లో ఉత్తీర్ణత సాధించాలి. ఇందులో ఎక్కువ మార్కులు సాధించగలిగితే డిఎస్సీ టెస్ట్‌లో వచ్చిన మార్కులు కలిపి మొత్తంగా అభ్యర్థికి విజయాన్ని చేకూరుస్తాయి. రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ నోటిఫికేషన్ ఇవ్వగా ఇప్పటికే దరఖాస్తులు చాలామంది చేసుకున్నారు. ఈనెల 23 వరకూ దరఖాస్తు చేసుకోవటానికి గడువు ఉంది. డిసెంబర్ 10 నుంచి పరీక్షలు ప్రారంభమవుతాయి. జనవరి 19న ఫలితాలు వెల్లడికానున్నాయి. ఈసారి విడుదలైన నోటిఫికేషన్‌కు సంబంధించిన సిలబస్ వివరాలను వెబ్‌సైట్‌లో అందుబాటులోకి తీసుకొచ్చారు. విద్యాశాఖ తెలిపిన షెడ్యూల్ ప్రకారం మాక్ టెస్ట్ ఆప్షన్ ఈనెల 25 నుంచి అందుబాటులోకి వస్తుంది. హాల్ టిక్కెట్లు డిసెంబర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. టెట్ పరీక్షలో అర్హత సాధిస్తేనే డీఎస్సీ రాసేందుకు వీలు ఉంటుంది. ప్రయివేటు పాఠశాలల్లోనూ బోధించాలంటే టెట్ అర్హత తప్పనిసరి చేశారు.
టెట్‌ను పేపర్-1ఎ, 1బి, పేపర్ 2ఎ, 2బిల పేరుతో మొత్తం నాలుగు పేపర్లుగా నిర్వహించనున్నారు.
పేపర్ ఎను పరిశీలిస్తే ఒకటి నుంచి ఐదో తరగతి వరకు ఉపాధ్యాయులుగా బోధించాలనుకునే వారు రాయాల్సిన పరీక్ష.. కాగా పేపర్ 1బి అనేది ఒకటి నుంచి 5వ తరగతి వరకు స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్‌గా పనిచేయాలనుకునే వారు రాయాలి.
స్పెషల్ ఎడ్యుకేషన్ స్కూళ్లలో టీచర్లకు ఈ పేపర్ ఉత్తీర్ణత తప్పనిసరి అనే ఎన్‌సీటీఈ నిబంధనలకు అనుగుణంగా దీన్ని ప్రవేశ పెట్టారు. ఇక పేపర్ 2ఎ చూస్తే ఆరు నుంచి ఎనిమిదో తరగతి వరకు స్కూల్ అసిస్టెంట్‌గా బోధించాలనుకునే వారు ఉత్తీర్ణత సాధించాల్సిన పేపర్ ఇది. ఇక పేపర్ -2బి చూస్తే ఆరు నుంచి 8వ తరగతి వరకు స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్స్‌గా బోధించాలనుకునే వారు అర్హత సాధించాల్సి ఉంటుంది.
పేపర్ -2ఎ చూస్తే ఇందులో చైల్డ్ డెవలప్‌మెంట్ అండ్ పెడగాజి నుంచి 30 మార్కులు వస్తాయి. ఇక లాంగ్వేజ్ 1 నుంచి 30 మార్కులు, లాంగ్వేజ్ 2 ఇంగ్లీష్ నుంచి 30 మార్కులు, సంబంధిత సబ్జెక్ట్ నుంచి 60 మార్కులు ఇస్తారు. మొత్తం 150 మార్కులకు గానూ పరీక్ష నిర్వహిస్తారు. నాలుగో విభాగంగా నిర్వహించే సంబంధిత సబ్జెక్ట్ విషయంలో..మ్యాథమెటిక్స్ అండ్ సైన్స్ టీచర్ అభ్యర్థులు మ్యాథ్స్, సైన్స్ విభాగాన్ని, సోషల్ టీచర్లు సోషల్ స్టడీస్ విభాగాన్ని ఎంచుకుని పరీక్ష రాయాల్సి ఉంటుంది.
పేపర్ 2బిలో చూస్తే చైల్డ్ డెవలప్‌మెంట్ అండ్ పెడగాజి నుంచి 30 మార్కులు, లాంగ్వేజ్ 1 నుంచి 30,లాంగ్వేజ్ 2 (ఇంగ్లీష్)-30, డిజెబిలిటీ స్పెషలైజేషన్ సబ్జెక్ట్ అండ్ పెడగాజి నుంచి 60 మార్కులు ఇస్తారు. మొత్తం 150 మార్కులకుగానూ పరీక్ష నిర్వహిస్తారు. పేపర్ 2బిలో నాలుగో విభాగంలో అభ్యర్థులు స్పెషల్ ఎడ్యుకేషన్ కోర్సులో చదివిన సబ్జెక్ట్‌ను ఎంచుకోవాలి.

చివరి సంవత్సరం విద్యార్థులు కూడా హాజరయ్యే అవకాశం ఉంది.

టెట్ పరీక్ష ప్యాటర్న్, మార్కుల పంపిణీ
మొత్తం 150 మార్కులు, 150 ఆబ్జెక్టివ్ ప్రశ్నలు
ప్రతి పేపర్‌కు 2.30 గంటల సమయం.

ఇన్ సర్వీస్ టీచర్ల అంశంపై స్పష్టత నిల్

ఇన్ సర్వీస్ టీచర్లు టెట్ రాయాలా? వద్దా? అనేది ఈనెల 18న ఎన్‌సిటిఇ ఛైర్మన్, కేంద్ర మానవ వనరులశాఖామంత్రితో చర్చించనున్నారు. టెట్‌పై వేసిన రివ్యూ పిటీషన్లపై సుప్రీంకోర్టు ఈనెల 19న విచారించనుంది. సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులు ఉద్యోగాల్లో కొనసాగాలంటే టెట్ పాసవ్వాలని సుప్రీంకోర్టు సెప్టెంబర్ ఒకటో తేదీన తీర్పునిచ్చిన విషయం తెలిసిందే. 2010కి ముందు నియమితులైన టీచర్లకూ టెట్ రాసేందుకు పాఠశాల విద్యాశాఖ అవకాశం కల్పించింది. తీర్పువచ్చిన దగ్గర నుంచి రెండేళ్ల వ్యవధిలో ఉత్తీర్ణత సాధించాలని తెలిపింది. ఐదేళ్లలో ఉద్యోగ విరమణ చేయబోయే వారికి టెట్ అవసరం లేదనీ, వారు ఉద్యోగోన్నతి పొందాలంటే మాత్రం పాసవ్వాలని స్పష్టంచేసింది. ఇప్పటికే సుప్రీంకోర్టులో పలు రివ్యూ పిటీషన్లు వచ్చాయి. దీనిపై విచారణలో వచ్చిన అంశాల ఆధారంగా కేంద్రప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సివుంటుంది.

ప్రజాశక్తి
www.prajasakti.com
facebook/prajasakti, twitter/prajasakti

అక్షరం

4 | విజయవాడ
సోమవారం 10 నవంబర్ 2025

"మానవుడు శాస్త్ర జ్ఞానాన్ని తప్ప మరే జ్ఞానాన్ని కోరనవసరం లేని పరిస్థితి ఏర్పడుతుంది. దానికి విరుద్ధంగా ఉన్న అన్ని అపోహలను, నమ్మకాలను పూర్వపక్షం చేయడం పురోగామి సాహిత్య లక్షణం."

– కొడవటిగంటి కుటుంబరావు

కాంతి పుంజం

ఏదో ఒక ఆశాకిరణం
ఎప్పుడూ మెరుస్తూనే వుంటుంది
కాల యవనికలో
అది తూరుపు నుండి
పడమర వైపు తిరిగింది
ఇంకేమీ మిగల లేదు అనుకున్నప్పుడంతా
ఒక మిణుగురు గుంపు
చిక్కపడ్డ చీకట్లోంచి
చింతల తోపులోంచి మెరుస్తూ వస్తుంది
సమాధుల మీద
లేలేత ఎర్రని పూవులేవో చల్లుతూ
పిడికిలెత్తి నేనింకా మీకోసం నిలబడి వున్నానని
నవ్వుతూ విశ్వ వేదికపై నుండి మాటిస్తుంది

అది మొలకెత్తింది
పెట్టుబడుల ఏక ధ్రువ ప్రపంచంలోనే కావచ్చు
కానీ ఆ గొంతు
అమరుల నెత్తుటితో తడిచిన నేల
చిరునామాది కదా

గాజా పసిపాపల నెత్తుటి ముద్దల
వాసన ఎరిగినదే కదా
సూడాన్ పిల్లల ఎండిన డొక్కల ఎముకల
పట పట మని విరిగిన శబ్దం విన్నదే కదా

ముస్లిం అయినంత మాత్రాన
ప్రవేశద్వారం ముందు
నగ్నంగా నిలబెట్టి శోధన ఎదుర్కొన్న
అవమానం తెలిసినదే కదా

వేచి చూద్దాం
ఈ కాంతి పుంజం
భూమంతా పరచుకునే వరకు...

(జోర్దాన్ మందానికి అభినందనలతో)

– కెక్యూబ్ వర్మ
94934 36277

వల

సముద్ర ముఖమైనా
ఎరగని రూపాయి
నీటిమీద బతుకెళ్లదీసే
కాయకష్టపు శ్రమ రెక్కలకు
కన్పించని సంకెళ్లను తగిలించి
తన చెప్పుచేతల్లో పెట్టుకుంటుంది

రోజులు గడవడం కోసం
సంవత్సరాలను తాకట్టు పెట్టే బాకీ బతుకులు
రూపాయి అలజడికి
లంగరుడిగిన నావలై గజగజలాడుతున్నాయి

అప్పుడు..
చల్లని సిరినవ్వుల్ని చిందిస్తూ
చందమామలా కనిపించిన రూపాయి
ఇప్పుడు..
అగ్నిగుండ ఉగ్రరూపధారై
కళ్లెర్రజేస్తున్న రూపాయి
ఒక్కటేనా అని ఆశ్చర్యపోయే గంగపుత్రులకు
అప్పుకు మించిన వేట వల వేరొకటి లేదని
ఎప్పటికి తెలుస్తుందో పాపం!?

– మోకా రత్నరాజు
9989014767

స్నిగ్ధా రెడ్డి బాలసాహిత్య పురస్కారం - 2026

తెలుగు సాహితీవనం ఆధ్వర్యంలో ఎంఎల్ఎస్ స్నిగ్ధారెడ్డి జ్ఞాపకార్థం బాలసాహిత్య వేత్తలకు నగదు పురస్కారం అందజేయాలని వారి కుటుంబం సంకల్పించింది. బాలసాహిత్య కవులను, రచయితలను వారు ప్రచురించిన పుస్తకాలను పంపవలసినదిగా కోరుతున్నాం. 2023, 2024, 2025 సంవత్సరాల్లో ప్రచురితమైన బాలసాహిత్యం పుస్తకాలను రెండు కాపీలను కింది చిరునామాకు 31.12.2025 లోగా పంపించగలరు. విజేతకు జూలైలో హైదరాబాద్‌లో జరిగే తెలుగు సాహితీవనం వార్షికోత్సవంలో రూ.5,000 నగదుతో పురస్కార ప్రదానం ఉంటుంది. విజేతలు తప్పనిసరిగా సభకు వచ్చి పురస్కారం అందుకోవాలి. పరిశీలనకు పంపిన పుస్తకాలను తిప్పి పంపడం వీలుకాదు. పుస్తకాలు పంపవలసిన చిరునామా : అరుణ నాయుడు తోట, చీజూ నాదీ గోదావరి, సి బ్లాక్ 502, పైప్‌లైన్ రోడ్, జీడిమెట్ల, హైదరాబాద్–67. ఫోన్ :63019 30055.

– తెలుగు సాహితీవనం సమూహం

శిఖామణికి సప్పా ఎక్సలెన్స్ అవార్డు -2025

రాజమహేంద్ర వరానికి చెందిన ప్రముఖ నాట్య గురువు డా. సప్పా దుర్గా ప్రసాద్ జన్మదినం సందర్భంగా ఏటా ఇచ్చే సప్పా ఎక్సలెన్స్ అవార్డు 2025 కోసం సాహిత్య విభాగంలో ప్రముఖ కవి, కవి సంధ్య సంపాదకుడు. డా. శిఖామణి ఎంపిక అయ్యారు.నవంబర్ 23 ఉదయం రాజమహేంద్రవరంలో అవార్డుల ప్రదాన సభ ఉంటుంది. సంగీత, సాహిత్య, కళా, సామాజిక తదితర రంగాలలో వంశీ రామరాజు, ఆర్.మల్లికార్జున రావు, పొత్తూరి సుబ్బారావు, హేమసుందర్ వంటి ప్రముఖులు వున్నారు.

– నటరాజ నృత్య నికేతనం

నాగసూరి వేణుగోపాల్‌కు 'జ్ఞానజ్యోతి' పురస్కారం

జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా తెలుగు సాహిత్యరంగంలో అత్యంత విశేష కృషి సల్పుతున్న పరిశోధక రచయితకు 'ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం' ఏటా ఇచ్చే 'జ్ఞానజ్యోతి' పురస్కారం 2025కి గాను ప్రముఖ రచయిత డా. నాగసూరి వేణుగోపాల్‌కు ప్రకటించింది. సైన్స్ విజ్ఞానం, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా, జాతీయ నాయకుల చరిత్రలు వంటి పరిశోధనాత్మక విశేష రచనలను అందించినందుకు గాను నాగసూరి చేసిన కృషిని గుర్తించి రచయితల సంఘం ఈ పురస్కారానికి ఎన్నిక చేసింది. ఈ పురస్కారం కింద 3,000 నగదు, జ్ఞాపిక, సన్మాన పత్రం, శాలువాలతో నవంబర్ 15వ తేదీ సాయంత్రం విజయవాడలోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో రచయితని సత్కరించడం జరుగుతుంది.

– చలపాక ప్రకాష్, 98482 02526.

తెలుగు సూర్యుడు సి.పి.బ్రౌన్

సూర్లార్లు లెక్కచేయక
పేర్లెక్కిన విబుధవరుల బిలిపించుచు, వే
మార్లర్థమిచ్చు వితరణి
ఛార్లెసు ఫిలిప్పు బ్రౌను సాహెబు కరుణన్
(బ్రౌన్ సారథ్యంలో వసుచరిత్రకు వ్యాఖ్య రాసిన ములపాక బుచ్చయ్య)



నేడు సిపి బ్రౌన్ జయంతి

ఛార్లెస్ ఫిలిప్ బ్రౌన్ కేవలం తూర్పిండియా కంపెనీ ఉద్యోగిగానో, కేవల జీతమాత్రోపజీవిగానో బతికి చనిపోయి ఉంటే ఇవాళ ఆయనను గురించి మనం మాట్లాడుకోవలసిన అవసరమే ఉండేదికాదు. వలస పాలకులనగానే మనకు గుర్తుకు వచ్చేది వాళ్ళ దోపిడీ ఆర్థిక విధానం. ఆ దోపిడీవిధానం ఇరుకు సందులలోనే బ్రౌన్ ఇరుక్కొని పోయి ఉంటే కూడా మనం ఆయనను ఎప్పుడో చెత్తబుట్టలో పారవేసి ఉండవచ్చు. వలస పాలకులకు సహజమైన జాత్యహంకారం బ్రౌన్ కూడా ప్రదర్శించి ఉంటే ఆయనను ఆనాడే మనం కర్రలతో కొట్టి తరిమేసేవాళ్ళం. ఆయన అలా బతకలేదు గనుకనే మనం ఆయనను తెలుగు సూర్యుడుగా కీర్తించి గుండెల్లో పెట్టుకుని ఉన్నాం.

ఆయనే లేకుంటే మనం ఇవాళ చదువుకుంటున్న ప్రాచీన తెలుగు కావ్యాలు తాటాకులలోనే నిద్రించి శిథిలమైపోయి ఉండేవి. అంతేకాదు అవి చాలాకాలం వరకు అల్ప సంఖ్యాకుల అధీనంలోనే ఉండిపోయేవి. ఆయన తూర్పిండియా కంపెనీ ఉద్యోగిగా, జీతగాడుగా ఉండిపోలేదు. తన జీతంతో పండితులకు జీతమిచ్చి ప్రాచీన కావ్యాలను పరిష్కరింపజేశాడు. వ్యాఖ్యానాలు రాయించాడు. వలసవాదుల అవసరాలకోసమైనా ఆయన తెలుగుభాష వ్యాకరణం గురించి, తెలుగు ఛందస్సును గురించి కృషి చేశాడు. వీరగ్రాంథికం రాజ్యమేలుతున్న సమయంలో వ్యావహారిక భాషను ఉపయోగించాడు. కోస్తాంధ్రలో ధవళేశ్వరం ఆనకట్ట నిర్మాణంలో ఉండగా, సిపి బ్రౌన్ తెలుగు ఇంగ్లీషు, ఇంగ్లీషు తెలుగు నిఘంటు నిర్మాణం చేశారు. రాయలసీమను కరువు పీడిస్తుంటే, వలస పాలకుల విధానాలకు భిన్నంగా వాస్తవాలతో నివేదిక పంపాడు. నివేదికలో ఫామిన్ అనే మాట ఉపయోగించి, దానికోసం ఆయన పై అధికారులతో చివాట్లు తిన్నాడు. తెలుగు ప్రజలతో తెలుగు భాషలోనే మాట్లాడడం కంకణం కట్టుకొని అమలు చేశాడు. ప్రాచీన తెలుగు పద్యాలను తెలుగు వాళ్ళే అర్థం చేసుకోవడం కొంత శ్రమతో కూడిన పనే. అలాంటిది బ్రౌన్ ఆ పద్యాలను చదివి వాటిని ఆంగ్లంలోకి అనువదించుకోవడం అప్పటికే ఒక ముందడుగు.

రాగూరు పద్మావతి గారు 'బ్రౌన్ కావ్య సముద్ధరణము' అనే అంశం మీద పరిశోధన చేశారు. ఆమె ఇచ్చిన బ్రౌన్ సేకరించిన గ్రంథాలు పట్టిక చూస్తే ఆశ్చర్యంలో మునిగిపోతాం. తాను సంపాదించిన తాళపత్ర ప్రతులను పరిష్కరించి శుద్ధ ప్రతులను తయారు చేయడానికి బ్రౌన్ కడపలో భవనమే కట్టించి, దాదాపు పన్నెండు మంది పండితులతో పని చేయించారు. జూలూరి అప్పయ్య శాస్త్రి, తాతా చార్యులు, పరవస్తు చిన్నయ సూరి, చెంచయ్య, కంభం నరసింహాచార్యులు, చిలకమర్తి నరసింహాచారి, సముద్రాల నరసింహాచార్యులు, బుచ్చయ్య శాస్త్రి, ఆరణిమఠం వీరభద్రయ్య, గరిమెళ్ళ వెంకయ్య, పత్యం పరబ్రహ్మశాస్త్రి, పమిడిపాటి వెంకట నరసయ్య వంటి అనేకమంది బ్రౌన్ తెలుగు ప్రాచీన కావ్య సముద్ధరణ ఉద్యమంలో యోధులుగా పనిచేశారు. ఒక ఉద్యోగికి, తన ఉద్యోగంతో సంబంధం లేని ఇంతటి సాంస్కృతిక నిబద్ధత ఉండడం ఆశ్చర్యం.

బ్రౌన్ ఆధునికుడు గనుక, అప్పటికి తనకు తెలిసిన ఆధునిక పద్ధతుల్లో కావ్య పరిష్కరణ చేయించడంలో, వ్యాఖ్యానం రాయించడంలో, తాను రచనలు చేయడంలో ఆధునిక పాశ్చాత్య పద్ధతులను అనుసరించాడు. వాటిని తెలుగువాళ్ళకు పరిచయం చేశాడు. 1829లోనే కావలి వెంకట రామస్వామి, బ్రౌన్ కలిసి ఆధునిక తెలుగు సాహిత్య విమర్శకు పునాది వేశారని చరిత్రకారులు గుర్తించారు. బ్రౌన్ జీవితచరిత్ర రాసిన డా.కొత్తపల్లి వీరభద్రరావు గారు Throughout his life he prefered the European method of study. Thus C.P.Brown was the first man and perhaps the only notable foreigner who paved the way for the European method of study in Andhra for subsequent generations of writers and critics to follow అన్నారు

తాను తెలుగు సాహిత్యరంగంలోకి ప్రవేశించేనాటికి తెలుగు సాహిత్య పరిస్థితి ఎలా ఉండేదో బ్రౌన్ ఒకచోట పేర్కొన్నారు. When I began these tasks, Telugu Literature was dying out.The flame was just glimmering in the socket.To revive the literature of a language was an arduous task for one man and be a foreigner. ఇలాంటి స్థితినుంచి మన ప్రాచీన తెలుగు కావ్యాలను సంరక్షించాడుగనకనే ఆయనను తెలుగు సూర్యుడు అని గౌరవించాం. ఆయన అనేక రకాల పదవుల్లో పని చేశారు. ఏ పదవిలో ఉన్నా సాహిత్య సముద్ధరణ ఉద్యమానికి విరామం ఇవ్వలేదు.

సాహిత్యానికి ఎంత చేశారో, బ్రౌన్, సామాజికంగా కూడా అంతే చేశారు. అక్షరాస్యత అంతంతమాత్రంగా ఉన్న రోజుల్లో బ్రౌన్ స్వయంగా పాఠశాలలు స్థాపించి నిర్వహించారు. సతీ సహగమనాలను కూడా జోక్యం చేసుకుని నివారించారని చరిత్రకారులు చెబుతున్నారు. పేదవాళ్లకు ఆర్థిక సహాయం చేయడం బ్రౌన్ జీవితంలో ఒక భాగమని ఆయన లేఖలు తెలియజేస్తున్నాయి.

తండ్రి డేవిడ్ బ్రౌన్ భారతీయ భాషలను అధ్యయనం చేయమని ఇచ్చిన సలహాతో పాటు, చెన్నైలో చదువు పూర్తయి నప్పుడు ఉద్యోగం వచ్చేముందు మద్రాసు గవర్నర్ థామస్ మన్రో విద్యార్థులకు ఒక సలహా ఇచ్చాడు. 'ప్రజల భాష ప్రజాపాలకులైన మీకు తెలిసి ఉంటే పాలనాపరంగా ఫలితాలు ఆశాజనకంగా ఉంటాయి. ప్రజలతో మమేకమై పని చేస్తే అటు ప్రజలకు, ఇటు ప్రభుత్వానికీ మీరు సారథులవుతారు. ప్రజలతో వారి భాషలోనే మాట్లాడండి. వారి సమస్యలు వినండి. పరిష్కరించండి." అంటూ మన్రో ఇచ్చిన సలహా బ్రౌన్ మీద బలమైన ప్రభావం ముద్ర వేసింది. అప్పటిదాకా పాలనకు సరిపోయే తెలుగు మాత్రమే తెలిసిన బ్రౌన్ తన తెలుగు భాషా సంపదను అభివృద్ధి చేసుకున్నాడు. దాంతో మన భాషా సాహిత్యాలకు చరిత్రాత్మకమైన మేలు చేశాడు. ముప్పై నాలుగేళ్ళ ఉద్యోగం చేసే సమయంలోనే గాక, తిరిగి ఇంగ్లాండుకు వెళ్లాక కూడా ఆయన తెలుగును వదిలి పెట్టకుండా కృషి చేశాడు. అది ఆయన తెలుగు భాషా నిబద్ధత.

1798, నవంబర్ 10న కలకత్తాలో పుట్టిన సి.పి.బ్రౌన్, 1817 ఆగస్టు నెల మధ్యలో ప్రభుత్వ ఉద్యోగిగా మద్రాసులో అడుగు పెట్టాడు. 1821లో కడపలో రెండు పాఠశాలలు తెలుగు, హిందూస్తానీలు బోధించడానికి స్థాపించాడు. 1824లో అబేదుబాయ్ రచించిన 'హిందువులు ఆచారాలు, పండుగలు' అనే పుస్తకం చదువుతూ ఒకచోట వేమనను గురించి ఉండడం చూశాడు. వేమనను అన్వేషించడం మొదలుపెట్టాడు. బహుశా అప్పటికి వేమన గతించి 150 ఏళ్ళు అయ్యుంటుంది. వేమన పద్యాలు ప్రజల నాలుకల మీద నాట్యం చేస్తున్నాయి. బ్రౌన్ వేమన పద్య సేకరణ మొదలుపెట్టి 1829లో 693 పద్యాలతో ఒక సంపుటి ప్రచురించాడు. వాటిని ఆంగ్లంలోకి అనువదించాడు. అయితే మద్రాసులో ఆ ప్రతులు మురిగిపోయాయి. సమాజంలోకి పోలేదు. అందులో కుట్ర ఉందంటారు. ఆయన పట్టు వదలకుండా మళ్ళీ పదేళ్ళు కష్టపడి ఇంకా ఎక్కువ పద్యాలు సేకరించి 1839లో 1215 పద్యాలకు పైగా రెండవ సారి ప్రచురించాడు. అడివంటుకుంది. వేమన శరవేగంగా ప్రజల్లోకి చొచ్చుకుపోయాడు. వేమనను గ్రీకు భాషలో లూసియాన్ వంటివాడని వర్ణించాడు బ్రౌన్. అప్పటినుంచి నేటిదాకా వేమన పద్యాలు సంఖ్య ఆరు వేల దాకా పోయింది. పరస్పర విరుద్ధ భావజాలాల పద్యాలు వేమన పేరు మీదే చలామణిలోకి వచ్చేశాయి. వేమన మీద బ్రౌన్ అంత శ్రద్ధ చూపడానికి కారణం వేమన పద్యాల్లోని ప్రజాస్వామిక భావజాలమే. విగ్రహారాధన, మతపరమైన కర్మకాండ, కుల వివక్ష, దొంగ ఆధ్యాత్మికత వంటి అశాస్త్రీయభావ ఖండనే కారణం. రాజాస్థానం నుంచి వెలువడిన కావ్యాలను ఎన్నింటినో బ్రౌన్ పరిష్కరింపజేసి ప్రచురించాడు. వేమన పద్యాల్లోని సామాజికత నచ్చి వాటి మీద ఎక్కువ శ్రద్ధ పెట్టాడు. దానిని సహించలేని తిరోగమనవాదులు వేమనలో హిందూ వ్యతిరేకత ఉండడమే బ్రౌన్ లాంటి పాశ్చాత్యులు ఆయనను ఇష్టపడడానికి కారణమని భావించారు. అదే కారణమైతే ఆయన పురాణేతిహాసాలు జోలికి పోయేవాడు కాదు కదా! ఇదలా ఉంచుదాం. బ్రౌన్ జీవించి ఉండగానే 1848లో పుట్టిన వీరేశలింగం పంతులు, అప్పటికే రెండవ ప్రచురణ పొందిన వేమన పద్యాలు అందుబాటులో ఉన్నా, తన సంఘ సంస్కరణ ఉద్యమానికి అవసరమైన ముడిసరుకు వేమనలో ఉన్నా, తన ఆంధ్ర కవుల చరిత్రలో వేమనకు చోటు దక్కకపోవడం ఒక మిస్టరీనే.

సిపి బ్రౌన్ ఆరోజుల్లోనే యాభైవేల రూపాయలు చెల్లించి వేలకొలది తాళపత్ర గ్రంథాలు సేకరించారనీ, చాలా గ్రంథాలు రచించారనీ, అవన్నీ 52 సంపుటాలుగా లండన్ ఇండియా ఆఫీసులో ఉన్నాయనీ, ఆరోజుల్లో బ్రౌన్ జరిపిన ఉత్తర ప్రత్యుత్తరాలు ఒక్కొక్క సంపుటం నాలుగు వందల పేజీలు గల ఇరవై సంపుటాలు ఉన్నాయనీ ఆచార్య జీఎన్ రెడ్డి గారు తెలియజేశారు. ఆ గొప్ప వ్యక్తి మరణించిన తొంభై ఏళ్ళకు 1975లో తిరుపతి శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం తెలుగు శాఖలో ఆచార్య జీఎన్ రెడ్డి గారి అధ్యక్షతలో సిపి బ్రౌన్ పరిశోధన కేంద్రం మొదలైంది. అందులో బండి గోపాలరెడ్డి పరిశోధనాధికారిగా చేరారు. ఆయన చాలా కృషి చేసి బ్రౌన్ వాఙ్మయం చాలా సంపాదించారు. కొన్ని సంపుటాలు ప్రచురించారు. ఆ క్రమంలో 1976లో ఆచార్య జీఎన్ రెడ్డి, ఆరుద్ర, బంగోరె కడప జిల్లా రచయితల సంఘం సమావేశాలకు హాజరై బ్రౌన్ నివసించిన స్థలాన్ని చూశారు. ఆ తర్వాత జానమద్ది హనుమచ్ఛాస్త్రి గారి ప్రయత్నంతో 1987లో బ్రౌన్ మరణించిన 103 ఏళ్ళకు అప్పటి కడప జిల్లా కలెక్టర్ పిఎల్ సంజీవరెడ్డి, తర్వాత వచ్చిన హరినారాయణ గార్ల సహకారంతో సిపి బ్రౌన్ స్మారక గ్రంథాలయం పునాది పడింది. అది మొండిగోడల నుంచి మహాసౌధం దాకా ఎదిగింది. హనుమచ్ఛాస్త్రి కృషి ఆయనను 'బ్రౌను శాస్త్రి'ని చేసింది. కడపలో యోగి వేమన విశ్వవిద్యాలయం రావడంతో ఆ గ్రంథాలయం సిపి బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంగా రూపొందింది. శాస్త్రి గారు బ్రౌన్ ద్విశతాబ్ది ఉత్సవాలు నిర్వహణలో కీలకపాత్ర పోషించారు. ఇప్పటికి, ఇన్నాళ్ళకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం బ్రౌన్ పుట్టినరోజును రాష్ట్ర పండుగగా జరపాలని నిర్ణయించింది. ఈ సందర్భంగా సిపి బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం పరిధిని విస్తరించాలి. బ్రౌన్ రచించిన గ్రంథాలను, సేకరించిన గ్రంథాలను బంగోరె సంపాదించినవి, ఇతరమైనవి సేకరించాలి. ఆ సంస్థను ఒక అకాడమీగా మార్చుకోవాల్సిన అవసరం ఉంది. అప్పుడే తెలుగు సూర్యునికి తెలుగు భాషకు అమరుని వంటివ్యక్తి బ్రౌన్‌కు సరైన నివాళి అవుతుంది.

– రాచపాళెం చంద్రశేఖర రెడ్డి
94402 22117

వర్తమాన అకృత్యాలపై రాజేసిన కొలిమి

ఇటీవల గొప్ప సామాజిక కవిత్వం రాస్తున్న వారిలో పతివాడ నాస్తిక్ ఒకరు. ఆయన వెలువరించిన కవితా సంపుటి 'కొలిమి రాజేయ్యాల్సిందే...' వర్తమాన సమాజానికి అవసరమైన స్వరం. ఈ మండే తన మనసు కొలిమినుంచి అక్షరాలను ఏరుకుంటాడు. వాటిని బాణాల్లా మార్చి సంధించటానికి విల్లును ఎక్కుపెట్టినప్పుడు ఇంక్విలాబ్ జిందాబాద్ నినాదాలు తప్ప, మరే మాటలు అతనికి వినిపించవు. చీకటి బజార్లో ముంచెత్తుతున్న దోపిడీ వాయుగుండాల వరద బీభత్సాన్ని మాత్రమే అతడు చూడగలుగుతాడు. తన చేతిలోని విల్లు తాడును లాగినప్పుడల్లా చెమట సంపద కొట్టుకుపోయి, దిక్కుతోచని దీనస్థితిలో వున్న బడుగు బతుక్కి భరోసా నిచ్చే ఒక శబ్దాన్ని కమ్యూనిజం వేదికగా ఈ కవి అందిస్తున్నాడు. కష్టజీవులంతా ఎర్ర సముద్రపు తరంగాల హోరులో కలిసి ఉద్యమించే రోజు వస్తుందని తన నమ్మకాన్ని ఒక జెండాలా అక్షరాల సాక్షిగా ఎగురవేస్తున్నాడు. కడుపులో లుంగచుట్టుకు పోతున్న పేగుల్ని తెంచుకొని పుట్టే పిడికిళ్లను గురించి చెబుతూ... 'అవి మీ కంచాల మీద కలబడి/ మీ గోడౌన్ల మీదికి ఎగబడి/ మీ కొంపల్ని నేలమట్టం చేస్తాయి' అంటూ దోపిడీ వర్గాలకు పదునైన హెచ్చరికల్ని జారీచేస్తున్నాడు ఈ కవి.

నిబద్ధత కలిగిన కవుల వరుసల్లో సముచిత స్థానాన్ని అందుకున్న పతివాడ నాస్తిక్, వర్తమానంలో దిశా నిర్దేశాలు లేని కవులపట్ల తన నిరసనను తీవ్రమైన స్థాయిలోనే వ్యక్తం చేస్తున్నాడు. కష్టజీవుల కన్నీళ్ల తడిస్పర్శ అంటే ఏమిటో అర్థం కాకుండానే– పేదల ఆకలి మీద అలవోకగా కవిత్వాన్ని రాసే కవులందర్నీ ఒకచోట సమావేశపరిచి... 'నువ్వు మురికివాడల్లోని/ ఇరుకు గుడిసెల్లోకి/ కష్టజీవుల్లోని/ చెమట చుక్కల్లోకి/ ప్రయాణించటం మొదలుపెట్టు/ అప్పుడు నువ్వు/ ఆకలిగొన్న చంటిబిడ్డకు/ అమ్మ కలిపిన పాలబువ్వలా/ కమ్మ కమ్మగా పరిమళిస్తావ్...' అంటూ ఉద్బోధిస్తున్నాడు. ఈ మాటల్ని వర్తమాన కవులు చాలామంది జీర్ణించుకొని, వాటిని పాఠాలుగా స్వీకరించి ప్రజాకవులుగా మిగిలిపోవాలని ఆశిస్తున్నాడు.

వానలు, వరదలు ముంచెత్తి, కొంపా గూడూ నాశనమై పోయి, కన్నీళ్లతో ఓదార్చుకుంటూ, కలిసి కలో గంజో సర్దుకుని పంచుకుంటున్న ఎర్రకలువల పక్కన నిలబడి, వాళ్ల హృదయ స్పందనను ఆసక్తిగా కవి వినిపిస్తున్నాడు. వాళ్ల కళ్లను వాళ్ల వేళ్లతోనే పొడిపించుకునేలా చేసిన నయావంచకులను ఎదురుగా నిలబెట్టి, గతంలో వాళ్లు చేసిన నిర్వాహకాలన్నింటినీ ఏకరువు పెడుతూ, కనురెప్పల మధ్య కోపాన్ని నిప్పుల్లా కురిపిస్తూ, పిడుగుల్లా మాటల్ని సంధిస్తూ... 'చూడు../ నూటాయాభై కోట్ల బిందువులతో/ నిండిన ఈ సుందర సరోవరంలో/ ఎలుగెత్తే చైతన్యం వెల్లువలా లేస్తుంది/ ఎర్రని కలువలు పూసే/ మంచికాలం/ తప్పక నీ అంతు తేలుస్తుంది...' అంటూ రేపటి కాలం మాత్రం మాదేనంటూ గర్జిస్తున్నాడు.

ఇది కష్టజీవుల చెమట వాసనతో పరిమళిస్తున్న కవిత్వం. రాజ్యం వెన్నులో వణుకు పుట్టించి, చట్టం కన్ను తెరిపించి, పేరుకున్న కుట్రల ముళ్ళ డొంకల్ని నరికివేసి, రేపటి ఉదయానికి ఈ రాత్రిని సిద్ధం చేయగల సూర్యబింబాలను పరిచయం చేస్తూ... 'వాళ్ల గంజినీళ్ల కడుపు నిండా తాగి/ గుండె కమతాల్లో ఎర్రపూల వనాల్ని స్వప్నిస్తుంటారు / వాళ్ల రాగిజావ చేతినిండా జుర్రి/ మెదడు కొలుముల్లో చంద్ర నిప్పుకణాల్ని/ రాజేస్తూ వుంటారు/ దయచేసి మీ నగర జీవన మైకపు వలల్ని/ ఆ అమాయక జీవుల మీద విసిరి/ వాళ్ల బతుకుల్ని ఛిద్రం చేయకండి...' అంటూ వురుములా వురిమిన ఈ మాటలు రేపటి పోరాటానికి ఇప్పుడే సంతకాలు చేస్తున్న గుండె సవ్వడిని వినిపిస్తున్నాయి. ప్రజల సమస్యల పట్ల, వారి బాధలు, కష్టాలు, కన్నీళ్ల పట్ల, వాళ్లు ఎదుర్కొంటున్న దోపిడీ మూలాల పట్ల ఈ కవికి సమగ్రమైన అవగాహన వుంది. ఆయన కవిత్వంలో తొందరపాటు లేని అర్థవంతమైన ఆలోచనల వరుసలు మనతో కరచాలనం చేయటం విశేషం. తన కవిత్వం ద్వారా పూర్తి విశ్వాసాన్ని పొందగలిగిన స్థాయిలో నిలబడి, అద్భుత భావజాల సమ్మిళితంతో, గొప్ప సృజనాత్మక అనుభవాలను జోడించిన ఈ కవి, ఇజ్రాయిల్ చాలా పాశవికంగా పాలస్తీనా దేశంపై విరుచుకుపడుతున్న దాడిని తీవ్రమైన స్వరంతో ఖండిస్తూ 'నువ్వు ఎంత గట్టిగా కొడితే/ అంత గట్టిగా పైకి లేచి/ నరాల నిండా నెత్తుటి చైతన్యపు/ గాలితరంగాల్ని వెంటబెట్టుకొని/ చెక్కుచెదరని స్థైర్యంతో/ నిద్ర పోతున్న దిక్కుల/ గుండెలమీద గుద్ది మరీ/ మేల్కొపగల పాలస్తీనా/ పాలబుగ్గల తోలుబంతిని...' అంటూ తన కవితను దండోరా చేసి అందించిన శబ్దం, అక్షరాల తలపాగాలతో ఎప్పటికీ మనకు వినిపిస్తూనే వుంటుంది.

పతివాడ నాస్తిక్ కలంనుంచి వెలువడిన 'కొలిమి రాజేయ్యాల్సిందే!...' కవితా సంపుటిలో అసలుసిసలైన వాస్తవ సంగతులు చాలా సారవంతంగా ఆవిష్కరించబడ్డాయి. ఆకలితో చుట్టుకుపోతున్న పేగుల కంఠస్వరాల శబ్దాలను నమోదు చేసిన ప్రయత్నమిది. జాతుల మధ్య, తెగల మధ్య, కులాల మధ్య, మతాల మధ్య, భాషల మధ్య, ప్రాంతాల మధ్య అగ్గిరాజేస్తున్న ద్రోహుల చరిత్రలను చీల్చి చెండాడే వేదికల్ని సిద్ధం చేసిన అంకితభావ చర్య ఇది. ఈ సంపుటి కవితల్లోని పదాలను చదవగానే భావం దృశ్యాలలోకి తర్జుమా గావించబడటం ఒక విశేషం. కణ, కణమని మండే నెత్తుటి మడుగులో మండే నిజాల, ఇజాల భావాల భాస్వర రూపాన్ని అందించిన ఈ కవి ఆలోచన మెచ్చుకోతగిందిగా వుంది.

ఈ సంపుటిలోని చాలా కవితలు ఎర్రమందారాలుగా వికసించటానికి కారణం... ఈ కవి ఆఫ్రికన్ కవుల్ని ఇష్టపడతాడు కాబట్టి, ఆ కవిత్వపు సారాన్ని తన ఎదుగుదలకు భూమికగా ఎంపిక చేసుకున్నాడు కాబట్టి, సామ్రాజ్యవాద ఉక్కుపాదాలను అక్షర ఫిరంగులతో పేల్చివేసిన లాటిన్ అమెరికన్ రచయితలను ఆరాధిస్తూ... పాబ్లో నెరుడా, గోర్కీ, శ్రీశ్రీ, శివసాగర్ మొదలైన కవుల కవిత్వ ఆలోచనా ధోరణుల్ని తన శ్వాసలో నింపుకున్నాడు కాబట్టి. సామాజిక చలన సూత్రాలను సంపూర్ణంగా అర్థం చేసుకున్న పతివాడ నాస్తిక్, ఈ సంపుటితోనే ఆగకుండా తన అక్షరాల కొలిమిని రాజేస్తూనే వుండాలని మనసారా ఆశిద్దాం. ప్రతుల కోసం (రూ.200) 94417 24167 నెంబర్లో సంప్రదించొచ్చు.

– డాక్టర్ కె.జి.వేణు
98580 70084

ఇల్లాలి ముచ్చట్ల మధురవాణి

చాలా రోజుల తర్వాత ఓ పత్రిక చేతికందగానే గంటన్నర పాటు నన్ను బంధించి వేసింది, సుమారు నలభయ్యేళ్ళ క్రితపు కాలానికి హాయిగా పట్టుకుపోయింది! "...తెలుగులో నిజమైన సాహిత్యం చాలా తక్కువగానే ఉంటున్నదని దిగులు పడే వాళ్ళున్నారు. కాని మంచి జర్నలిజం ఇంకా తక్కువగా ఉన్న సంగతి చాలామంది గుర్తించినట్టు కనబడదు. దానికి కారణం ఆధునిక యుగంలో జర్నలిజానికి గల విలువ జన సామాన్యానికి తెలియకపోవడమే. సాహిత్యంలో ఉండే భేషజం కూడా జర్నలిజంలో లేదు. అది వర్తమాన సామాజికుడితో వర్తమాన జీవితం గురించి నిత్య వ్యవహారంలో మాట్లాడుతుంది. సాహిత్యం శాశ్వతమైన విలువలు గలదనీ, జర్నలిజం తాత్కాలికమైన విలువగలదనీ అధిక సంఖ్యాకుల అభిప్రాయం. దీనికి పూర్తిగా విరుద్ధమైన అభిప్రాయం గల పాశ్చాత్య విమర్శకుడు కనీసం ఒకరున్నట్టు నాకు తెలుసు."





కాకతాళీయంగా ఆ సంచిక తెరిచినప్పుడు ఓ పేజీలో ఆ వ్యాసం ఇలా మొదలైంది. భలే ఉందీ అభిప్రాయం కదా, అని చూస్తే అవి కొడవటిగంటి కుటుంబరావు చెప్పిన మాటలని బోధపడింది. మరి ఆ పుస్తకం నన్ను ఆక్రమించుకోకుండా ఎలా ఉంటుంది? ఇంతకీ సందర్భం ఏమిటంటే పురాణం సుబ్రహ్మణ్యశర్మ 'ఇల్లాలి ముచ్చట్లు' సంకలనానికి ముందుమాటనలా మొదలెట్టారు కుటుంబరావు. నండూరి రామమోహనరావు, రాచకొండ విశ్వ నాథశాస్త్రి, గొల్లపూడి మారుతిరావు, ఇంద్రగంటి శ్రీకాంతశర్మ, శ్రీరమణ, టి.ఎల్. కాంతారావు, కె.వి.ఎస్.వర్మ, డి.కామేశ్వరి, బులుసు వెంకట కామేశ్వరరావు వంటివారి రచనలు ఇందులో కనబడి మరింత ముచ్చట గొలిపాయి.

ఎంతో ప్రఖ్యాతి చెందిన సంపాదకుడు పురాణం సుబ్రహ్మణ్య శర్మ (1929– 1996), అంతగా పేరు రాని మంచి కథకుడు పురాణం సూర్యప్రకాశరావు (1934–1987) అన్నదమ్ములు. వీరిద్దరి సాహిత్య కృషిని గుర్తు చేసుకుంటూ 'ప్రమిద' పత్రిక సుమారు 160 పేజీల ప్రత్యేక సంచికను ఇటీవల వెలువరించింది. ఇందులో అన్నకు వంద పేజీలు పైన కాగా, తమ్ముడికి 50 దాకా కేటాయించారు. ఇప్పుడు 60, 70 సం. దాటిన మాతరం వారు కాలేజీల్లో చదివే రోజుల్లో పురాణం సుబ్రహ్మణ్యశర్మ సాహిత్య ప్రపంచంలో సినిమా తారకు మించిన గ్లామర్‌తో వెలిగేవాడు. ఇదే సంచికలో ప్రఖ్యాత పేరడీ రచయిత శ్రీరమణ సంపాదకుడిగా పురాణం గురించి ఇలా అంటారు : "...ఏ సీరియల్ పాఠకులకు బాగా పడుతుందో పది పేజీలు తిప్పి పసిగట్టే నేర్పు ఉండేది. మంచి విలువలను, ప్రాచుర్యాన్ని ఏకకాలంలో సాధించగల ఫార్ములా తెలిసిన సంపాదకుడు. ఆంధ్ర సచిత్ర వారపత్రిక తర్వాత 1970 దశకంలో ఆంధ్రజ్యోతి వీక్లీని ప్రతిష్టాత్మకంగా తీర్చిదిద్దారు. కొమ్మూరి వేణుగోపాలరావు, యద్దనపూడి, మాదిరెడ్డి లాంటి రచయితల ప్యాపులర్ సీరియల్స్ ఒకవైపు– హిమజ్వాల, అనుక్షణికం, హ్యాంగ్ మి క్విక్ లాంటి వినూత్న ప్రయోగాలు మరోవైపు సాగేవి. సత్యం శంకరమంచి 'అమరావతి కథలు' చాలవా ఆనాటి వైభవం చెప్పడానికి. కొత్త కలాలు బాపు బొమ్మలతో విజంభిస్తుంటే, యమ్వీయల్ గిలిగింతల జవాబులు యువతరాన్ని ఉర్రూతలూగిస్తుంటే, మరోవైపు చర్చావేదిక సందడిసందడిగా సాగేది..."

అంతేకాదు; యండమూరి, మల్లాది, సమరం రచనలు; పేకాట, కామశాస్త్రం గురించిన వ్యాసాలు, గుంటూరు శేషేంద్ర శర్మ సీరియల్ 'కామోత్సవ్' వంటివి కూడా ప్రచురించి పేరు గాంచినవాడు. శ్రీశ్రీ గురించి మిరియాల రామకష్ణ పీహెచ్డీ చేసి సిద్ధాంత గ్రంథం ప్రచురిస్తే– కొన్ని వారాలపాటు 'మిరియాల కషాయం' అని తన ఫిడేల్ రాగాల్లో ఢడేల్ ఢడేల్మని చితక్కొట్టిన లిటరరీ ఎడిటర్ కూడా పురాణమే. శ్రీశ్రీ చనిపోయినప్పుడు అద్భుతమైన రీతిలో ప్రత్యేక సంచిక తెచ్చినవాడు కూడా ఈయనే. ఇతనిని దగ్గర నుంచి చూసిన శ్రీ రమణ ఇంకా ఇలా అంటారు: ".. ఒకసారి ఎందుకో కాస్తంత మంచి చేద్దామని వరుసగా కందుకూరి, చిలకమర్తి, ముట్నూరి ఫోటోలను ముఖచిత్రాలుగా వేశారు. ఈ గ్రోమోర్ రైతుల కవర్ పేజీలు ఆపండని ఏజెంట్ మహాశయులు హాహాకారాలు చేశారు. తర్వాత మరెప్పుడూ సినిమా తారలని పక్కన పెట్టలేదు. "పాలు అమ్మడం కష్టం గాని కల్లు అమ్మడం తేలిక. వ్యసనానికి పబ్లిసిటీ అక్కర్లే"దని ఆఫ్ ద రికార్డులో బాధపడేవారు. సరుకు, సాహసం, తీవ్రమైన ఇష్టాయిష్టాలు కలిగిన రైటర్ ఎడిటర్ పురాణం."

పురాణం కంటే కాస్త పెద్దవారు, జర్నలిస్టుగా సీనియరైన నండూరి రామమోహనరావు ఆయన రచనాశైలి గురించి ఇలా రాశారు: "మాంఛి జవనాశ్వంలా పరుగులు తీసే ఇలాంటి 'రేసీ' ప్రోస్ తెలుగులో రాసేవాళ్ళని ఒక చేతి వేళ్ళ మీద లెక్క పెట్టవచ్చు. అందుకే ఐ లైకిట్. దేర్ ఇజ్ (ఆల్మోస్ట్) నథింగ్ లైకిట్. ... మామూలు ప్రోజులాంటి జీవితంలో నుంచి పోయెట్రీని, ఫిలాసఫీని, ఇంద్రధనుస్సుల్ని పిండగలిగిన ఈ 'ముచ్చట్లు' ఐ లైకిట్, ఐ టూ లైకిట్." మునిమాణిక్యం గారి కాంతం లాగా, భానుమతి అత్తగారి లాగా తెలుగు పాఠకులలో తిష్ట వేసుకున్న ప్రఖ్యాత పాత్ర పురాణం సీత. సుబ్రహ్మణ్య శర్మతో నండూరి రామ్మోహనరావే ఈ శీర్షికను నిర్ణయించి, నామకరణం చేసి రాయమని పురమాయించారట. అప్పట్లో రచయిత్రుల సీరియల్స్, కథల స్వారీ తెలుగు పత్రికల్లో విజయవంతంగా సాగుతోంది కనుక, అలా స్త్రీ పాత్రతో పరకాయ ప్రవేశం చేయించారు, రాయించారు. అది పాతికేళ్ల పండుగ జరుపుకున్న శీర్షిక. పురాణం ఎంత చమత్కారి అంటే, ఫ్లయింగ్ సాసర్స్ (ఎగిరే పళ్ళాలు) మీద పత్రికలలో తరచుగా కథనాల తరుణంలో 'ఎగిరే పెళ్ళాలు' శీర్షికన సరదాకి ఓ ముచ్చట రాసిపడేశారు.

పురాణం గారికి స్త్రీ పేర్లతో ఉన్న శీర్షికలు అచ్చి వచ్చినట్లున్నాయి. ఎంతోమందికి ఇల్లాలి ముచ్చట్లు గుర్తుకు వస్తే, మరి కొంతమందికి 'మధురవాణి ఇంటర్వ్యూలు' తప్పకుండా ఇంకా ఎక్కువగా స్ఫురిస్తాయి. వారపత్రిక సంపాదకుడిగా సాగినంత కాలం ఈ 'ఇల్లాలి ముచ్చట్లు' సాగితే– ఆయన జీవితం కొసన సుమారు ఐదేళ్ళ పైబడి 'మిసిమి' పత్రికలో సాగినది 'మధురవాణి ఇంటర్వ్యూ' శీర్షిక. గురజాడ అప్పారావు, కందుకూరి వీరేశలింగం, కట్టమంచి రామలింగారెడ్డి, త్రిపురనేని రామస్వామి చౌదరి, గుడిపాటి వెంకటచలం, విశ్వనాథ సత్యనారాయణ, అడవి బాపిరాజు, గుర్రం జాషువా, తాపీ ధర్మారావు, నార్ల వెంకటేశ్వరరావు, అబ్బూరి వరదరాజేశ్వరరావు, కొడవటిగంటి కుటుంబరావు, శ్రీరంగం శ్రీనివాసరావు, చాగంటి సోమయాజులు, ఆలపాటి రవీంద్రనాథ్, రాచకొండ విశ్వనాథ శాస్త్రి, ఆరుద్ర, ఉషశ్రీ, సి.నారాయణరెడ్డి – ఈ సాహితీవేత్తలతో మధురవాణి బోల్డ్‌గా, వారి లోటుపాట్లను కడిగేస్తూ, చమత్కారం తో తిప్పికొడుతూ ఇంటర్వ్యూ చేస్తే ఎలా ఉంటుందో అలా ఊహాజనితమైన రచనను ఆలపాటి రవీంద్రనాథ్ పురమాయిస్తే పురాణం సుబ్రహ్మణ్య శర్మ చేశారు. ఇందులో ఆయా సాహితీవేత్తల గురించి సాకల్యమైన అవగాహనున్న పురాణం, పండితుల మధ్య నలిగిన ప్రచార ఆధారిత సంగతులను కూడా ప్రస్తావించి జనాభిప్రాయాన్ని పరోక్షంగా ప్రతిఫలింప చేశారు. అలాంటి పురాణం సుబ్రహ్మణ్యశర్మను మధురవాణి ఇంటర్వ్యూ చేస్తే? అలాంటి దాన్ని బులుసు కామేశ్వరరావు 20 ఏళ్ల క్రితం ఆంధ్రభూమి దినపత్రికలో చేశారు. అది కూడా ఈ సంచికలో లభ్యమవుతోంది. ఇలాంటి బోలెడు మంచి సాహిత్య రచనలు ఉన్నాయి కనుక ఈ 'ప్రమిద' పురాణం సోదరుల సాహితీ వెలుగులను బాగా పంచింది. కనుకనే ఈ రెండు మాటలు.

– డా. నాగసూరి వేణుగోపాల్, 94407 32392

భారీ ఉగ్ర కుట్ర

- హైదరాబాద్ వ్యక్తి సహా ముగ్గురు అరెస్ట్

న్యూఢిల్లీ : దేశవ్యాప్తంగా ఉగ్రదాడులకు కుట్ర పన్నుతున్న ముగ్గురు ఉగ్రవాదులను అహ్మదాబాద్‌లో గుజరాత్ యాంటీ-టెర్రరిజం స్క్వాడ్ (ఎటిఎస్) అరెస్టు చేసింది. గత ఏడాది నుంచి నిందితులపై నిఘా పెట్టిన గుజరాత్ ఎటిఎస్, ఆయుధాలు సరఫరా చేస్తుండగా ముగ్గురిని అదుపులోకి తీసుకుంది. విచారణ సందర్భంగా దేశవ్యాప్తంగా ఉగ్రదాడులకు వీరు ప్రణాళిక చేస్తున్నట్లు గుర్తించింది. నిందితుల వద్ద నుంచి రెండు గ్లోక్ పిస్టల్స్, ఒక బెరెట్టా పిస్టల్, 30 బుల్లెట్లు, 4 లీటర్ల ఆముదం నూనెను స్వాధీనం చేసుకుంది. నిందితుల్లో ఒకడైన అహ్మద్ మొహియుద్దీన్ హైదరాబాద్‌కు చెందిన వ్యక్తి అని గుజరాత్ డిఐజి సునీల్‌జోషి తెలిపారు. మరో ఇద్దరు నిందితులు ఆజాద్ సులేమాన్ షేక్, మొహమ్మద్ సుహెల్ సలీంఖాన్ ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందినవారని పేర్కొన్నారు. అహ్మద్ మొహియుద్దీన్ ఇప్పటికే పలు ఉగ్రకార్యకలాపాల్లో పాల్గొన్నాడని తెలిపారు. అహ్మదాబాద్‌కు వస్తున్నట్లు సమాచారం అందడంతో అదాలజ్ టోల్ ప్లాజా సమీపంలో అతడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి వద్ద నుంచి పలు ఆయుధాలను స్వాధీనం చేసుకున్నామని అధికారులు తెలిపారు.

బాలికపై సామూహిక లైంగిక దాడి

భోపాల్ : మధ్యప్రదేశ్‌లోని మౌగంజ్ జిల్లాలో దారుణం చోటుచేసుకుంది. మంచి నీటి కోసం బోరు వద్దకు వెళ్లిన బాలికను బలవంతంగా ప్రభుత్వ పాఠశాల భవనం వద్దకు ఎత్తుకెళ్లిన ముగ్గురు సామూహిక లైంగికదాడి చేశారు. నిందితుల్లో ఓ మైనర్ బాలుడు కూడా ఉండటం గమనార్హం. గురువారం జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. లైంగిక దాడితో అపస్మారక స్థితిలోకి వెళ్లిన బాలికను పొలంలో వదిలి వెళ్లారు. కుటుంబ సభ్యులు హుటాహుటిన బాధితురాలిని ఆస్పత్రికి తరలించారు. అనంతరం లౌర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాలిక చెప్పిన వివరాల ప్రకారం నిందితులు ముగ్గురినీ అదుపులోకి తీసుకున్నారు. ఘటనా స్థలంలో మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు.

జి-20 సదస్సుకు అమెరికా డుమ్మా

వాషింగ్టన్ : దక్షిణాఫ్రికాలో జరిగే జి-20 సదస్సుకు తమ అధికారులెవ్వరూ హాజరు కాబోరని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ స్పష్టం చేశారు. శ్వేత జాతీయులైన రైతుల విషయంలో దక్షిణాఫ్రికా వ్యవహరిస్తున్న తీరుకు నిరసనగా ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. అభివృద్ధి చెందిన, వర్ధమాన ఆర్థిక వ్యవస్థల నేతలు ఈ నెల 22, 23 తేదీల్లో దక్షిణాఫ్రియాలోని జొహెన్నెస్‌బర్గ్‌లో సమావేశమవుతారు. దీనికి తాను హాజరు కావడం లేదని, ఉపాధ్యక్షుడు జెడి వాన్స్ హాజరు కావచ్చునని ట్రంప్ గతంలో చెప్పారు. ఈ సదస్సుకు వాన్స్ కూడా హాజరు కావడం లేదని ఆయనతో సన్నిహితంగా ఉండే వ్యకి ఒకరు అసోసియేటెడ్ ప్రెస్‌కు తెలిపారు.

పుతిన్ ప్రతిపాదనను పరిశీలిస్తున్న అమెరికా

- రష్యా విదేశాంగ మంత్రి

మాస్కో : అణ్వాయుధ నియంత్రణపై తమ దేశాధ్యక్షులు పుతిన్ చేసిన ప్రతిపాదనను అమెరికా పరిశీలిస్తోందని రష్యా వెల్లడించింది. దౌత్య మార్గాల ద్వారా ఈ విషయాన్ని అమెరికా వెల్లడించినట్లు రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లావ్‌రోవ్ ఆదివారం తెలిపారు. ఒక వార్తా సంస్థతో మంత్రి మాట్లాడుతూ పుతిన్ ప్రతిపాదనపై అమెరికా స్పందిస్తే ఒప్పందం గడువు ముగిసిన తరువాత కూడా మరో ఏడాదిపాటు దానికి కట్టుబడి ఉండటానికి రష్యా సిద్ధంగా ఉందని తెలిపారు. అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియోను కలవడానికి తాను సిద్ధంగా ఉన్నానని లావ్‌రోవ్ చెప్పారు. ఉక్రెయిన్‌లో శాంతి స్థాపనకు రష్యా ప్రయోజనాలను పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. న్యూ స్టార్ట్ ఒప్పందంగా పేర్కొనే అణ్వాయుధాల తగ్గింపు ఒప్పందానికి కొన్ని ప్రతిపాదనలు పుతిన్ ఇటీవల చేశారు. ఒప్పందం గడువు వచ్చే ఏడాది ఫిబ్రవరి వరకూ ఉంది.

ఓట్ చోరీ కప్పిపుచ్చేందుకే ఎస్ఐఆర్

- రాహుల్ గాంధీ

పచ్‌మఢీ : ఓట్ల చోరీని కప్పిపుచ్చేందుకే బిజెపి ఒత్తిడితో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను ఎన్నికల సంఘం చేపట్టిందని కాంగ్రెస్ ఎంపీ, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ విమర్శించారు. మధ్యప్రదేశ్‌లోని పచ్‌మఢీలో ఓ కార్యక్రమానికి హాజరైన రాహుల్ విలేకరులతో మాట్లాడారు. 'ప్రజాస్వామ్యంపై ఎస్ఐఆర్‌తో నేరుగా దాడి జరుగుతోంది. అంబేద్కర్ రాజ్యాంగాన్ని ధ్వంసం చేయడానికి ప్రయత్నిస్తున్నారు. ప్రధాని మోడీ, హోంమంత్రి అమిత్ షా, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్‌కుమార్ కలిసి ఈ చర్యను సమన్వయం చేస్తున్నారు. ఫలితంగా దేశం తీవ్రంగా నష్టపోతోంది.

అభివాదం చేస్తున్న రాహుల్ గాంధీ

భారతమాతకు నష్టం జరుగుతోంది' అని రాహుల్ వ్యాఖ్యానించారు.'హర్యానాలో సుమారు 25 లక్షల ఓట్లు దొంగలించారు. అంటే ప్రతి ఎనిమిది ఓట్లలో ఒకరిది నకిలీ ఓటు. మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో కూడా ఓట్లు చోరీ చేశారు. మా వద్ద ఇంకా చాలా సమాచారం ఉంది' అని పేర్కొన్నారు.

వచ్చేది ఇండియా బ్లాక్ ప్రభుత్వమే : అఖిలేష్‌యాదవ్

బీహార్ ప్రజలు మార్పు కోరుకుంటున్నారని, ఇండియా బ్లాక్ అధికారంలోకి వస్తుందని సమాజ్‌వాదీ అధినేత అఖిలేష్‌యాదవ్ చెప్పారు. రాయ్‌పూర్‌లోని వివేకానంద విమానాశ్రయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. బీహార్‌లో ఎన్నికల ప్రచారంలో తాను పాల్గొన్నానని, తేజస్వియాదవ్ నేతృత్వంలో ప్రభుత్వం ఏర్పడాలని యువత కోరుకుంటున్నారని చెప్పారు.

పిప్రా అసెంబ్లీ స్థానం నుంచి సిపిఎం అభ్యర్థిగా పోటీ చేస్తున్న రాజ్‌మంగళ్ ప్రసాద్ కుష్వాహా ఎన్నికల ర్యాలీ

పిప్రాలో జోరుగా సిపిఎం అభ్యర్థి ప్రచారం

పిప్రా అసెంబ్లీ స్థానం నుంచి సిపిఎం అభ్యర్థిగా పోటీ చేస్తున్న రాజ్‌మంగళ్ ప్రసాద్ కుష్వాహా శని, ఆదివారాలు విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. పిప్రా వీధుల్లో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో భారీ సంఖ్యలో సిపిఎం నాయకులు, కార్యకర్తలు, మద్దతుదారులు పాల్గొన్నారు. ఎర్రజెండాలతో సాగిన ఈ ర్యాలీకి ప్రజల నుంచి విశేష మద్దతు లభించింది. తరువాత తెత్రియా మైదానంలో భారీ బహిరంగ సభ నిర్వహించారు. సభలో పొలిట్‌బ్యూరో సభ్యులు అమ్రా రామ్, పార్టీ నాయకులు లలన్ చౌదరి, అవధేశ్‌కుమార్, అజయ్‌కుమార్ తదితరులు ప్రసంగించారు. రాష్ట్ర భవిష్యత్ కోసం సిపిఎం, ఇండియా బ్లాక్ అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు.

మార్పు కోసమే ప్రజలు ఓటు వేశారు : తేజస్వి యాదవ్

బీహార్ ఎన్నికల్లో ఇండియా బ్లాక్ విజయం సాధిస్తుందని సిఎం అభ్యర్థి తేజస్వి యాదవ్ విశ్వాసం వ్యక్తం చేశారు. ఇక్కడి ప్రజలు మార్పు కోసం ఓటేశారని, ఈ నెల 11న జరిగే రెండోదశ ఎన్నికల్లోనూ అదే చేస్తారని అన్నారు. చివరి రోజు ఎన్నికల ప్రచారం కార్యక్రమంలో తేజస్వీ యాదవ్ మాట్లాడుతూ తమ ప్రభుత్వం ఉన్న 17 నెలల సమయంలో ఇచ్చిన రిజర్వేషన్ గురించి ప్రధాని గానీ, మరెవరైనా మంత్రులు గానీ మాట్లాడటం లేదని అన్నారు. ప్రజలకు లభించాల్సిన 65 శాతం రిజర్వేషన్‌ను ప్రధాని ఇవ్వలేదని విమర్శించారు. ఆయన బీహార్‌కు, గుజరాత్‌కు ఏమి ఇచ్చారో చెప్పాలని డిమాండ్ చేశారు.

బీహార్ చొరబాటుదారుల కారిడార్ : అమిత్‌షా

పాట్నా: ప్రధాని మోడీ బీహార్‌లో పారిశ్రామిక కారిడార్ నిర్మించాలని అనుకుంటూ ఉంటే, మహాఘట్‌బంధన్ చొరబాటుదారుల కోసం కారిడార్ నిర్మించేందుకు ప్రయత్నిస్తోందని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా ఆరోపించారు. "ఇటీవల రాహుల్ గాంధీ, లాలూ కుమారుడు (తేజస్వి యాదవ్) బీహార్‌లో 'ఓటర్ అధికార్ యాత్ర' చేపట్టారు. దీని ప్రధాన లక్ష్యం చొరబాటుదారులను రక్షించడం. ప్రతిపక్షాలు ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తున్నాయి' అని అమిత్‌షా అన్నారు.

పాట్నాలో మీడియా సమావేశంలో మాట్లాడుతున్న లోకేష్

వికసిత్ భారత్ లక్ష్య సాధనలో బీహార్ పాత్ర కీలకం

- ఎన్నికల ప్రచారంలో మంత్రి లోకేష్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వికసిత్ భారత్ లక్ష్య సాధనలో బీహార్ పాత్ర చాలా కీలకమైందని టిడిపి ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేష్ తెలిపారు. బీహార్ ఎన్నికల్లో ఎన్‌డిఎ తరపున పాట్నాలో లోకేష్ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివారం అక్కడ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 2019లో రాష్ట్రంలో వైసిపికి అవకాశం ఇవ్వడం వల్ల శాంతిభద్రతలు క్షీణించి పరిశ్రమలు పొరుగు రాష్ట్రాలకు వెళ్లిపోయాయని విమర్శించారు. అటువంటి పరిస్థితులు బీహార్‌లో తెచ్చుకోవద్దని కోరారు. బీహార్ రూపురేఖలను ప్రధాన మంత్రి మోడీ మార్చేశారని, ఆ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను ట్రిలియన్ డాలర్లకు చేర్చడమే ఆయన లక్ష్యమన్నారు. డబుల్ ఇంజిన్ సర్కారు కారణంగానే ఎపి, బీహార్ ఎన్‌డిఎ భాగస్వామ్య ప్రభుత్వాలు ఉండటం వల్ల కేంద్ర బడ్జెట్‌లో భారీగా నిధులు లభిస్తున్నాయని అన్నారు. వివిధ పరిశ్రమలు రావడానికి కేంద్రం మద్దతు లభిస్తుందని చెప్పారు. ఈ సమావేశంలో బీహార్ ఎమ్మెల్సీ సంజయ్ మయూక్, ఎపి ఎంపిలు సానా సతీష్, గంటి హరీష్, మాజీ ఎంపి జివిఎల్ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌తో లోకేష్ భేటీ అయ్యారు.

వ్యవసాయరంగంతోనే ఆహార ఉత్పత్తి, భద్రత

అంతర్జాతీయ సదస్సుకు హాజరైన మేధావులు, శాస్త్రవేత్తలు, నిపుణులు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

వ్యవసాయ రంగాన్ని వ్యాపారం, లాభాల దృక్పథంతో కాకుండా ప్రజలకు ఆహార ఉత్పత్తి, ఆహార భద్రతగా చూడాలని వ్యవసాయ రంగ నిపుణులు సూచించారు. కేరళలోని తిరువనంతపురంలో మూడు రోజుల పాటు జరిగిన అంతర్జాతీయ వ్యవసాయ సదస్సు ఆదివారం ముగిసింది. చివరి ప్లీనరీ సభకు ఫౌండేషన్ ఫర్ అగ్రేరియన్ స్టడీస్ (ఫాస్) కన్వీనర్, కేరళ ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు ప్రొఫెసర్ వికె రామచంద్రన్ అధ్యక్షత వహించారు. నాలుగు రోజులు జరిగిన ఈ అంతర్జాతీయ సదస్సులో పలువురు మేధావులు, శాస్త్రవేత్తలు, నిపుణులు, దేశ విదేశాల ప్రముఖులు సమర్పించిన పత్రాలను సమీక్షించారు. మానవ మనుగడకు, అభివృద్ధికి ప్రజలకు అందుతున్న ఆహారం, వ్యవసాయ రంగం పరిస్థితితో పాటు విద్య, వైద్యం, సగటు జీవన ప్రమాణాలు ప్రాతిపదికలుగా ఉంటాయన్నారు. సంస్కరణలు వీటిని ధ్వంసం చేశాయని, సగటు జీవన ప్రమాణాలను, గ్రామీణ జీవన విధానాన్ని దిగజార్చాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ వ్యయం, సహకారం రైతుకు కాకుండా కార్పొరేట్ కంపెనీలకు చేరడం అత్యంత ప్రమాదకరమన్నారు. చైనా, వియత్నాం వంటి దేశాలు వ్యవసాయ రంగంలో సాధిస్తున్న ఫలితాలు అద్భుతంగా ఉన్నాయన్నారు. వ్యవసాయ రంగంలో ప్రభుత్వ వ్యయం పెంపు, స్థానిక సంస్థలకు అధికారాలు కీలకంగా ఉంటాయన్నారు. వ్యవసాయ రంగ అభివృద్ధికి దేశాలు తీసుకోవాల్సిన పలు చర్యలను సూచించారు. ఇలాంటి అంతర్జాతీయ సదస్సుల నిర్వహణ వ్యవసాయ రంగ అభివృద్ధికి మార్గదర్శకంగా పనిచేస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆ దిశగా ఫాస్ చేస్తున్న విస్తృత అధ్యయనాలు, కృషిని అభినందిస్తూ అందరూ ప్రోత్సహించాలన్నారు. అఖిల భారత కిసాన్ సభ అధ్యక్షులు అశోక్ ధావలే మాట్లాడుతూ.. వ్యవసాయ రంగం, రైతుల స్థితిగతుల అధ్యయనానికి ఈ అంతర్జాతీయ సదస్సు ఎంతగానో తోడ్పడిందన్నారు. అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బి వెంకట్ మాట్లాడుతూ.. దేశంలోని వ్యవసాయ కార్మికుల స్థితిగతులపై విస్తృతంగా సర్వేలు నిర్వహించేలా ఫాస్ మరింత కృషి చేయాలన్నారు. అమెరికా, కెనడా, బ్రిటన్ దేశాల ప్రతినిధులు చివరి రోజు తమ పత్రాలు సమర్పించారు. దేశంలోని 15 రాష్ట్రాలు, 25 విదేశాల నుండి ప్రతినిధులు పాల్గొన్న ఈ అంతర్జాతీయ సదస్సు అత్యంత ప్రాముఖ్యత సంతరించుకుంది. శనివారం రాత్రి ప్రదర్శించిన కథాకళి సాంస్కృతిక ప్రదర్శన విశేషంగా ప్రతినిధులను ఆకట్టుకుంది. ఈ సదస్సులో రాష్ట్రం నుంచి బి బలరాం, తెలంగాణ నుంచి అరిబండి ప్రసాదరావు, టి సాగర్, వెంకట్రాములు చర్చల్లో పాల్గొన్నారు.

వ్యవసాయ రంగ నిపుణులు

ఎల్ఐసి ఏజెంట్లను నష్ట పరచడమే కేంద్ర ప్రభుత్వం ఎజెండా

- ఏజెంట్లు ఐక్యత చాటాలి
- ఎల్ఐసిఎఒఐ ప్రధాన కార్యదర్శి దిలీప్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎల్ఐసి ఏజెంట్లను నష్టపరచడమే కేంద్ర ప్రభుత్వ ఎజెండాగా మారిందని ఎల్ఐసి ఏజెంట్స్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా (ఎల్ఐసి ఎఒఐ) ఆల్ ఇండియా ప్రధాన కార్యదర్శి పిజి దిలీప్ విమర్శించారు. తెలంగాణ రాష్ట్రం ఖమ్మం జిల్లాలో ఎల్ఐసి ఎఒఐ సౌత్ సెంట్రల్ జోనల్ 6వ మహాసభ రెండవరోజు ఆదివారం జరిగింది. మహాసభ ప్రతినిధులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ.. భారత దేశ ఆర్థిక వ్యవస్థకు, ప్రజల పొదుపు విధానానికి ఎల్ఐసి ఎనలేని కృషి చేస్తోందని అన్నారు. అటువంటి ఎల్ఐసిని కేవలం కొందరు కార్పొరేట్ సంస్థల యజమానుల కోసం ప్రైవేటు పరం చేయడానికి కేంద్రప్రభుత్వం ప్రయత్నిస్తోందని విమర్శించారు. ఐఆర్‌డిఎఐని అడ్డుపెట్టుకొని ఏజెంట్లకు నష్టం కలిగించే పనులు చేస్తోందన్నారు. ఏజెంట్ల కమీషన్ తగ్గించడం, క్లా-బ్యాక్ కమీషన్ విధానం తీసుకుని రావడం, బీమా సుగం పోర్టల్ ప్రతిపాదన, పాలసీ పోర్టబిలిటి, కమీషన్ విధానం మ్యూచువల్ ఫండ్ కంపెనీల మాదిరిగా ఉండాలనే ప్రతిపాదన మొదలైనవన్నీ ఇందులో భాగమేనన్నారు. ఇది ఏజెంట్లకు పరీక్షా సమయమని, ఇటువంటి సమయంలోనే ఏజెంట్ల ఐక్యత చాటాలని కోరారు. ఇందులో భాగంగా ప్రస్తుతం ఉన్న యూనియన్ సభ్యత్వాన్ని మూడు రెట్లు పెంచుకోవాలని పిలుపునిచ్చారు. ఎల్ఐసి ప్రైవేటీకరణ వల్ల కలిగే నష్టాలను పాలసీదారులకు సైతం వివరించి చైతన్య పరచాలన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ఆల్ ఇండియా అధ్యక్షులు సురజిత్ కుమార్ బోస్, జోనల్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్ మంజునాథ్, పిఎల్ నరసింహారావు, తెలంగాణ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు తాళ్లూరి శ్రీనివాసరావు, తన్నీరు కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బి జయరామ

పిఎల్ నరసింహారావు

వలి మొహిద్దీన్

అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా బి జయరామ, పిఎల్ నరసింహారావు - 141 మందితో నూతన ఎన్నిక

మహాసభ 141 మందితో నూతన కౌన్సిల్, 69 మందితో కమిటీని, 27 మందితో ఆఫీస్ బేరర్లను ఏకగ్రీవంగా ఎన్నుకుంది. అధ్యక్షులుగా బి జయరామ, ప్రధాన కార్యదర్శిగా పిఎల్ నరసింహారావు, ట్రెజరర్‌గా వలి మొహిద్దీన్, ఉపాధ్యకులుగా టి కోటేశ్వరరావు, డిసి శివమూర్తి, తాళ్లూరి శ్రీనివాసరావు, టి నాగరత్నమ్మ, జి శ్రీనివాస్, కె రామనర్సయ్య, ఎం నాగరాజు, ఆర్ శివ రుద్రమ్మ, ఎస్ లింగ వాడియా, ఎఎస్ లోకేష్ షెట్టర్, కార్యదర్శులుగా కె కృష్ణా రెడ్డి, జి రవి కిషోర్, సి ప్రదీప్, తన్నీరు కుమార్, ఎన్ఆర్ ఠాగూర్, జిజి సవిత, ఎం అరుణ, కె ఉదయలక్ష్మి, బి వెంకట్రావు ఎన్నికయ్యారు.

ఆర్థిక అసమానతలు తీవ్రతరం

(మొదటిపేజీ తరువాయి)

పొందడం లేదని ఈ నివేదిక తెలిపింది. చౌకగా శ్రామికుల శ్రమను దోచుకోవడం, కార్మిక చట్టాలను సవరించడం, పనిగంటలు పెంచడం, గతంలో వున్న చట్టబద్ధ హక్కులను, రిటైర్మెంట్ సదుపాయాలను రద్దు చేయడంలాంటి విధానాలు అనేక దేశాల్లో అమలవుతున్నాయి. జాతీయ ఆదాయంలో పెట్టుబడి, శ్రామిక వాటా నిష్పత్తిలో తీవ్రమైన వ్యత్యాసం వచ్చిందని, 1980లో 75 శాతం వున్న శ్రామిక వాటా 2024 నాటికి 29 శాతానికి పడిపోయిందని తేల్చారు. దీంతో అత్యధిక ప్రజల ఆదాయం తగ్గిపోయి వారు కొనుగోలు శక్తిని తగ్గించింది.

ఈ స్థితికి కారణమైన గుత్తాధిపత్య కార్పొరేట్ కంపెనీలు మాత్రం తయారీ రంగం నుండి తప్పుకుని సేవారంగం, రియల్ ఎస్టేట్, హెూటల్, రిటైల్ లాంటి రంగాల్లోకి బదిలీ అయ్యారు. కరోనా తర్వాత ఈ ధోరణి మరింత తీవ్రమైంది. 134 దేశాల్లోని 70,000 కంపెనీలు 1980 నాటికి మొత్తం అమ్మకాల్లో 15 శాతం వాటాను కలిగివుంటే, 2016 నాటికి 60శాతానికి పైగా ఆక్రమించేశాయి. ఈ పరిణామం ఆయా దేశాల్లోని చిన్న, మధ్యతరహా వ్యాపారుల ఉపాధిని దెబ్బతీసాయి.ఈ కంపెనీలు జాతీయ ప్రభుత్వాల మీద వివిధ రూపాల్లో ఒత్తిళ్లు తెచ్చి అనేక రాయితీలు పొందుతున్నాయి. సుంకాల చట్టాలను సరళీకరించడం, ప్రభుత్వసంస్థలను కారుచౌకగా కొనుగోలు చేయడం, సహజ వనరులను కొల్లగొట్టడం ఈ కాలంలో పెరిగింది. కొత్త సాంకేతికతలను ఉపయోగించుకుని నైపుణ్యం కలిగిన కార్మికుల బేరసారాల శక్తిని తగ్గించివేసి వారి వేతనాలను తగ్గించడం లేదా పెంచకపోవడం జరుగుతుంది. పెరుగుతున్న ఆర్థిక అసమానతలు ప్రజాస్వామ్యానికి తీవ్ర ముప్పుగా మారుతున్నాయని ఈ నివేదిక హెచ్చరించింది. ఎన్నికల్లో, ప్రభుత్వ ఏర్పాట్లలో సంపన్నుల బలం పెరుగుతుంది. ప్రజలకు అందాల్సిన సేవలను, సంక్షేమ పథకాలను కోతకోస్తూ, ధనవంతులు, కార్పొరేట్ కంపెనీలు అనేక రాయితీలను పొందుతున్నారని తెలిపింది. ఈ పరిస్థితుల నుండి బయటపడేందుకు సంపన్నులపై సంపద పన్ను వేయడం, ప్రభుత్వ రంగాన్ని బలోపేతం చేసుకోవడం, ఉద్యోగ అవకాశాలను పెంచే చిన్న, మధ్యతరహా పరిశ్రమలను ప్రోత్సహించడం, విద్య, వైద్యం, సామాజిక సేవలను ప్రభుత్వాలు నిర్వహించాలని ఈ నివేదిక సూచించింది.

మాన్యుఫ్యాక్చరింగ్ హబ్‌గా రాష్ట్రం

- రాష్ట్ర మంత్రి కొండపల్లి

ప్రజాశక్తి- మాధవధార (విశాఖపట్నం)

ఈ నెల 14, 15 తేదీల్లో విశాఖలో జరిగే ప్రపంచ స్థాయి పెట్టుబడుల సదస్సు ఎంఎస్ఎంఇల అభివృద్ధికి దోహదపడనుందని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. ఇప్పటికే సుమారు రూ.439 కోట్ల ప్రోత్సాహకాలను ఎంఎస్ఎంఇలకు ఇచ్చామని, రానున్న కాలంలో దేశంలో మన రాష్ట్రం మాన్యుఫ్యాక్చరింగ్ హబ్‌గా మారనుందని వివరించారు. విశాఖలోని ఓ ప్రైవేటు హోటల్‌లో ఎపి గ్లోబల్ ఎంఎస్ఎంఇ సదస్సు ఆదివారం ప్రారంభమైంది. ఎగుమతుల్లో అభివృద్ధి పేరిట దీన్ని రెండు రోజులపాటు నిర్వహించనున్నారు. 16 దేశాల నుంచి 44 మంది ప్రతినిధులు హాజరయ్యారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన మంత్రి శ్రీనివాస్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇది నాలుగోదని, ఇండియా ఎస్ఎంఇ ఫోరం సహకారంతో దీనిని నిర్వహిస్తున్నామని తెలిపారు. ఎంఎస్ఎంఇ సంస్థల ఉత్పత్తుల ఎగుమతికి ఇది దోహదపడనుందని అన్నారు. విశాఖలో జరిగే పెట్టుబడుల సదస్సులో సుమారు రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు వస్తాయని అంచనా వేస్తున్నామని తెలిపారు. విశాఖ ఐటి హబ్‌గా రూపు దిద్దుకుంటోందన్నారు. రాష్ట్రంలో పలుచోట్ల ఇండస్ట్రియల్ పార్కులను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో ఒక్క ఎంఎస్ఎంఇ ఎగుమతిదారుల సమావేశం కూడా జరగలేదన్నారు. అవగాహన లేక వైసిపి నాయకులు లేనిపోని వ్యాఖ్యలు చేస్తున్నారని విమర్శించారు. పరిశ్రమలను బలోపేతం చేసి యువతకు ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నామన్నారు. విశిష్ట అతిథి ఎమ్మెల్యే విష్ణు కుమార్ రాజు మాట్లాడుతూ గూగుల్ విశాఖకు రావడం వెనుక మోడీ, చంద్రబాబు కృషి ఎంతో ఉందని తెలిపారు. ఎంఎస్ఎంఇ రాష్ట్ర చైర్మన్ తమ్మారెడ్డి శివశంకర్ మాట్లాడుతూ దేశీయ సంస్థల ఉత్పతుల ఎగుమతికి అవసరమైన ప్రక్రియను రాష్ట్ర ప్రభుత్వం చేస్తోందన్నారు. సదస్సుకు హాజరైన విదేశీ ప్రతినిధులను మంత్రి శ్రీనివాస్ కండువాలు కప్పి సత్కరించారు. ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, ఎంఎస్ఎంఇల సిఇఒ వినోద్ కుమార్ పాల్గొన్నారు.

రేపు బీహార్‌లో రెండోవిడత పోలింగ్

(మొదటిపేజీ తరువాయి)

బంధన్ మధ్య గట్టిపోటీ నెలకొంది. అధికార, ప్రతిపక్ష కూటములు ఈ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుని హోరాహోరీగా ప్రచారం నిర్వహించాయి. ఎన్‌డిఎ తరపున ప్రధాని మోడీ, కేంద్రమంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్‌సింగ్, పలువురు బిజెపి పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు బహిరంగసభల్లో పాల్గొన్నారు. మహాఘట్‌బంధన్ నుంచి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ, ఆ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే, ప్రియాంకా గాంధీ, ఆర్‌జెడి అగ్రనేత, మహాఘట్‌బంధన్ సిఎం అభ్యర్థి తేజస్వీయాదవ్ సుడిగాలి ప్రచారం నిర్వహించారు. సిపిఎం అభ్యర్థులు కూడా విస్తృతంగా ప్రచారం చేశారు. వారి తరపున ఆ పార్టీ నేతలు బృందాకరత్, సలీం తదితరులు ప్రచారంలో భాగస్వాములయ్యారు. అభ్యర్థుల వెంట పార్టీ శ్రేణులు బైక్ ర్యాలీలతో.. సిపిఎం గెలిస్తే... ప్రజాసమస్యలు పరిష్కారమయ్యేలా కృషిచేస్తామని ఓటర్లను అభ్యర్థించారు. ఈనెల 14న బీహార్ ఎన్నికల ఫలితాలు వెలువడనున్నాయి.

Home First Finance Company India Limited
CIN: L65990MH2010PLC240703
Website: homefirstindia.com Phone No.: 180030008425
Email ID: loanfirst@homefirstindia.com

homefirst
We'll take you home

స్వాధీనతా నోటీసు

రెఫ్ : సెక్యూరిటీ ఇంట్రస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 8 యొక్క సబ్ రూల్ (1) కింద స్వాధీనతా నోటీసు.

ఏదైతే, **హోమ్ ఫస్ట్ ఫైనాన్స్ కంపెనీ ఇండియా లిమిటెడ్** యొక్క ఆధీకృత అధికారి అయిన దిగువసంతకందారుడు, క్రింద ఇవ్వబడిన దాని సంబంధిత తేదీలలో డిమాండ్ నోటీసుకు అనుగుణంగా, సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రస్ట్ యాక్ట్ 2002 (2002 యాక్ట్ నం.54) కింద మరియు సెక్యూరిటీ ఇంట్రస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 3తో చదువుతూ సెక్షన్ 13(2) క్రింద అతని అందించబడిన అధికారాలను ఉపయోగిస్తూ సంబంధిత నోటీసుల స్వీకరణ తేది నుండి 60 రోజులలోపట మిగిలిన బకాయిలు చెల్లించమని పేరు క్రింద మిమ్మల్ని/రుణగ్రహీతలను కోరడమైనది. మీరు/రుణగ్రహీతలు, ఏది ఏమైనా నిర్ణీత సమయంలోపట మిగిలిన బకాయిలు చెల్లించుటలో విఫలం చెందినారు, కావునా **హోమ్ ఫస్ట్ ఫైనాన్స్ కంపెనీ ఇండియా లిమిటెడ్** వారు అధ్యాయనం చేసి మరియు ఆక్కడ క్రింద రూల్స్‌తో చదువుతూ SARFAESI చట్టం, 2002 యొక్క సెక్షన్ 13 యొక్క సబ్-సెక్షన్ (4) నిబంధనల క్రింద నిర్ణయించే హక్కులు కలిగి ఉండి, ఇక్కడ దిగువ పేర్కొన్న సెక్యూర్డ్ అస్సెట్స్ **స్వాధీనం** చేసుకోవడమైనది:

క్ర సం.	రుణగ్రహీతలు/సహ రుణగ్రహీతలు/ హామీదారుల పేరు	తనఖా ఆస్తి వివరణ	సెక్షన్ 13(2) క్రింద డిమాండ్ నోటీసు తేది	డిమాండ్ నోటీసు తేది నాటికి మొత్తం బకాయిలు (రూ.లో)	స్వాధీనతా తేది
1.	మేక బ్రహ్మయ్య, గొల్లపుడి ప్రసన్న కుమారి	ఇంటి డోర్ నం: 5-147/ఎ, (పన్ను ప్రకారం డోర్ నం.7-82, మూల్యాంకనం నం.545), డోర్.నం: 345/సి. అంకి రెడ్డి పాలెం గ్రామ, లాలుపురం గ్రామ పంచాయతీ ప్రాంతము, గుంటూరు రూరల్ మండలం, నల్లపాడు సబ్ జిల్లా, గుంటూరు జిల్లా, గుంటూరు, ఆంధ్రప్రదేశ్-522017. **సరిహద్దులు** : ఉత్తరం : ఏడు కోటేశ్వర రావు ఆస్తి, పడమర : గొల్లపుడి తిరుపతయ్య ఆస్తి, ఉత్తరం: సర్కార్ రోడ్డు, దక్షిణం-ఏడు భూష్నం ఆస్తి	03-Sep-25	10,07,420	06-Nov-25
2.	విశదల బాబు, విశదల ఝాన్సీ రాణి	ఇంటి డోర్.నం.129/ఎ, మూల్యాంకనం నం.726, డోర్.నం .4-126, పొనుగుపాడు గ్రామ పంచాయతీ, ఫిరంగిపురం ఎస్ఆర్ఒ, గుంటూరు జిల్లా, గుంటూరు జిల్లా, గుంటూరు, ఆంధ్రప్రదేశ్-522549. సరిహద్దు: తూర్పు-బజార్, పడమర-గెరా ఇన్నయ్య ఆస్తి, ఉత్తరం-కల్లు వెంకటేశ్వర్లు ఆస్తి, దక్షిణం-పారెసుద్ద రావు ఆస్తి.	03-Sep-25	11,36,133	06-Nov-25
3.	కొనతం సాగర్ బాబు, కొనతం కృష్ణవేణి	ఇంటి డోర్.నం.722, డోర్.నం.6-20, మూల్యాంకనం 1020, (డోర్.నం. 6-61) యెనమదల గ్రామం జిపి, ప్రతిపాడు మండలం, ఎస్ఆర్ఒ ప్రతిపాడు, గుంటూరు జిల్లా, గుంటూరు, ఆంధ్రప్రదేశ్-522019. **సరిహద్దు:** తూర్పు - జొన్నలగడ్డ యేసు ఆస్తి-25', పడమర-పంచాయతీ బజార్ 23', ఉత్తరం - పచ్చల రత్తమ్మ ఆస్తి-34', దక్షిణం-జొన్నలగడ్డ సుధీర్ బాబు ఆస్తి-37'.	03-Sep-25	14,71,825	06-Nov-25
4.	కొండూరి పద్మజా, కొండూరి భార్గకేశవ	ఫ్లాట్ - ఆర్ఎస్ నం 27/4ఎ, వార్డు నం 1, డోర్ నం 1/54 దగ్గర, మాచవరం శివారు, ఉల్లిపాలెం, మచిలీపట్నం మండలం, కృష్ణ, ఆంధ్రప్రదేశ్-521002. **సరిహద్దు:** ఉత్తరం-ఏలేటి మహేష్ బాబు ఆస్తి, దక్షిణం-రోడ్డు, తూర్పు-ఉల్లి అన్నపూర్ణా దేవి ఆస్తి, పడమర-సజిదున్నిసా ఆస్తి.	03-Sep-25	26,61,475	06-Nov-25
5.	వడపల్లి త్రాకేష్, వడపల్లి రమణ, వడపల్లి కాసులమ్మ	ఫ్లాట్ - ప్లాట్ నం 98, రెసెడెన్షియల్ ఓపెన్ ప్లాట్ ఆర్ఎస్ నం: 17/4, 17/1బి, 11/2సి, 11/2బి, 11/2ఎ, 17/1సి, 11/2, 11/1, 10/1, 17/3, 18/2, 13/1, 13/2, ఎల్.పి.నం: 42/82, మూల్యాంకనం నం: 1073255569, 1073255571, ప్లాట్ నం: 98 ఉత్తరం భాగం, విద్యాసాగర్ ఉద్యోగిని నగర్ "ఎ" కాలని, పాయకాపురం, విజయవాడ,విజయవాడ, ఆంధ్రప్రదేశ్-520015. **సరిహద్దు:** ఉత్తరం-ప్లాట్ నం:99 ఆస్తి, దక్షిణం-పల్లవి రవి మరియు అడివి నాగేశ్వర ప్రసాద్ ఆస్తి ప్లాట్ నం:98 భాగంలో, తూర్పు-ప్లాట్ నం: 113 ఆస్తి, పడమర-50' వెడల్పు రోడ్డు.	03-Sep-25	17,35,872	06-Nov-25
6.	మేడ ఆంజనేయులు మేడ పార్వతి	ఇంటి డోర్.నం. 390-1, డోర్ నం: 5-223, మూల్యాంకనం నం: 640/2, డోర్ నం:390-1, పాటుబండ్ల గ్రామం, పైబండ్ల గ్రామ పంచాయతీ ప్రాంతము, పెదకూరపాడు మండలం, పెదకూరపాడు సబ్ జిల్లా ఎల్లక, గుంటూరు-522402. **సరిహద్దు:** తూర్పు-పంచాయతీ రోడ్డు, దక్షిణం-మేడ కృష్ణ ఆస్తి, పడమర-నల్లగొండ్ల నాగేశ్వర రావు ఆస్తి, ఉత్తరం-పాలపర్తి నారాయణ ఆస్తి.	03-Jan-25	7,81,807	04-Nov-25

రుణగ్రహీత మొత్తం తిరిగి చెల్లించుటలో విఫలమైనందున, ముఖ్యంగా రుణగ్రహీత/హామీదారుడు మరియు సాధారణ ప్రజలకు నోటీసు ఇవ్వడమేమనగా, సెక్యూరిటీ ఇంట్రస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 8తో చదువుతూ సదరు చట్టం యొక్క సెక్షన్ 13 యొక్క సబ్-సెక్షన్ (4) క్రింద అతను అధికారాలు అధ్యాయనం చేస్తూ ఇక్కడ వివరించిన ఆస్తిని దిగువ సంతకందారు స్వాధీనపరుచుకొన్నాడు.

ప్రత్యేకంగా **రుణగ్రహీతలు/హామీదారులు మరియు సాధారణ ప్రజలను** హెచ్చరిండమేమనగా పైన సూచించిన ఆస్తులు/సెక్యూర్డ్ అస్సెట్స్ ఎలాంటి లావాదేవీలు జరుపరాదు మరియు ఏవైనా లావాదేవీలు జరుపదలచిన వారు పూర్తి మొత్తం చెల్లింపు వరకు తదుపరి వడ్డీతో ఆస్తులు/సెక్యూర్డ్ అస్సెట్స్ ఎదురుగా పైన పేర్కొన్న మొత్తం **హోమ్ ఫస్ట్ ఫైనాన్స్ కంపెనీ** ఇండియా లిమిటెడ్ చార్జ్‌కు లోబడి ఉండవలెను.

సెక్యూర్డ్ అస్సెట్స్ విడిపించుకొనుటకు మీకు లభించిన సమయం మేరకు చట్టం యొక్క సెక్షన్ 13 యొక్క సబ్ సెక్షన్ (8) నిబంధనలు అహ్వానించడమైనదని రుణగ్రహీతలు శ్రద్ధ వహించవలెను.

తేది : 10.11.2025
ప్రదేశం : విజయవాడ

సం/- ఆధీకృత అధికారి,
హోమ్ ఫస్ట్ ఫైనాన్స్ కంపెనీ ఇండియా లిమిటెడ్

మీ కోసం

గారెలు వండేటప్పుడు నూనె పేలకుండా ఉండాలంటే కాగిన నూనెలో ఒక చెంచా నెయ్యి వేయాలి.

జీవన సౌరభం

ఓటమి నేర్పిన పాఠాలు గుర్తుపెట్టుకుని గెలవడం నేర్చుకోవాలి.

పిచ్చుక విన్నపం

ఒక ఊరు పొలిమేరలో పెద్ద రావి చెట్టు ఉంది. దాని కొమ్మల మీద అనేక రకాల పక్షులు పుల్లలతో గూళ్ళు కట్టుకుని నివాసం ఉంటున్నాయి. పక్షులకు రాజు గద్ద. ఒక రోజు ఆడ పిచ్చుక గద్ద వద్దకు వెళ్లి 'రాజా! మేము పుల్లలతో గూడు పెట్టుకుంటుండగా ఏ పక్షో వచ్చి పుల్లలను ఎత్తుకు పోతోంది' అని చెప్పింది. 'ఏ పక్షో తెలియకుండా ఎలా నింద వేస్తావు? మీ జంటలో ఎవరో ఒకరు కాపాల ఉండి ఆ పక్షిని కనిపెట్టండి' అని చెప్పింది గద్ద. 'అలాగే రాజా!' అని పిచ్చుక వెళ్లిపోయింది.

ఆడ పిచ్చుక మగ పిచ్చుకకి విషయం చెప్పింది. మగ పిచ్చుక తాము గూడు పెట్టుకుంటున్న కొమ్మకు అటు పక్కన కొమ్మ పైన కూర్చుని గమనించ సాగింది. ఒక మగ పావురం ముక్కుతో తమ గూడు నుండి ఒక పుల్లను తీసుకుని ఎగిరిపోతుండగా 'మా గూడులోని పుల్లలను ఎత్తుకుపోవడం నీ పనేనా.. పద రాజు వద్దకు' అని అడ్డుపడి గద్ద వద్దకు తీసుకెళ్లింది.

'పిచ్చుక చెప్పింది నిజమేనా?' అని అడిగింది గద్ద. 'అవును రాజా!' అని తప్పును ఒప్పుకుంది పావురం. 'అవి చిన్న పక్షులు.. నువ్వేమో పెద్ద పక్షివి ఇలాంటి తప్పు చేయవచ్చా?' అని గద్ద గద్దించి అడిగింది. 'తప్పయ్యింది రాజా! ఇక మీదట అలా చేయను' అని అంది పావురం. ఈసారి పిచ్చుకలు ఏ ఆటంకం లేకుండా అందమైన గూడు కట్టుకుని అందులో నివసించాయి.

- యు.విజయశేఖర రెడ్డి,
హైదరాబాద్.

నా బాల్యం గాలిపటం

నాకో గాలిపటం దొరికింది
నా బాల్యం దానికి
తోకై తగులుకుంది
అది గెంతులేస్తుంది
బుంగమూతి పెడుతుంది
కళ్ళు ఎగరవేస్తుంది
కాలరు ఎగరవేస్తుంది
గద్దతలని తన్నుతున్నది
మేఘాన్ని ముద్దాడుతుంది
అమ్మ పైటపై వాలుతుంది
నా భుజాలపై
సీతాకోకచిలుకవుతుంది
తోకలేని కోతిలా..
కొమ్మలపై గెంతుతుంది
ఆశ్చర్యం అది చిన్న సైకిల్
తొక్కుతుంది
ఎక్కాలు వల్ల వేస్తుంది
చెడ్డీలో పావలా బిళ్లలా..
మిడ్డీల్లో కమ్మర్ కట్టులా..
అట్ట జడలా
అక్క తల పాపిట బిళ్ళలా
వల్లంకి పిట్టలా

నా గాలిపటం ఎగురుతుంది
ఇంకా నా మనోవల్మీకంలో!!

- అయిన కోట రవికుమార్,
నెల్లూరు, 97048 00096.

నేను గీసిన బొమ్మ

ఎం.సంజు మిధున్,
3వ తరగతి,
క్రాంతి హైస్కూల్, కొండపల్లి, ఎన్‌టిఆర్ జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

ఐర్లాండ్ అధ్యక్ష పీఠంపై సోషలిస్టు

ఆమె ఒక పేద కుటుంబంలో 14 మంది సంతానంలో ఒకరిగా పుట్టింది. తల్లి చిన్నప్పుడే చనిపోగా; తండ్రి, తోబుట్టువుల సంరక్షణలో పెరిగింది. కష్టాలు, సర్దుబాట్లు ఆమెకు బాల్యం నుంచే పరిచయం. వాటన్నింటినీ చూస్తూ పెరిగారు. ఈ నేపథ్యంలోనే సమస్యలపై గొంతెత్తటం మొదటి నుంచీ అలవాటైంది. సోషలిస్టు విధానాలే ప్రజల సమస్యలను పరిష్కరిస్తాయని ఆమె నమ్ముతారు. ఆ స్ఫూర్తితోనే పోరాడి, రాజకీయాల్లో రాణించి, ఇప్పుడు వామపక్షాల మద్దతుతో ఐర్లాండ్ అధ్యక్షురాలిగా ఎన్నికయ్యారు. ఆమె పేరు కేథరీన్ కొన్నోల్లి.

ఈ ఏడాది అక్టోబర్ 24న జరిగిన ఐర్లాండు అధ్యక్ష ఎన్నికల్లో కేథరీన్ 63 శాతం ఓట్లతో అఖండ విజయం సాధించారు. నవంబర్ 11న అధ్యక్ష బాధ్యతలు స్వీకరించనున్నారు. కేథరీన్ అసలు పేరు.. కేథరీన్ మార్టినా ఆన్ కొన్నోలి. 1957 జూలై 12న గాల్వే నగరంలోని శాంటల్లాలో పుట్టారు. వారి తల్లిదండ్రులకు 14 మంది (ఏడుగురు మగపిల్లలు, ఏడుగురు ఆడపిల్లలు)లో ఈమె తొమ్మిదవ సంతానం. కొన్నోలికి తొమ్మిదేళ్ల వయసులోనే తల్లి ఆస్తమాతో బాధపడుతూ చనిపోయారు. ఈమె తండ్రి హోమ్‌బిల్డర్. చేపల్ని పట్టే బోట్లను తయారుచేసి అమ్మేవారు. తమ తోబుట్టువులందరినీ పెంచడానికి తన తండ్రి ఎంతో కష్టపడ్డారని.. ప్రతిరోజూ పనికెళ్లేవారని, తమ అక్కలే తల్లులయ్యి.. తమ ఆలనాపాలనా చూసేవారని కేథరీన్ ఓ ఇంటర్వ్యూలో చెప్పారు.

కేథరీన్‌కు ఎన్ని అడ్డంకులున్నా.. కష్టపడి చదువుకున్నారు. 1970లో గాల్వే విశ్వవిద్యాలయం నుండి సైకాలజీ బ్యాచిలర్ డిగ్రీ చేశారు. ఆ తర్వాత 1981లో యూనివర్సిటీ ఆఫ్ లీడ్స్ నుండి క్లినికల్ సైకాలజీలో మాస్టర్స్ డిగ్రీని పొందారు. కొన్నేళ్లు క్లినికల్ సైకాలజిస్ట్‌గా ప్రాక్టీస్ చేశారు. 1989లో గాల్వే విశ్వవిద్యాలయం నుండి న్యాయ విద్యనభ్యసించారు. ఆ తర్వాత కింగ్స్ ఇన్స్ (ఐర్లాండ్ బార్‌కు ఇన్ ఆఫ్ కోర్ట్)లో చదువుకొని 1991లో న్యాయవాది అయ్యారు. రాజకీయాల్లోకి ప్రవేశించే వరకు ఆమె ఫ్యామిలీ, పర్సనల్ లా కింద ప్రాక్టీస్ చేశారు. ఈమె తాను ప్రేమించిన బ్రియాన్ మెక్ ఎనరీని 1992లో వివాహమాడారు. ఈయన కూడా తన తండ్రిలాగా వడ్రంగి పనే చేసేవారు. ఈ జంటకు ఇద్దరు కుమారులు. ఈమె జర్మనీ భాష కూడా మాట్లాడతారు. తాను ఏ మతానికి చెందిన వ్యక్తిని కానని.. తనకే మతం లేదని చెబుతారు.

ఈమెకు చిన్నతనం నుంచే సేవాగుణం ఎక్కువ. టీనేజ్ వయసు నుంచే వృద్ధులకు అన్నం అందించడం, పిల్లలను చూడడం వంటి సామాజిక కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొన్నారు. చిన్నతనం నుంచే సమస్యలపై స్పష్టత, పరిష్కారానికి పోరాడటం తెలిశాయంటే.. ప్రజా సమస్యలపై అవగాహన, సోషలిజం సిద్ధాంతాన్ని అర్థం చేసుకోవడం వల్లేనని ఆమె ఎంతో స్పష్టంగా చెబుతారు.

1997 ఎన్నికల తర్వాత ఈమె లేబర్ పార్టీలో చేరారు. 1999లో గాల్వే సిటీకి కౌన్సిలర్‌గా ఎన్నికయ్యారు. తనను చూసి స్ఫూర్తి పొంది తన సోదరి కూడా రాజకీయాల్లోకి వచ్చారు. 2004లో ఈమె సోదరి కోలెట్ కూడా కౌన్సిల్ ఎన్నికల్లో పోటీ చేశారు. సిటీ పశ్చిమ ప్రాంతంలో తన సోదరి పోటీ చేయగా.. కొన్నోలీ నగర మేయర్‌గా పోటీ చేశారు. అక్కచెల్లెళ్లిద్దరూ ఈ ఎన్నికల్లో గెలుపొందడం విశేషం. కేథరిన్ కౌన్సిలర్‌గా 17 సంవత్సరాలు పనిచేశారు. ఇందులో ఒక సంవత్సరం (2004–2005) మేయర్‌గా బాధ్యతలు నిర్వహించారు. స్థానిక రాజకీయాల నుంచి జాతీయ రాజకీయాల్లోకి వెళ్లే క్రమంలో ఆమెకెన్నో ఆటుపోట్లు ఎదురయ్యాయి. వాటినన్నింటినీ తట్టుకుని నిలబడ్డారు.

2007లో పార్టీ నుంచి బయటకొచ్చి స్వతంత్రంగా పోటీ చేశారు. అయితే, 2007లోనూ, 2011లోనూ ఓటమి చెందారు. 2016 సార్వత్రిక ఎన్నికల్లో గాల్వే వెస్ట్ నియోజకవర్గం నుండి పోటీ చేసి డైల్ ఐరన్ (పార్లమెంటు దిగువ సభ)కు ఎన్నికయ్యారు. 2020 జూలై నుండి 2024 నవంబర్ వరకు ఐరిష్ పార్లమెంట్ డిప్యూటీ స్పీకర్ పదవిలో ఉన్నారు. ఈ పదవిని నిర్వహించిన మొదటి మహిళగా ఈమె రికార్డు సృష్టించారు.

కౌన్సిలర్‌గా, మేయర్‌గా ఉన్న సమయంలో ఈమె సముద్ర తీర ప్రాంతానికి సమీప నగరమైన గాల్వే అభివృద్ధికి కృషి చేశారు. వాతావరణానికి సంబంధించి విషయాల్లోనూ, వ్యర్థాల నిర్వహణ, పునరుత్పాదక ఇంధన అభివృద్ధి వంటి రంగాల్లో స్థానిక నియంత్రణ అవసరమని నొక్కి చెప్పారు. రోడ్లను అభివృద్ధి చేశారు. సమాజంలోని అన్ని వర్గాల సమానత్వం కోసమే ఆమె అహర్నిశలు కృషి చేశారు. ఐరిష్ జాతి ప్రయోజనాలకు ఆమె ఎంత నిబద్ధతతో కట్టుబడి ఉన్నారనడానికి పార్లమెంటులో ఆమె చేసిన ప్రసంగాలే సాక్ష్యం.

2025 అధ్యక్ష ఎన్నికల ప్రచారంలోనూ ఆమె ప్రజా సమస్యలపైనే గళమెత్తారు. ఇళ్లు, అద్దెదారుల హక్కులు, కార్మికుల సంక్షేమం, వికలాంగుల హక్కులు, ఐరిష్ భాషను పరిరక్షణ తదితర అంశాలపై హామీనిచ్చారు. ఆ సమస్యలపై ఆమెకున్న స్పష్టత, ప్రజలకు వాటి అవసరత ఆమెను విజయపథానికి నడిపించాయి. కేథరిన్ సోషల్‌మీడియాలో చాలా యాక్టివ్‌గా ఉంటారు. చిన్నారులతో ఆడుకునేటప్పుడు చిన్నపిల్లలా అయిపోతారు. అధ్యక్ష ఎన్నికల ప్రచారంలో వీధులో చిన్నారులతో ఫుట్‌బాల్ ఆడిన వీడియో కూడా తెగ వైరల్ అయింది. ఈమెకు స్పోర్ట్ అన్నా మక్కువే. యుక్త వయసులో ఉన్నప్పుడు అనేక మారథాన్, బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొన్నారు.

ఐర్లాండ్ దేశ జనాభా 53 లక్షలు. ఇప్పటికీ యునైటెడ్ కింగ్‌డమ్ నియంత్రణలోనే ఉంది. ప్రపంచవ్యాప్తంగా ఐదు నుండి 8 కోట్ల మంది ఐరిష్ వారు ఉన్నారని ఓ అంచనా. అనేక ప్రాథమిక అవసరాలు కూడా తీరని ప్రజలు పెద్ద సంఖ్యలో ఉన్నారు. ఈ నేపథ్యంలో అధ్యక్షురాలిగా ఎన్నికైన కేథరీన్ ముందు ఎన్నో సవాళు ఉన్నాయి. ప్రధాన సమస్య ప్రజలందరికీ సొంత నివాస గృహాలు లేకపోవడం. ఇక్కడి భూములు రియల్ ఎస్టేట్‌కు అనువుగా మారడంతో రియల్‌ఎస్టేట్ వ్యాపారం ఊపందుకుని భూముల ధరలు అమాంతం పెరిగిపోయాయి. గృహాల ధరలు పెరిగి ఇళ్ల కొరత ఏర్పడింది. అక్కడి ఉద్యోగులు జీతంలో ఎక్కువ భాగం అద్దె ఇంటికే చెల్లించాల్సిన పరిస్థితి. అమెరికా, యూరోపియన్ యూనియన్ దేశాల ఒత్తిళ్లకు తలొగ్గమనే ప్రత్యర్థి రాజకీయ పార్టీల సవాళ్ల వెంటాడుతాయి. ఈ సమయంలో ఆమెకు మద్దతు ఇచ్చిన కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఐర్లాండ్, గ్రీన్ పార్టీ, లేబర్‌పార్టీ, పీపుల్ బిఫోర్, సోషల్ డెమోక్రటిక్ పార్టీల సమన్వయంతో ఆమె ఈ బాధ్యతలను నిర్వహించనున్నారు.

- సరికొండ భవాని

సరికొత్త కథలు.. చక్కని సందేశాలు

దసరా... దీపావళి పండుగలు వెళ్లిపోయాయి. బాలకృష్ణ కథానాయకుడిగా తెరకెక్కిన 'అఖండ 2' మూవీ డిసెంబర్ 5న విడుదల కానుంది. క్రిస్మస్‌కు విశ్వక్‌సేన్ నటించిన 'ఫంకీ', అడవిశేష్ 'డెకాయిట్', ఆది సాయికుమార్ 'శంబాల', రోషన్ 'చాంఫియన్' సినిమాలు విడుదలకు సిద్ధంగా ఉన్నాయి. సాయి ధరమ్‌తేజ్ 'సంబరాల యేటిగట్టు' సినిమా కూడా త్వరలోనే విడుదల కానుంది. ఈ దీపావళికి అక్టోబర్ 17న తెలుసుకదా, కె.ర్యాంప్, డ్యూడ్, మిత్రమండలి, 31న మాస్‌జాతర వంటి సినిమాలు విడుదలైనా పెద్ద సందడి కనిపించలేదు. డ్యూడ్ తర్వాత ఒక్క కె.ర్యాంప్ సినిమా మాత్రం కాస్త జోరుగా కనిపించింది.

ఈ ఏడాది దీపావళికి పెద్ద కథానాయకుల సినిమాలు లేకపోయినా చిన్న కథానాయకుల సినిమాలు వెండితెరపై కొత్త కాంతులను వెలుగొందేలా చేశాయి. క్రిస్మస్ మూవీల తర్వాత కొత్త ఏడాది పెద్ద కథానాయకుల చిత్రాలు వరుసగా ఒక్కొక్కటి విడులయ్యే అవకాశాలు ఉన్నాయి. చిరంజీవి 'విశ్వంభర', 'మన శంకరవరప్రసాద్ గారు', పవన్ కళ్యాణ్ 'ఉస్తాద్‌భగత్‌సింగ్', రామ్ చరణ్ 'పెద్ది' సినిమాల టీజర్లు, ట్రైలర్లు ఇప్పటికే సోషల్‌మీడియాలో విపరీతంగా ట్రెండింగ్‌లో ఉన్నాయి. మహేష్‌బాబు–రాజమౌళి సినిమాకు 'వారణాసి' సినిమా టైటిల్‌ను పెడతారనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. అల్లు అర్జున్–అట్లీ, వెంకటేష్– త్రివిక్రమ్ సినిమాలు బిజీ షెడ్యూళ్లతో కొనసాగుతున్నాయి.



గంజాయ్ సామ్రాజ్యాన్ని కూల్చే 'మాస్ జాతర'

రవితేజ, శ్రీలీల జోడీగా నటించిన చిత్రం 'మాస్ జాతర' ప్రేక్షకుల నుంచి మిశ్రమ స్పందనను అందుకుంది. 'క్రాక్', 'పవర్', 'విక్రమార్కుడు'.. ఇలా ఆయన కెరీర్‌లో పోలీస్ కథలతో హిట్లు కొట్టారు. 'మాస్ జాతర'లో రైల్వే పోలీస్‌గా సరికొత్త రూపంలో కన్పించారు రవితేజ. లక్ష్మణ్ భేరి (రవితేజ) నిజాయితీ గల రైల్వే పోలీస్. తన కళ్ల ఎదురుగా అన్యాయం జరిగితే.. అది తన పరిధిలోనిది కాకున్నా దాన్ని తన ఆధీనంలోకి తెచ్చుకుని మరీ న్యాయం చేసే ప్రయత్నం చేస్తుంటాడు. ఈ క్రమంలోనే వరంగల్‌లో పని చేసే సమయంలో ఓ మంత్రి కొడుక్కి తనదైన శైలిలో బుద్ధి చెప్తాడు. ఆ తర్వాత తను అల్లూరి జిల్లాలోని అడవివరం రైల్వే స్టేషన్‌కు బదిలీపై వస్తాడు. కొండల మధ్య ఉండే గిరిజన ప్రాంతాన్ని శివుడు (నవీన్ చంద్ర) శాసిస్తుంటాడు. ఆ చుట్టుపక్కల ప్రాంతాల్లోని రైతులతో శీలావతి రకం గంజాయిని పండించి.. దాన్ని కోల్‌కతాకు స్మగ్లింగ్ చేస్తుంటాడు. లక్ష్మణ్ ఆ ఊర్లోకి అడుగు పెట్టడంతోనే శివుడికి ఎదురు వెళ్లడం మొదలు పెడతాడు. జిల్లా ఎస్పీ నుంచి మొదలు.. మొత్తం రాజకీయ వ్యవస్థ అండగా ఉన్న శివుడ్ని ఓ మామూలు రైల్వే ఎస్పై ఎలా అడ్డుకున్నాడు? అతని గంజాయి సామ్రాజ్యాన్ని ఎలా కూలదోశాడు? అనేది మొత్తం కథాంశం. దర్శకుడు భాను భోగవరపు ఎంటర్‌టైన్‌మెంట్, మాస్ యాక్షన్ అంశాల్ని మేళవిస్తూనే కథలో కొత్తదనం చూపించటానికి ప్రయత్నించినా వర్కవుట్ కాలేదు. ప్రీక్లైమాక్స్‌లో రిటైర్డ్ ఆర్మీ ఆఫీసర్‌గా హనుమాన్ భేరి పాత్రలో రాజేంద్రప్రసాద్ చేసిన యాక్షన్ హంగామా అలరిస్తుంది. శ్రీలీల మాస్ స్టెప్పులతో అలరిస్తుంది.

బందీఖానా నుంచి బయటపడే సత్తానే 'ది గర్ల్‌ఫ్రెండ్'

తనని తానుగా స్వీకరించని బంధం నుంచి..ఆ బందీఖానా నుంచి ఓ యువతి ఎలా బయట పడిందనేదే 'ది గర్ల్‌ఫ్రెండ్' కథాంశం. భూమాదేవి (రష్మిక) పుట్టగానే తల్లిని పోగొట్టుకుంటుంది. తల్లిలేని బిడ్డ కావడంతో గారాబంగా పెంచుతాడు తండ్రి రావు రమేష్. థియేటర్ ఆర్ట్స్, లిటరేచర్‌పై ఉన్న మక్కువతో రామలింగయ్య ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ ఎంఏ లిటరేచర్‌లో చేరుతుంది. చదువు తప్ప వేరే ధ్యాస లేని భూమాదేవి.. అనూహ్య పరిస్థితుల్లో అదే కాలేజ్‌లో చదివే విక్రమ్ (దీక్షిత్‌శెట్టి) ప్రేమలో పడుతుంది. వారి ప్రేమ.. హద్దులు దాటేసరికి విక్రమ్‌లోని జెలసీ భూమాదేవి స్వేచ్ఛను హరించే స్థాయికి చేరుకుంటుంది. అతనిలోని అహంకారం, అనుమానం, హింసాత్మక ప్రవర్తన నుంచి బయట పడటానికి భూమాదేవి పడిన సంఘర్షణే మిగిలిన కథ. చి.ల.సౌ, మన్మథుడు 2 చిత్రాలతో అభిరుచి గల దర్శకుడనిపించుకున్న రాహుల్ రవీంద్రన్.. ప్రేమకథల్లో ఓ కొత్త కోణాన్ని చూపించారు. కాలేజ్ బ్యాక్ డ్రాప్‌లో సాగే ప్రేమ కథలో వుమెన్ సెంట్రిక్ అంశాన్ని జోడించి.. ప్రేక్షకులు ఈ కథకు రిలేట్ అయ్యేట్టు చేశారు. 'బదులు లేని ప్రశ్నలకు భయపడి నీ నుంచి నువ్వు పారిపోకు.. నువ్వు నచ్చినవాడి విన్నపాలనే కాదు.. నీ మనసు కోరుకునే విన్నపాలను విను' అనే కోర్ ఎమోషన్‌ని ఆయా పాత్రలతో అద్భుతంగా పండించారు. ఓ అమ్మ.. ఓ కూతురు.. ఓ తండ్రి.. ఓ స్నేహితుడు.. ఈ చిత్రంలోని కథను ఈ క్యారెక్టర్లు నడిపిస్తాయి. పాత్రల చుట్టూ తిరిగే కథ కావడంతో ఎమోషనల్ కనెక్ట్ అవుతుంది. దసరా సినిమాతో తెలుగు ఆడియన్స్‌కి చేరువైన దీక్షిత్ శెట్టి.. ఈ సినిమాలో మల్టీ షేడ్స్ ఉన్న విలక్షణ పాత్రలో బాగానే నటించాడు. అల్లు అరవింద్ సమర్పణలో సమర్పణలో ధీరజ్ మొగిలినేని, విద్య కొప్పినీడి నిర్మాతలుగా ఈ సినిమా తెరకెక్కింది.

కుల వ్యవస్థపై 'చౌదరి గారి అమ్మాయి' తిరుగుబావుటా :

ఎల్లో టకోమా ప్రొడక్షన్ బ్యానర్‌లో ఎడ్‌కాన్ ప్లస్ సంస్థ నిర్మించిన సినిమా 'చౌదరి గారి అమ్మాయి' ఈనెల రెండోతేదీన విడుదలైంది. సిద్ధూ వర్మ కాకాని దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమాలో వినయ్‌తేజ్, రిషిత జోడీగా నటించారు. ప్రముఖ రంగస్థల, సినీ క్యారెక్టర్ ఆర్టిస్ట్ వీరంకి వెంకట నరసింహారావు చౌదరి పాత్రలో తనదైన స్టైయిల్‌లో ఆహార్యాన్ని ప్రదర్శించారు. కుల జాడ్యంతో ఉంటే ఎలాగుంటారోననే విషయాన్ని ఆయన చక్కటి హావభావాలతో ప్రదర్శించారు. కుల వ్యవస్థ పునాదులు, దానిని పోషిస్తున్న విధానాన్ని పట్టిచూపారు. ఆయన కుమారుడిగా, కథానాయిక రిషిత తండ్రి పాత్రలో ప్రముఖ రంగస్థల, సినీక్యారెక్టర్ ఆర్టిస్ట్ రంగనాయకులు పోలుదాసు జీవించారనే చెప్పొచ్చు. 'ఎవడో తలకమాసినోడు..వీడు ఊళ్లో ఉండాలి, వారు ఊరు బయట ఉండాలి అంటూ కులాలవారీగా

మనుషులను విభజిస్తే...బాగా చదువుకున్న నీవు కుల దురహంకారంతో ప్రాణాలతో చెలగాటమాడుతావా? అంటూ సినిమాలో సాగే సన్నివేశాలు ఆద్యంతం ఆలోచింపజేసేవిగా ఉన్నాయి. 'కులమనేది కుళ్లిన పెంటతో సమానం' అంటూ మానవీయ విలువలు ఎలా తగ్గిపోతాయే తన సంభాషణలతో పదునైన భావంతో రక్తి కట్టించారు. కులం కూడుపెట్టదు, మతం వల్ల ఉపయోగం లేదు. మానవత్వమే మనుషుల ప్రాణాలను కాపాడుతుందనే సందేశాన్ని మంచి నటనతో ప్రదర్శించారు. కథ, స్క్రీన్ ప్లే, డైలాగులు, ఎడిటింగ్, దర్శకత్వం వంటి బాధ్యతలను తన భుజాన కెత్తుకున్న సిద్ధువర్మ సినిమాలో పోషించిన పాత్ర మొత్తానికి హైలెట్‌గా నిలిచింది. హీరోయిన్ తల్లిగా చేసిన లక్ష్మి నటన చాలా చక్కగా సాగింది.

ఈ చిన్ని నీలి చుక్కను కాపాడుకుందాం



ఈ చిత్రంలో కనిపిస్తున్న లేతనీలపు చిన్న చుక్కను చూశారా.. ఇది మరేదో కాదు..! మనకు బాగా తెలిసిన, మనం నివస్తున్న భూమి.. నాసా ప్రయోగించిన వోయెజర్ 1 అనే స్పేస్ ప్రోబ్ 1990లో సుమారు ఆరు బిలియన్ల (600 కోట్లు) కిలోమీటర్ల దూరం నుంచి సౌర కుటుంబాన్ని ఫోటో తీసినప్పుడు ఇందులో మన భూమి ఈ విధంగా కనిపించింది. ఈ చిత్రం గురించి ప్రముఖ అమెరికన్ ఖగోళ, నక్షత్ర శాస్త్రవేత్త కార్ల్ సాగన్ క్రింద విధంగా వ్యాఖ్యానించారు.

'ఈ చుక్కను మళ్లీ మళ్లీ చూడండి. అక్కడ ఉంది.. అది మన ఇల్లు. అది మనమే. మీరు ప్రేమించే ప్రతీ ఒక్కరూ, మీకు తెలిసిన ప్రతీ ఒక్కరూ, మీరు విన్న ప్రతీ ఒక్కరూ.. ఇప్పటివరకూ ఉన్న ప్రతీ మానవుడు.. వారి జీవితాలను ఇక్కడే గడిపారు. మన ఆనందాలు, బాధలు, నమ్మిన వేలాది మతాలు, సిద్ధాంతాలు, భావాల సముదాయం. ప్రతీ వేటగాడు, ఆహారాన్వేషి, ప్రతీ హీరో, నాశనం కోరుకునేవాడు, ప్రతీ రాజు, రైతు, ప్రేమలో మునిగితేలే ప్రతీ యువజంట, ప్రతీ తల్లి, తండ్రి, ఆశలతో నిండిన చిన్నారి, ఆవిష్కర్త, అన్వేషకుడు, నీతులు చెప్పే గురువులు, ప్రతీ అవినీతి రాజకీయ నాయకుడు, ప్రతీ 'సూపర్‌స్టార్', మనవజాతి చరిత్రలో ప్రతీ సాధువు, పాపి అక్కడే నివసించారు'

'జీవించడానికి ఇప్పటి వరకూ తెలిసిన ఏకైక ప్రపంచం భూమి. సమీప భవిష్యత్‌లో కూడా మన మానవ జాతి వలస వెళ్లడానికి, సందర్శించడానికి మరెక్కడా ప్రదేశం లేదు. కాబట్టి.. మీకు నచ్చినా.. నచ్చక పోయినా.. సిద్ధపడండి. మనల్ని మనం తయారుచేసుకునే ప్రదేశం భూమి. వినయాన్ని, వ్యక్తిత్వాన్ని నిర్మించేదే ఖగోళ శాస్త్రం. మన ఈ చిన్న ప్రపంచం యొక్క సుదూర చిత్రం కన్నా మన అహంకారం, మూర్ఖత్వానికి మెరుగైన ప్రదర్శన మరొకటి లేదు. నా వరకూ.. ఈ చిత్రం మనం ఒకరితో ఒకరు మరింత దయతో వ్యవహరించడం, మనకు తెలిసిన ఏకైక నివాసమైన ఈ చిన్ని లేతనీలపు చుక్కను కాపాడుకోవడం, ఆదరించడంలో మన బాధ్యతను తట్టి లేపుతుంది'.

విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న మంత్రులు

ఓవరాల్ ఛాంపియన్ అనంతపురం

- ముగిసిన రెవెన్యూ క్రీడలు

ప్రజాశక్తి- అనంతపురం

అనంతపురంలో మూడు రోజులపాటు నిర్వహించిన రెవెన్యూ క్రీడోత్సవాలు ఆదివారం ముగిశాయి. ఓవరాల్ ఛాంపియన్‌గా అనంతపురం నిలిచింది. ముగింపు కార్యక్రమానికి రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, బిసి సంక్షేమ శాఖ మంత్రి సవితమ్మ హాజరయ్యారు. వీరితోపాటు అంతర్జాతీయ బ్యాట్మింటన్ క్రీడాకారుడు శ్రీకాంత్, అంతర్జాతీయ టెన్నిస్ క్రీడాకారుడు సాకేత్ , జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్, జాయింట్ కలెక్టర్ శివ్‌నారాయణ్ శర్మ, అమరావతి ఎపి రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ అధ్యక్షులు బొప్పరాజు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. ఈ నెల ఏడున నగరంలోని ఆర్‌డిటి క్రీడా గ్రామంలో ప్రారంభమైన క్రీడలు ,సాంస్కృతిక ఉత్సవాల్లో 26 జిల్లాల నుంచి విచ్చేసిన రెవెన్యూ ఉద్యోగులు పాల్గొన్నారు. పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

ముగిసిన రాష్ట్ర స్థాయి చెస్ పోటీలు

ప్రజాశక్తి - సీతానగరం (పార్వతీపురం మన్యం జిల్లా)

పార్వతీపురం మన్యం జిల్లా సీతానగరం మండలంలోని జోగింపేటలోని గిరిజన సంక్షేమశాఖ గురుకుల ప్రతిభా పాఠశాలలో మూడురోజుల పాటు జరిగిన 69వ రాష్ట్ర స్థాయి చదరంగం పోటీలు ఆదివారంతో ముగిశాయి. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యాన జరిగిన ఈ ప్రతిష్టాత్మక పోటీల్లో రాష్ట్రం నలుమూలల నుంచి 398 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. అండర్–14, 17, 19 విభాగాల్లో వ్యక్తిగత, జట్ల విభాగాల్లో విజయం సాధించిన క్రీడాకారులు జాతీయ స్థాయి పోటీల్లో రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహించడానికి నేషనల్ టీమ్‌కు ఎంపికయ్యారు. ఈ మూడు విభాగాల నుంచి బాలికలు 15 మంది, బాలురు 15 మంది ఎంపికైనట్లు నిర్వాహకులు తెలిపారు.

11 బంతుల్లోనే అర్ధ శతకం

- వరుసగా ఎనిమిది సిక్స్‌లు
- రంజీ ట్రోఫీలో మేఘాలయ క్రికెటర్ ఆకాష్ కుమార్ ప్రపంచ రికార్డు

సూరత్ : మేఘాలయ క్రికెటర్ ఆకాష్ కుమార్ ఫస్ట్–క్లాస్ క్రికెట్‌లో అత్యంత వేగవంతమైన అర్ధ సెంచరీ చేసి ప్రపంచ రికార్డు సాధించాడు. 25 ఏళ్ల ఆకాష్ 11 బంతుల్లోనే హాఫ్ సెంచరీ సాధించాడు. రంజీ ట్రోఫీలో సూరత్ వేదికగా అరుణాచల్ ప్రదేశ్‌తో జరుగుతున్న ప్లేట్ గ్రూప్ మ్యాచ్‌లో ఈ ఘనత సాధించాడు. ఈ క్రమంలోనే వేన్ వైట్ రికార్డును (12 బంతుల్లో హాఫ్ సెంచరీ)ను అధిగమించాడు. 2012లో లీసెస్టర్‌షైర్ ఆటగాడు వేన్ వైట్ ఎసెక్స్ జట్టుపై 12 బంతుల్లో అర్ధ శతకం చేశాడు. ఇప్పుడా రికార్డు బద్దలైంది. ఈ మ్యాచ్‌లో ఆకాశ్ 14 బంతుల్లో 50 పరుగులతో అజేయంగా నిలిచాడు. ఇతను వరుసగా ఎనిమిది సిక్స్‌లు బాదేయగా.. ఒకే ఓవర్‌లో ఆరు సిక్సర్లు కొట్టడం విశేషం. ఈ క్రమంలోనే ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో వరుసగా ఎనిమిది సిక్స్‌లు కొట్టిన తొలి ప్లేయర్‌గా రికార్డు సృష్టించాడు. అంతకుమందు మేఘాలయ బ్యాటర్లు అర్పిత్ (207), రాహుల్ దలాల్ (144), కిషన్ లింగ్డో (119) పరుగుల వరద పారించారు. దీంతో ఆ జట్టు తొలి ఇన్నింగ్స్‌ను 628/6 వద్ద డిక్లేర్ చేసింది.

అనంతరం ఫస్ట్ ఇన్నింగ్స్ మొదలుపెట్టిన అరుణాచల్ ప్రదేశ్.. 73 పరుగులకే కుప్పకూలింది. మేఘాలయ స్పిన్నర్ ఆర్యన్ (4/16) అదరగొట్టగా.. ఆరోన్ 2, డిప్పు సంగ్మా 2, ఆకాశ్, స్వస్తిక్ ఒక్కో వికెట్ పడగొట్టారు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68